


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 290 | ఆదివారం | 20 -09-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

విమానాశ్రయానికి ఏ పేరు పెడదాం?
వరంగల్‌లో ప్రపంచస్థాయి విమానాశ్రయం కల సాకారం : సిఎం రేవంత్‌రెడ్డి
03

# ట్రంప్ గుప్పెట్లోకి గ్రీన్‌లాండ్

## వచ్చేవారం ఐక్యరాజ్య సమితిలో సంతకాలు



- నాటోయేతర దేశాలకు ఏ అధికారాలూ ఉండవు
- ధ్రువీకరించిన డెన్మార్క్–గ్రీన్‌లాండ్ నాయకులు
- రష్యా–చైనా వ్యతిరేక గోల్డెన్‌డోమ్ ప్రాజెక్టుకు కీలకం

**వాషింగ్టన్ :** గ్రీన్‌లాండ్ భద్రతపై డెన్మార్క్‌తో అమెరికా ఒక ఒప్పందం చేసుకుంది.ఆర్కిటిక్–అట్లాంటిక్ మహాసముద్రాల మధ్య ఉన్న ప్రపంచంలోనే అతిపెద్దదైన ద్వీపం గ్రీన్‌లాండ్ భూభాగం డెన్మార్క్ సామ్రాజ్యంలో ఒక అంతర్భాగం. ఈ ఒప్పందం పేరుతో ఇక గ్రీన్‌లాండ్‌పై అమెరికాకు అపరిమితమైన శాశ్వత అధికారాలు లభిస్తాయి. వచ్చేవారం ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఆ వేదికపై అమెరికా, గ్రీన్‌లాండ్, డెన్మార్క్ దేశాల నాయకులు ఒప్పందంపై సంతకాలు చేస్తారు. ఒక మంచి ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయని, తామెంతో సంతోషిస్తున్నామని డెన్మార్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడరిక్సన్ అన్నారు. గ్రీన్‌లాండ్ ప్రధానమంత్రి జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్‌తో కలిసి సంయుక్త ప్రకటన విడుదల చేస్తూ, ఆర్కిటిక్,ఉత్తర అట్లాంటిక్ ప్రాంతంలో మన ఉమ్మడి భద్రతను ఈ ఒప్పందం బలోపేతం చేస్తుందని మెట్టే ఫ్రెడరిక్సన్ పేర్కొన్నారు. తమ రాజ్య సార్వభౌమాధికారాన్ని, ప్రజల స్వీయ నిర్ణయాధికారాన్ని కూడా ఈ ఒప్పందం గుర్తిస్తుందన్నారు. ఈ ఒప్పందంపై ఈ రెండు దేశాల నాయకులూ చాలా ఆశాభావంతో, సానుకూల ధోరణితో ఉన్నారు. ఈ భూభాగం డేనిష్ నియంత్రణలో ఉన్నప్పటికీ ఒప్పందం ప్రకారం అమెరికా అక్కడ ఏకపక్ష నిర్ణయాలతో నిర్మాణాలు,కార్యకలాపాలు కొనసాగిస్తుంది. ఇకమీదట అమెరికా అనుమతి లేకుండా గ్రీన్‌లాండ్‌లో ఎవ్వరూ ఎలాంటి సైనిక కార్యకలాపాలుగానీ, సున్నితమైన పెట్టుబడుల ఒప్పందాలుగానీ చేసే అవకాశం లేదు. సోషల్ మీడియా వేదికగా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇదే విషయం చెప్పారు. అమెరికా జాతీయ భద్రతపై నెలకున్న ఆందోళన సమస్యను ఈ ఒప్పందం పరిష్కరిస్తుందన్నారు. రష్యా–చైనాకు వ్యతిరేకంగా అమెరికా తలపెట్టిన గోల్డెన్ డోమ్ రక్షణ వలయ ప్రాజెక్టు నిర్మాణానికి ఈ భూభాగం ఎంతోముఖ్యమైనదని ట్రంప్ చెబుతూ వస్తున్నారు. గ్రీన్‌లాండ్ భద్రతపై అమెరికాతో ఒప్పందం కుదిరిందని, ఈ ప్రాంతంలో భద్రతను బలేపేతం చేసే ఒప్పందాన్ని స్వాగతిస్తున్నట్లు డెన్మార్క్,గ్రీన్‌లాండ్ పాలకులు శనివారం పేర్కొన్నారు.వచ్చేవారంలో తరువాయి 8లో



# దేశ వ్యాప్తంగా 15% లోటు వర్షపాతం

- దక్షిణ ద్వీపకల్పంలో 29 శాతం లోటు
- రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి : ఐఎండి

**న్యూఢిల్లీ :** ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది దేశ వ్యాప్తంగా లోటు వర్షపాతం నమోదైంది. ఈ ప్రభావం మెట్ట పంటలపై తీవ్రంగా పడగా, వరి సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. కొన్ని ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు నాలుగు నెలల వర్షాకాల సీజన్ ముగింపు దశకు చేరింది. జూన్ 4న కేరళలో ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు, జూలై 9 నాటికి దేశమంతటా విస్తరించాయి. జూన్ 4 నుండి సెప్టెంబర్ 19 మధ్య దేశవ్యాప్తంగా 15 శాతం వర్షపాత లోటు నమోదైంది. ప్రస్తుతం అత్యంత తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతం దక్షిణ ద్వీపకల్పంలో 29 శాతం లోటు వర్షపాతం రికార్డు అయింది. శనివారం నాటికి పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాలు ఉపసంహరించున్నట్లు భారత వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకటించింది. రానున్న మూడు నాలుగు రోజుల్లో తరువాయి 8లో

# ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు త్రిముఖ వ్యూహం

## ఈ ఏడాది 65 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

- నిల్వలు.. హమాలీ.. రవాణకు ముందస్తు ప్రణాళిక - జిపిఎస్ ట్రాకింగ్‌తో అక్రమాలకు చెక్
- ఫిజికల్ వెరిఫికేషన్ యాప్‌తో ఆకస్మిక తనిఖీలు-సంసిద్ధమవుతున్న పౌరసరఫరాల శాఖ




ప్రజాపక్షం/ హైదరాబాద్

ఖరీఫ్ సీజన్ (2026–27) ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌరసరఫరాల శాఖ ముందస్తు వ్యూహంతో రంగంలోకి దిగింది. ఈ ఏడాది సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా నిర్ధేశించుకున్న పౌరసరఫరాల శాఖ అందుకు అనుగుణంగా చర్యలను చేపడుతోంది. కొనుగోళు ప్రక్రియ చివరి వరకు కొనసాగించకుండా కొనుగోళు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే కొనుగోలు చేయాలని నిర్ణయించింది.అక్టోబర్ మొదటి వారంలో కొనుగోళ్లు ప్రారంభించేందుకు సిద్దం అవుతోంది.

**ఈ ఏడాది త్రిముఖ వ్యూహం అమలు :**
ధాన్యం కోనుగోలుకు సంబంధించి ప్రతి ఏటా 8,400ల పై చిలుకు ధాన్యం కొనుగలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ హమాలీలతో పాటు గోదాముల్లో నిల్వ, లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకొడిగా సాగుతూ ఇటు రైతులు, అటు ప్రభుత్వం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సమస్యను అధిగమించి కొనుగోళు ప్రక్రియ వేగవంతగా కొనసాగేందుకు పౌరసరఫరా శాఖ ఈ ఏడాది ప్రత్యేకంగా నిల్వ–హమాలీ–రవాణా (ఎస్‌హెచ్‌టి)పేరుతో త్రిముఖ వ్యూహం అమలు చేస్తోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులు, గోదాముల వరకు ఎక్కడా జాప్యం లేకుండా తరలించడం, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడటం, అక్రమాలకు అడ్డుకట్ట వేయడం ఈ వ్యూహం ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా కొనుగోలు చేసిన ధాన్యం నిల్వలకు సంబంధించి ఈ ఏడాది ముందస్తుగానే ప్రత్యామ్నాయ నిల్వ కేంద్రాల గుర్తించి సిఏపివిధానంలోనూ నిల్వ చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. హమాలీల సమస్యలను నివారణకు సంబంధించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం దిగుమతి, బస్తాల్లో నింపడం, లోడింగ్, అన్‌లోడింగ్ వంటి పనుల్లో హమాలీల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. అవసరాన్ని బట్టి ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని హమాలీలను అందుబాటులో ఉంచేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. తద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రంలోకి వచ్చిన తర్వాత అక్కడే నిలిచిపోకుండా.. మిల్లులు, గోదాములకు వేగంగా తరలించడంపైనా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు.ధాన్యం రవాణాలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. ధాన్యం తరలించే ప్రతి వాహనానికి జిపిఎస్ ఆధారిత టిఎల్‌టిఎస్ ట్రాకింగ్ తప్పనిసరి చేయనున్నారు. దీంతో వాహనం ఎక్కడి నుంచి బయలుదేరింది.. ఎక్కడికి చేరింది.. మార్గమధ్యంలో ఎక్కడ ఆగింది వంటి వివరాలను పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. స్టాక్ డైవర్షన్ వంటి అక్రమాలకు అవకాశం లేకుండా రవాణా వ్యవస్థను తరువాయి 8లో



ఎర్రవల్లిలో

# తుది దశకు రెవెన్యూ సర్వే

## మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన అధికారులు

ప్రజాపక్షం/జగదేవ్‌పూర్

మాజీ సిఎం కెసిఆర్ ఫామ్‌హౌస్ వ్యవహారంలో కీలకంగా మారిన సర్వే నంబర్ 325లో మూడోరోజు రెవెన్యూ అధికారులు సర్వే ప్రారంభించి మూడు గ్రామాల సరిహద్దులు గుర్తించారు. అసైన్డ్ భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుండి సిద్దిపేట జిల్లా రెవెన్యూ అధికారులు, మూడు సర్వే బృందాలతో ప్రభుత్వ భూమి, పట్టా భూమి హద్దులను వేరు చేస్తూ హద్దులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమికి సంబంధించిన పాత మ్యాపులు, ప్రస్తుత ధరణి రికార్డులను తరువాయి 12లో

# ‘22ఎ’ సమస్యలకు త్వరలో ముగింపు

- 12 అంశాలలో ఇప్పటికే 2 అంశాలకు జిఓ జారీ
- మంత్రి పొంగులేటి వెల్లడి
- ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు ధృవ పత్రాల అందజేత



ప్రజాపక్షం/రంగారెడ్డి

భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో చేసిన ప్రకటన మేరకు త్వరలో ప్రజలకు తీపికబురు అందుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. దీనిలో భాగంగా అసెంబ్లీలో ప్రకటించిన 12 అంశాలపై దృష్టి సారించి దశల వారీగా వాటిని నెరవేరుస్తున్నామని ఈ మేరకు కాలనీల సమస్యపై జీవో 118, సింగరేణి ప్రాంతంలో ఇళ్ల స్థలాల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన జిఓ 76ను విడుదల చేశామన్నారు. శనివారం ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించి సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ధృవ పత్రాలను సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇతర ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి పొంగులేటి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు ఈ క్యూర్ ప్రాంతాన్ని ప్రపంచంలోనే నెంబర్ 1 ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు సమస్యల పరిష్కారానికి ఆధార్ వలే భూధార్ కార్డులు ఇస్తామని, క్యూర్ ప్రాంతంలో కూడా ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాల ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వలేమని తమకు ప్రజాసేవే ముఖ్యమని అన్నారు. ముఖ్యమంత్రి సూచనలు, 12 అంశాల మేరకు ఎల్.బి.నగర్ తరువాయి 8లో

నందిగ్రామ్ ఉప ఎన్నికల వేళ

# కాంగ్రెస్ అభ్యర్థి ప్రధాన్ అరెస్టు



## అక్టోబర్ 3 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపిన స్థానిక కోర్టు

**హల్దియా :** పశ్చి బెంగాల్‌లో అధికార బిజెపి హత్యారాజకీయాలకు, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు కనిపిస్తోంది. ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులపై గతంలో ఉన్న కేసులను తవ్వితీస్తూ వారిని జైళ్లకు పంపుతోంది. 19 ఏళ్ల నాటి హత్యతో సహా పలు అభియోగాలపై కాంగ్రెస్ నందిగ్రామ్ ఉప ఎన్నికల అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరు పర్చగా, అతనికి స్థానిక కోర్టు అక్టోబర్ 3 వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. శుక్రవారం అరెస్టు అయిన ప్రధాన్‌ను హల్దియా సబ్‌డివిజనల్ కోర్టులో హాజరుపరిచారు. నందిగ్రామ్‌లో 2007 నాటి భూసేకరణ వ్యతిరేక ఉద్యమ సమయంలో నమోదైన అల్లర్లు, హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, నేరపూరిత బెదిరింపులకు సంబంధించిన బెయిల్ రాని కేసులలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రధాన్‌ను, పెండింగ్‌లో ఉన్న నాలుగు అరెస్టు వారెంట్ల ఆధారంగా అరెస్టు చేసినట్లు పశ్చిమ బెంగాల్ పోలీసులు తెలిపారు. ఆయనపై ఆయుధ చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కూడా కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రధాన్ తరఫు న్యాయవాది మాట్లాడుతూ ‘నందిగ్రామ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించిన మూడు వారెంట్ల విషయంలో కోర్టు మిలన్ ప్రధాన్‌ను 14 రోజుల పాటు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఖేజురి పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించి జారీ అయిన నాలుగవ వారెంట్ విషయంలో సోమవారం ఆయనను కాంటై కోర్టులో హాజరుపరుస్తారు’ అని చెప్పారు. ‘గత 19 ఏళ్లుగా ప్రధాన్ పరారీలో ఉన్నారని, పోలీసులు ఆయన ఆచూకీ కనుగొనలేకపోయారని ప్రాసిక్యూషన్ కోర్టులో వాదించింది. ఇప్పుడు ఆయన ఆచూకీ దొరకడం వల్లే అరెస్టు చేశామని వారు పేర్కొన్నారు’ అని ఆయన తెలిపారు. అక్టోబర్ 6న జరగనున్న నందిగ్రామ్ అసెంబ్లీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రకటించిన కొద్ది గంటలకే ఈ అరెస్టు జరిగింది. అంతకుముందు ఆమె వర్గానికి చెందిన అభ్యర్థి సంచితా ప్రధాన్ డే పోటీ నుంచి తప్పుకున్నారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్షాన్ని లక్ష్యంగా చేసుకోవడానికే ఈ కేసును వాడుకుంటున్నారని కాంగ్రెస్, మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ వర్గం ఆరోపించాయి.



## యువత జీవితాలలో వెలుగులు

# నింపేందుకే మెగా జాబ్‌మేళా


- 350కి పైగా కంపెనీ ప్రతినిధులు హాజరు
- రూ.10వేల కోట్లతో ఉమ్మడి జిల్లా అభివృద్ధి చేస్తున్నాం : మంత్రి ఉత్తమ్

ప్రజాపక్షం/కోదాడ

మూడున్నర దశాబ్దాలుగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంత ప్రజలు తనను తన సతీమణి పద్మావతిని గుండెల్లో పెట్టుకుని ఎమ్మెల్యేలుగా గెలిపించారని, వారి రుణం తీర్చుకునేందుకు ఇక్కడి గ్రామీణ ప్రాంత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా జాబ్‌మేళాను ఏర్పాటు చేశామని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం కోదాడలోని సిసిరెడ్డి విద్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో తరువాయి 8లో

భారత్ – అమెరికా

# వాణిజ్య సంబంధాల్లో ఒడిదుడుకులు



**న్యూఢిల్లీ :** భారత్–అమెరికా మధ్య వాణిజ్య సంబంధాల్లో చాలా ఒడిదొడులకు కొనసాగుతున్నాయి. గతకాలపు అధ్యక్షుల హయాంలో అమెరికాకు వాణిజ్య వస్తువులను ఎగుమతి చేసే ప్రపంచ దేశాలు భారీ సుంకాలు వసూలు చేసి దోచుకున్నాయని, దీనివల్ల రాబడి కంటే ఎక్కువ సుంకాలు చెల్లించి అమెరికా నష్టపోయిందని, ఈ పరిస్థితిని చక్కదిద్దుతానని ట్రంప్ ప్రకటించారు. ఈ దిద్దుబాటు చర్యను విముక్తి దినంగా పేర్కొన్నారు.అమెరికాతో వ్యాపారంచేసే తరువాయి 12లో

హోంశాఖ పరిశీలనలో విజయన్‌పై

# ఎఫ్ఐఆర్ నమోదు

- కేరళం హోం మంత్రి రమేష్ చెన్నితల వెల్లడి
- సిపిఐ(ఎం) లక్ష్యంగా జరుగుతున్న దాడి : ఎం.ఎ. బేబీ



**పతానంతిట్ట :** కేరళం అసెంబ్లీ ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె వీణ టి, అల్లుడు, ఎమ్మెల్యే పి.ఎ. మహమ్మద్ రియాస్‌లపై అవినీతి కేసు నమోదు చేయాలన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ విషయమై అడ్వకేట్ జనరల్ నుండి చట్టపరమైన అభిప్రాయం తమకు అందిందని కేరళ హోం మంత్రి రమేష్ చెన్నితల తెలిపారు. ‘ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్’ (పిఎంఎల్‌ఎ) కింద జరిపిన దర్యాప్తు, సోదాలలో సేకరించిన ‘సాక్ష్యాల‘ ఆధారంగా, ఆరోపిత ‘కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సిఎంఆర్‌ఎల్) లంచం కేసులో విజయన్, వీణ, రియాస్, మరికొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఇడి ఇటీవల రాష్ట్ర పోలీసు చీఫ్ రావడ ఎ. చంద్రశేఖర్‌కు లేఖ రాసింది. ఐడి కన్సల్టెన్సీ సేవల ముసుగులో సిఎంఆర్‌ఎల్, వీణకు చెందిన ప్రస్తుతం మూతపడిన ‘ఎక్సలాజిక్ సొల్యూషన్స్’ సంస్థకు రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఇడి ఆరోపించింది. కాగా, శనివారం పతానంతిట్టలో విలేకరులతో చెన్నితల మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం ఆ చట్టపరమైన అభిప్రాయం తమకు అందిందని, తరువాయి 12లో



# సుప్రీంకోర్టుకు దానం

**హైదరాబాద్ :** తనపై అనర్హత వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో దానం నాగేందర్ శనివారం మధ్యాహ్నం పిటిషన్ ఫైల్ చేశారు. సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉంది. శుక్రవారం దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసింది. అయితే ఇప్పటికే బిఆర్ఎస్ సుప్రీంకోర్టులో కెవియట్ పిటిషన్ దాఖలు చేసింది. అనర్హతపై దానం నాగేందర్ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసే అవకాశం ఉండడంతో ముందుగానే కెవియట్ పిటిషన్ దాఖలు చేసింది. దానం నాగేందర్ పిటిషన్ దాఖలు చేస్తే తమ వాదన వినాలని కెవియట్ పిటిషన్ వేసింది.




## ల్యాబ్‌లో వజ్రాల తయారీ!



సహజ వజ్రం | ల్యాబ్‌లో తయారైన వజ్రం

ల్యాబ్‌లలో తయారు చేస్తున్న కృత్రిమ వజ్రాలకు ఇప్పుడు డిమాండ్ పెరుగుతున్నది. వీటిని 'ల్యాబ్ గ్రౌన్ డైమండ్స్' (ఎల్‌జిడి)గా పేర్కొంటారు. సహజ వజ్రాలకు ప్రత్యామ్నాయంగా ఇవి ప్రపంచ వ్యాప్తంగా ప్రాధాన్యం పొందుతున్నాయి. సహజ వజ్రాల తవ్వకంతో పర్యావరణ నష్టం, కార్మికుల భద్రత, మానవ హక్కు లు, సంఘర్షణలకు నిధుల సమకూర్పు వంటి స మస్యలు ముడిపడి ఉండటంతో ఈ సాంకేతికతకు ఆదరణ పెరుగుతోంది. ల్యాబ్‌లో తయారైన వజ్రాలు సహజ వజ్రాల మాదిరిగానే స్వచ్ఛమైన కార్బన్ స్ఫటిక నిర్మాణాన్ని కలిగి ఉంటాయి. వాటి భౌతిక, రసాయన లక్షణాలు కూడా సహజ వజ్రాలతో సమానంగా ఉంటాయి. అయితే సహజ వజ్రాల మాదిరిగా భౌగోళికంగా అరుదైనవి కావు. ఎల్‌జిడిలను ప్రధానంగా రెండు పద్ధతుల్లో తయారు చేస్తారు. అధిక పీడనం, అధిక ఉష్ణోగ్రత (హెచ్‌పిహెచ్‌టి) పద్ధతి భూమి అంతర్భాగంలోని పరిస్థితులను అనుకరిస్తుంది. కెమికల్ వేపర్ డిపాజిషన్ (సివిడి) పద్ధతిలో వజ్రపు చిన్న విత్తనంపై కా ర్బన్ పొరలను క్రమంగా పేరుకునే లా చేస్తారు. సాంకేతికత అభివృద్ధితో వీటి తయా రీ వ్యయం కూడా తగ్గుతోంది. భారతదేశం ఎల్‌జిడి రంగంలో స్వదేశీ సాంకేతిక సా మర్థ్యాన్ని పెంచుతోంది. 2023–24 కేంద్ర బడ్జెట్‌లో పరిశోధనకు ప్రాధాన్యం ఇ చ్చింది. ఐఐటి మద్రాస్‌లో రూ. 243 కో ట్లతో 'ఇండియా సెంటర్ ఫర్ ల్యాబ్ గ్రౌన్ డైమండ్'ను ఏర్పాటు చేసింది. వజ్రాల కటింగ్, పాలిషింగ్‌లో ప్రపంచ కేంద్రంగా ఉన్న భారత్‌కు ఎల్‌జిడి తయారీ సాంకేతికత మరింత వ్యూహాత్మక ప్రాధాన్యాన్ని అందిస్తోంది.

## ప్రపంచవ్యాప్తంగా పెరగనున్న ఉష్ణోగ్రతలు

పసిఫిక్ మహాసముద్రంలో మరోసారి శక్తివంతమైన ఎల్ నినో పరిస్థితులు వేగంగా బలపడుతున్నాయి. ఇది ఇప్పటికే వాతావరణ మార్పుల ప్రభావంతో వేడెక్కుతున్న ప్రపంచాన్ని మరింత తీవ్ర పరిస్థితులను సృష్టించే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. బలపడుతున్న ఎల్ నినో కారణంగా రాబోయే నెలల్లో ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. దీనితో పాటు దీర్ఘకాలం కొనసాగే తీవ్రమైన వేడి తరంగాలు (హీట్‌వేవ్‌లు), అడవి మంటలకు అనుకూల పరిస్థితులు, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదలు, మరికొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన కరువు ఏర్పడే ప్రమాదం పెరగవచ్చు. అయితే ఎల్ నినో ప్రభావం ప్రపంచంలోని ప్రతి ప్రాంతంపై ఒకే విధంగా ఉండదు. కొన్ని దేశాలు అధిక వర్షాలు ఎదుర్కొంటే, మరికొన్ని దేశాలు వర్షాభావంతో ఇబ్బందులు పడవచ్చు. అలాగే కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగగా, మరికొన్ని ప్రాంతాల్లో ప్రభావం స్వల్పంగా ఉండవచ్చు. ఎల్ నినో ప్రభావం బలపడుతున్న కొద్దీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు మరింత తీవ్రమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉందని అంటున్నారు.



## వాతావరణ మార్పుతో పెరుగుతున్న జీవన వ్యయం!

మనిషి ఆర్థిక పరిస్థితులతో వాతావరణానికి దగ్గర సంబంధం ఉందనే విషయం ఇటీవల కాలంలో స్పష్టమవుతున్నది. వాతావరణ మార్పు అనేది కేవలం భవిష్యత్తులో ఎదురయ్యే పర్యావరణ సమస్య మాత్రమే అనుకునే రోజులు పోయాయి. ప్రజల రోజువారీ జీవితాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తున్న ఆర్థిక సమస్యగా వాతావరణ పరిణామాలు మారుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అనిశ్చిత వర్షపాతం, కరువులు, వరదలు, వేడి తరంగాలు ప్రజల జీవన వ్యయాన్ని గణనీయంగా పెంచుతున్నాయి. ముఖ్యంగా పేదలు, రైతులు, అసంఘటిత రంగ కార్మికులు ఈ ప్రభావాన్ని ఎక్కువగా ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ రంగం వాతావరణ మార్పుకు అత్యంత ఎక్కువగా ప్రభావితమవుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతం, అనియంత్రిత రుతుపవనాల వల్ల పంట దిగుబడులు తగ్గుతున్నాయి. ఫలితంగా ఆహార పదార్థాల ధరలు పెరుగుతున్నాయి. భారత వినియోగదారుల ధరల సూచీలో (సిపిఐ) ఆహార పదార్థాల వాటా దాదాపు 46 శాతం ఉండటంతో, వ్యవసాయ రంగంలో ఏర్పడే ఏ సంక్షోభమైనా నేరుగా ద్రవ్యోల్బణాన్ని పెంచుతోంది. అదేవిధంగా, ఉష్ణ తరంగాల కారణంగా విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ఎయిర్ కండిషనర్లు, ఫ్యాన్లు, కూలర్ల వినియోగం అధికమవడంతో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుతోంది. ఈ అదనపు భారాన్ని విద్యుత్ సంస్థలు వినియోగదారులపై అధిక ఛార్జీల రూపంలో మోపుతున్నాయి. దీంతో కుటుంబాల నెలవారీ ఖర్చులు పెరుగుతున్నాయి. నీటి కొరత కూడా మరో ప్రధాన సమస్యగా మారింది. భూగర్భ జలాలు తగ్గిపోవడం, వర్షపాతం అస్థిరంగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో నీటి కోసం ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తోంది. పట్టణాల్లో ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడటం వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. వాతావరణ మార్పు ఆరోగ్య సమస్యలను కూడా పెంచుతోంది. వేడి సంబంధిత వ్యాధులు, గాలి కాలుష్యం, దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు పెరగడంతో వైద్య ఖర్చులు అధికమవుతున్నాయి. ముఖ్యంగా రోజువారీ కూలీలకు అనారోగ్యం అంటే ఆదాయం కోల్పోవడమే. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి వాతావరణ అనుకూల మౌలిక సదుపాయాలు, హరిత బడ్జెట్ విధానాలు, రైతులకు మెరుగైన బీమా, వేడి తరంగాలపై చట్టబద్ధ రక్షణ, నీటి నిర్వహణ సంస్కరణలు అవసరం. వాతావరణ న్యాయం, సామాజిక సమానత్వం, సుస్థిర అభివృద్ధిని కలిపి ముందుకు సాగినప్పుడే భారతదేశం ఈ సవాలును సమర్థంగా ఎదుర్కోగలదు.

## భారీ జెల్లీఫిష్‌లు!



చాలా జెల్లీఫిష్‌లు ఒక బకెట్‌లో సులభంగా ఇమిడిపోయేంత చిన్నవిగా ఉంటాయి. అయితే ఒక జాతి మాత్రం వాటన్నింటికీ భిన్నంగా నిలుస్తుంది. 'లయన్స్ మేన్' అనేది ఇప్పటివరకు నమోదైన అతిపెద్ద జెల్లీఫిష్. దీని టెంటకిల్స్ 120 అడుగుల (36 మీటర్లు) కంటే ఎక్కువ పొడవు పెరుగుతాయి. ఈ పొడవు భూమిపై అతిపెద్ద జంతువైన వయోజన నీలి తిమింగలం (బ్లూ వేల్) పొడవుకన్నా ఎక్కువ. దీని గంటాకార శరీర భాగం (బెల్) కూడా 7 అడుగుల (2 మీటర్లు) కంటే ఎక్కువ వ్యాసంతో పెరుగుతుంది. అందుకే ఇది సముద్రంలో కనిపించే అత్యంత అసాధారణ జీవుల్లో ఒకటిగా నిలిచింది. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం, ఆర్కిటిక్ మహాసముద్రంలోని చల్లటి జలాల్లో నివసించే ఈ జెల్లీఫిష్, వేలాది విషసూదులతో కూడిన తన టెంటకిల్స్ సహాయంతో చేపలను, ఇతర చిన్న సముద్ర జీవులను వేటాడుతుంది. ఇంత భారీ పరిమాణం ఉన్నప్పటికీ, సముద్ర ప్రవాహాలకు అనుగుణంగా నెమ్మదిగా తేలుతూ సాగిపోతుంది. అలల కింద దీని దృశ్యం ఒకవైపు అద్భుతంగా కనిపిస్తే, మరోవైపు భయానకంగా కూడా అనిపిస్తుంది. సముద్ర జీవుల్లో దీని స్పర్శశృంగాల పొడవుకు సాటి వచ్చే జీవులు చాలా అరుదు. అందువల్ల ఇది జలాంతర్గామి ప్రపంచంలోని అత్యంత ఆకర్షణీయమైన మహాకాయ జీవుల్లో ఒకటిగా గుర్తింపు పొందింది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# బెంగాల్‌లో ఇసి తొండాట!

ఫుట్‌బాల్ ఆటలో తొండి జరగకుండా చూడాల్సిన బాధ్యత రెఫరీది. ఎన్నికల మైదానంలో అభ్యర్థులందరికీ సమాన అవకాశం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌ది . కానీ, 'నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు' అన్నట్లుగా పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల్లో ఇసి తన తటస్థ పాత్రను పక్కనపడేసింది. అధికార బిజెపి అభ్యర్థులను గెలిపించే బాధ్యతను ఏకంగా తన భుజస్కంధాలపై ఎత్తుకున్నట్లు జరుగుతున్న పరిణామాలు సూచిస్తున్నాయి. నందిగ్రామ్, రెజీనగర్ ఉప ఎన్నికల నామినేషన్ ఉపసంహరణ గడువుకు రెండు రోజుల ముందు ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీని, గడ్డి పూల ఎన్నికల గుర్తుపై పోటీ చేయకుండా తాత్కాలికంగా నిలిపివేస్తూ సెప్టెంబర్ 17 రాత్రిపూట ఇసి తరపున ఉత్తరువులు జారీ అయ్యాయి. ఉప ఎన్నికల్లో ఉపయోగించుకునేందుకు వీలుగా పార్టీ పేరు, ఎన్నికల గుర్తులను 14 గంటల్లో తమకు పంపాలని పార్టీ వ్యవస్థాపకురాలు మమతా బెనర్జీ, చీలిక వర్గ నేత రీతాబ్రత బెనర్జీకి తాఖీదులు పంపింది. మమతా బెనర్జీ పంపిన మూడు ప్రతిపాదనల నుంచి మమతా ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అనే పేరును, ఫుట్ బాల్‌తో ఆడుతున్న క్రీడాకారుడి ఎన్నికల చిహ్నాన్ని ఎన్నికల సంఘం కేటాయించింది. ప్రత్యర్థి శిబిరానికి డెమొక్రాటిక్ ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పేరు, ఎన్వలప్ గుర్తును ఖరారు చేశారు. గతంలో మహారాష్ట్రలో ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు ఒక వర్గానికి ఉద్ధవ్ శివసేన, మరో వర్గానికి షిండే శివసేన అనే పేర్లు ఖరారయ్యాయ. కానీ బెంగాల్‌లో చీలిక వర్గానికి నేతృత్వం వహిస్తున్న రీతబ్రత తన పేరును పార్టీకి ముందు లేదా వెనుక పెట్టుకునే సాహసం చేయలేకపోయారు. ఇది ఆ వర్గంలో ప్రజామోదం పొందబోమనే భయాన్ని చెప్పకనే చెబుతోంది.

ఉప ఎన్నికల నామినేషన్ ప్రక్రియ సెప్టెంబర్ 9న ప్రారంభమై, 16 వరకు సాగింది. సెప్టెంబర్ 17న నామినేషన్‌ల పరిశీలన, 19న ఉపసంహరణకు గడువును విధించారు. అక్టోబర్ 6న పోలింగ్ జరగనుంది. అంటే, కొత్త గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు మమతా టిఎంసికి పట్టుమని 20 రోజుల సమయం కూడా లేదు. అయినప్పటికీ మమతా బెనర్జీ పట్ల ప్రజల్లో సానుభూతి ఉందేమోననే సందేహం బిజెపిలో నెలకొంది. ఆమె పార్టీకి కనీసం అభ్యర్థులు లేకుండా ముఖ్యమంత్రి సువేందు అధికారి పన్నాగం పన్నారు. ఆయనతో భేటీ అయిన వెంటనే నందిగ్రామ్‌లో టిఎంసి అభ్యర్థి సంచితా ప్రధాన్ నామినేషన్‌ను ఉపసంహరించుకుంది. వెంటనే కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మమత తమ పార్టీ మద్దతును ప్రకటించారు. అయినా, సువేందు ప్రభుత్వం పట్టువీడలేదు. 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమంలో పెట్టిన పాత కేసును తొవ్వి మిలన్ ప్రధాన్‌ను అరెస్టు చేశారు. ఆయనకు కోర్టు 14 రోజుల కస్టడీ విధించడం ద్వారా ఎన్నికల ప్రచారానికి వెళ్లకుండా అయింది. మరోవైపు రెజీనగర్‌లో సైతం మమతా బెనర్జీ పార్టీ అభ్యర్థి రబీయుల్ ఆలం చౌధురి పార్టీ కార్యకర్తలను ప్రత్యర్థులు వేధిస్తున్నారని, కొత్త గుర్తు ప్రచారానికి సరిపడా సమయం లేదనే కారణాలతో నామినేషన్ ఉపసంహరించుకోనున్నట్లు ప్రకటించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. మమతా బెనర్జీ రంగంలో దిగి ఆయనతో మాట్లాడి బరిలో ఉండేందుకు ఒప్పించారు.

ఇక ఎన్నికల కమిషన్ విషయానికి వస్తే, ప్రపంచంలోనే అత్యధిక ఓటర్లు కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తోందనే ఘనత దానికి ఉండేది. రాజ్యాంగంలోని 324 అధికరణ ప్రకారం భారత ఎన్నికల సంఘాన్ని రాష్ట్రపతి నియమిస్తారు. ఇది స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా టి.ఎన్.శేషన్ వ్యవహరించిన కాలంలో ఎన్నికల సంఘం శక్తి, ప్రభావం రాజకీయ పార్టీలకు, దేశ ప్రజలకు అర్థమైంది. అంతటి బలం కలిగిన ఎన్నికల కమిషన్ అధికార పక్షం చేతిలో కీలు బొమ్మగా మారిపోయింది. గత పార్లమెంటు ఎన్నికలకు ముందు నుంచి ఇసి తీసుకుంటున్న నిర్ణయాలు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి, ప్రధాని నరేంద్ర మోదీకి వంతపాడుతున్నట్లుగా ఉన్నాయి. తానే స్వయంగా ప్రతిపక్షాల గొంతు నులిమిన సందర్భాలెన్నో. అందుకు శివసేన, ఎన్‌సిపిల చీలిక వర్గాలకే అసలు పార్టీని, ఎన్నికల చిహ్నాలను కట్టబెట్టి, ఆ పార్టీల వ్యవస్థాపకులనే పరాయివారిగా చేసిన ఉదంతాలను చూశాం. బిజెపి ప్రత్యర్థి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో 'సర్' పేరిట గంపగుత్తగా ఓట్లు తొలగించి, కాషాయ పార్టీ అప్రజాస్వామికంగా ఎన్నికలను దొంగిలిస్తున్న వైనాన్ని పశ్చిమబెంగాల్, అస్సోం తదితర రాష్ట్రాలలో ప్రజలకు అనుభవమే. టిఎంసి నుంచి బైటికెళ్ళిన ఎంఎల్‌ఏలు తమదే అసలైన పార్టీ అని చెప్పుకుంటుంటే, వారితో పాటు బైటికెళ్ళిన ఆ పార్టీ ఎంపిలు అనామక ఎన్‌సిపిఐ పార్టీలో విలీనమై విచిత్ర విన్యాసాలు చేస్తున్నారు. ఉప ఎన్నికల ముందైనా ఎవరిది అసలైన పార్టీయో తేల్చి, పార్టీని, గుర్తును వారికి కేటాయించాలని మమతా బెనర్జీ మొర పెట్టుకుంది. ఇవేవి కనపడకుండా, వినపడకుండా ఎన్నికల కమిషన్ కళ్ళూ, చెవులు మూసుకుంది. స్వయంగా ప్రతిపక్షాల కాళ్ళలో కట్టెలు పెడుతున్న ఎన్నికల సంఘం తొండాటను దేశ ప్రజలు మరిచిపోరు. ●



డి.రాజా,
సిపిఐ ప్రధాన కార్యదర్శి

# భారతదేశ నినాదంగా మారిన 'బద్లావ్ జరూరీ హై'

సిపిఐ చేపట్టిన 'బద్లావ్ జరూరీ హై' ప్రచారోద్యమంలో భాగంగా జరిగిన భారీ సమీకరణ ఒక విషయాన్ని నిస్సందేహంగా స్పష్టం చేసింది. మార్పు కోసం పిలుపు ఇకపై రాజకీయ పార్టీలకు లేదా పార్లమెంటరీ చర్చలకు మాత్రమే పరిమితం కాబోదు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అభద్రత, అసమానతలు, ప్రజాస్వామ్య హక్కులపై దాడులు, క్రమపద్ధతిలో ప్రభుత్వ సంస్థలను బలహీనపర్చటం వంటి వాటిని ఎదుర్కొంటున్న లక్షలాది మంది భారతీయుల ప్రత్యక్ష అనుభవాల నుండి ఇది ఉద్భవిస్తోంది. ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో సెప్టెంబర్ 1న జరిగిన ర్యాలీ ఆ భావనకు ఒక శక్తిమంతమైన వ్యక్తీకరణ. కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, వివిధ రాష్ట్రాల ప్రజల భాగస్వామ్యం భారత కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ బలాన్ని మాత్రమే కాకుండా, ప్రజల పోరాటాలలో పాతుకుపోయిన రాజకీయాల నిరంతర ప్రాసంగికతను కూడా ప్రదర్శించింది. ఈ సమీకరణను విడిగా చోటు చేసుకున్న సంఘటనగా కాకుండా, ఒక పెద్ద రాజకీయ జోక్యానికి నాందిగా అర్థం చేసుకోవాలి. మార్పు అవసరం. ఎందుకంటే, అసమానతలను సృష్టించే వ్యవస్థలు మరింత బలంగా పాతుకుపోయాయి. భారతదేశ సంక్షోభం కేవలం పేలవమైన పరిపాలన లేదా పరిపాలనా వైఫల్యానికి సంబంధించినది కాదు. దీని మూలాలు వర్గం, కులం, పితృస్వామ్యంలో లోతుగా వేళ్ళూనుకొని ఉన్నాయి. గత దశాబ్ద కాలంలో అనుసరించిన ఆర్థిక విధానాలు కార్పొరేట్ కేంద్రీకరణను బలోపేతం చేసి, కార్మిక రక్షణలను బలహీనపరిచి, అధిక ఆర్థిక నష్టభయాలను కార్మికులు, సాధారణ కుటుంబాలపైకి బదలాయించాయి.

ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ విధానాలు విద్య, ఆరోగ్య సంరక్షణ, ఇతర నిత్యావసర వస్తువుల కొనుగోలు శక్తిపై ప్రభావం చూపాయి.సంక్షేమ రాజ్యం అనే భావన భారత రాజ్యాంగ చట్రానికి కొత్తేమీ కాదు. ఇది ప్రభుత్వ విధాన ఆదేశిక సూత్రాలలో స్పష్టంగా వ్యక్తీకరించబడింది. ఇతర విషయాలతో పాటు, 'పౌరులకు స్త్రీ, పురుషులకు సమానంగా, తగిన జీవనోపాధి హక్కు' ఉండే విధంగా చూడాలని ఆర్టికల్ 39 ప్రభుత్వాన్ని నిర్దేశిస్తుంది. ఇది సామాన్య ప్రజల మేలు కోసం భౌతిక వనరుల పంపిణీకి పిలుపునిస్తుంది. సంపద, ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణకు వ్యతిరేకంగా హెచ్చరిస్తుంది. ఈ రాజ్యాంగ దార్శనికతకు, ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి పాలనలో దేశం పయనిస్తున్న దిశకు మధ్య దూరం అంతకంతకూ స్పష్టమవుతోంది. సంక్షేమ రాజ్యం క్షీణిస్తుండగా, ఆర్థిక అభద్రత పెరుగుతోంది. కాబట్టి, దేశం ముందున్న ప్రశ్న, కేవలం భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందుతోందా? లేదా? అనేది మాత్రమే కాదు. ఆ వృద్ధితో ఎవరు ప్రయోజనం పొందుతున్నారు? దాని వ్యయాలను ఎవరు భరిస్తున్నారు? ఆ ఆర్థిక వ్యవస్థ సామాన్య ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడుతుందా, లేదా? అనేది కూడా. సమానత్వానికి కులం మరో మౌలిక అవరోధంగా మిగిలిపోయింది. అది భూమి, విద్య, ఉపాధి, ఆత్మగౌరవం, సామాజిక అధికారం పొందే అవకాశాలను ప్రభావితం చేస్తూనే ఉంది. ''మీరు ఎటు వైపు మళ్ళినా, మీ దారికి అడ్డంగా వచ్చే రాక్షసి కులమే'' అని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ నాడు చేసిన హెచ్చరిక నేటికీ బలంగా వర్తిస్తుంది. ఆర్థిక పరివర్తన గురించి చర్చిస్తున్నప్పుడు కులాన్ని ఒక ద్వితీయ సామాజిక సమస్యగా పరిగణించలేము. అది అవకాశాలను నిర్ణయిస్తుంది, సామాజిక హోదాను నిర్ధారిస్తుంది. తరతరాలుగా అసమానతలను పునరుత్పత్తి చేస్తుంది.

ఈ వ్యవస్థలతో పాటే పితృస్వామ్యం కూడా పని చేస్తుంది. ఆర్థిక వ్యవస్థలో, ప్రజా జీవితంలో మహిళల భాగస్వామ్యం పరిమితంగానే ఉంది. వేతనం లేని శ్రమ విలువకు తక్కువ అంచనా కట్టడం, హింస, వివక్ష కొనసాగుతూనే ఉన్నాయి. ''ఒక సమాజం సాధించిన పురోగతిని, ఆ సమాజంలో మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను అంచనా వేస్తాను'' అని సామాజిక పురోగతికి అంబేద్కర్ అంతే శక్తివంతమైన కొలమానాన్ని అందించారు. ఒక సమాజ జనాభాలో సగం మంది సమానత్వానికి సంబంధించిన వ్యవస్థాగత అడ్డంకులను ఎదుర్కొంటున్నప్పుడు, ఆ సమాజం అర్థవంతమైన పురోగతిని సాధించామని చెప్పుకోలేదు.

## తదుపరి కార్యాచరణ ఏమిటి?

**అందుకే, వామపక్షాల ప్రత్యామ్నాయం అనేది వర్గం, కులం, పితృస్వామ్యాన్ని కలిపి ఎదుర్కోవాలి. మతపరమైన విభజనను ఈ విస్తృత రాజకీయ సందర్భం నుంచి వేరు చేయలేము. వేతనాల కోసం ఇబ్బంది పడుతున్న ఒక కార్మికుడిని మరో సముదాయాన్ని నిందించేలా ప్రోత్సహించవచ్చు. ఉద్యోగం దొరకని ఒక యువకుడికి ఆర్థిక అవకాశం చూపే బదులుగా మతపరమైన సాకులు చూపవచ్చు. అందించవచ్చు. వివక్షతను ఎదుర్కొంటున్న ఒక దళిత లేదా ఆదివాసీ పౌరుడికి, మత ఐక్యత కోసం సామాజిక అన్యాయంపై మౌనం అవసరమని చెప్పవచ్చు. సమానత్వం కోరుతున్న మహిళలను సంస్కృతి పేరుతో సాంప్రదాయ క్రమపద్ధతిని అంగీకరించమని అడగవచ్చు. ఫలితం ఊహించదగినదే. ఉమ్మడి భౌతిక ప్రయోజనాలు కలిగిన వ్యక్తులు ఒకరినొకరు శత్రువులుగా చూసుకునేలా ప్రోత్సహించబడతారు. ఈ తర్కాన్ని తిప్పికొట్టి, సామాన్య ప్రజల బలం విభజనలో కాకుండా సంఘీభావంలో ఉందని నిరూపించడమే వామపక్షాల ముందున్న రాజకీయ సవాలు. కాబట్టి, 'బద్లావ్ జరూరీ హై' తదుపరి దశ ప్రజల రోజువారీ పోరాటాలను జాతీయ రాజకీయాలకు కేంద్రంగా నిలపాలి.**

మాజిక చలనశీలత బలహీనపడుతుంది.అనారోగ్యం కుటుంబాలను అప్పుల్లోకి నెట్టి వేసినప్పుడు, ఆరోగ్య సంరక్షణ అనేది ఏ అర్థవంతమైన కోణంలోనూ ప్రజా హక్కుగా ఉండదు.కాబట్టి, బలమైన ప్రభుత్వ విద్య, సార్వత్రిక ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణల పరిరక్షణ,విస్తరణ ప్రత్యామ్నాయానికి కేంద్రకంగా ఉండాలి. మహిళా విముక్తిని కూడా అంతే గంభీరంగా పరిగణించాలి. ఆర్థిక స్వాతంత్ర్యం, సమాన వేతనాలు, సురక్షితమైన ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, హింస నుంచి స్వేచ్ఛ, సామాజిక జీవితంలో పూర్తి సమానత్వాన్ని వాయిదా వేయలేము. ఆంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్యకర్తలు వంటి వారు ముఖ్యమైన ప్రజా విధులను నిర్వర్తిస్తారు. గౌరవం, వేతనం, సామాజిక రక్షణకు అర్హులు. సమాజ ప్రగతి కొలమానం ప్రకారం, భారతదేశ మహిళలు కేవలం అభివృద్ధిలో భాగం కావడమే కాకుండా, దాని దిశను నిర్దేశించడంలో సమాన భాగస్వాములుగా ఉండాలి.

మత విద్వేషాలు పదేపదే సృష్టించబడి, పెంచి పోషించబడుతూ తరుణంలో, భారతదేశ బహుళత్వాన్ని పరిరక్షించడమే ఒక రాజకీయ ప్రతిఘటన చర్య. కానీ మత సామరస్యాన్ని కేవలం నైతిక విజ్ఞప్తికి కుదించలేము. అది ప్రజలను ఏకం చేసే భౌతిక ప్రయోజనాలలో వేళ్ళూనుకొని ఉండాలి. ఒకే యజమానిని ఎదుర్కొంటున్న హిందూ, ముస్లిం కార్మికులు, ఒకే రకమైన వ్యవసాయ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సిక్కు, హిందూ రైతులు, విద్యలో ఒకే రకమైన



కార్మికుల హక్కుల కోసం చేసే పోరాటం కేవలం ట్రేడ్ యూనియన్లకు సంబంధించిన విషయం మాత్రమే కాదు. మంచి ఉపాధి కనుమరుగైనప్పుడు, వేతనాలు స్తంభించిపోయినప్పుడు, అసంఘటిత రంగం విస్తరించినప్పుడు, సామాజిక భద్రత బలహీనపడినప్పుడు, కార్మికులు, పెట్టుబడిదారుల మధ్య అధికార సమతుల్యత మౌలికంగానే మార్పుచెందుతుంది. కార్మికులకు సామాజిక రక్షణ, కార్మిక హక్కులతో కూడిన సురక్షితమైన, గౌరవప్రదమైన, తగినంత వేతనంతో కూడిన ఉపాధి అవసరం. భారత యువతకు, ఈ ప్రశ్న వారి భవిష్యత్తుతో విడదీయరానిది. లక్షలాది మంది భద్రత కరువైన ఉద్యోగాలు, నియామకాలలో జాప్యం, పత్రాల లీకేజీ, అనిశ్చిత భవిష్యత్తును ఎదుర్కొంటున్నారు. యువ భారతీయులకు గౌరవప్రదమైన పని దొరకకపోతే, జనాభా బలంతో ప్రయోజనం లేదు. గ్రామీణ, పట్టణ కార్మికులిద్దరికీ అర్థవంతమైన ఉపాధి హామీతో సహా, ఉపాధిని ఒక ప్రధాన ప్రజాస్వామ్య, సామాజిక డిమాండ్‌గా మార్చేందుకు సిపిఐ, దాని ప్రజా సంఘాలు తమ పోరాటాన్ని తీవ్రతరం చేయాలి.

రైతులు, వ్యవసాయ కార్మికుల పోరాటానికి కూడా ఇదే విధానం మార్గదర్శకంగా ఉండాలి. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు, సరిపోని ఆదాయాలు, రుణభారం, ఆర్థిక అభద్రత, గ్రామీణ భారతదేశ జీవనోపాధికి ముప్పుగా పరిణమించాయి. లాభదాయకమైన ధరలు, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన గ్యారంటీ, బలమైన ప్రభుత్వ పెట్టుబడుల కోసం డిమాండ్ కేవలం వ్యవసాయ రంగ డిమాండ్ మాత్రమే కాదు. ఇది గ్రామీణ భారతదేశ పునరుద్ధరణ కోసం డిమాండ్. విద్య, ఆరోగ్య సంరక్షణలను ప్రభుత్వ బాధ్యతలుగా తిరిగి స్వీకరించాలి. విద్య ఖర్చు నానాటికి పెరుగుతున్నప్పుడు, వంశపారంపర్యంగా వచ్చే ప్రత్యేక హక్కులు బలపడతాయి. సా

### కొనసాగింపు ఇలా...

- అక్టోబర్ 2న మత సామరస్య దినోత్సవం ప్రాముఖ్యత ఇదే. ఇది సౌభ్రాతృత్వ సందేశాన్ని కార్యాలయాలు, క్యాంపస్‌లు, గ్రామాలు,పరిసర ప్రాంతాలకు తీసుకు వెళ్ళడానికి ఒక సందర్భం కావాలి. లౌకికవాద పరిరక్షణను ప్రజల రోజు వారీ పోరాటాలతో అనుసంధానించాలి.
- నవంబర్ 7న విప్లవ దినోత్సవం, మరో అవకాశాన్ని అందిస్తుంది. చరిత్రను ఇష్టాను సారం తిరగరాస్తున్న ఈ తరుణంలో, యువ తరాలకు కార్మికుల, రైతుల పోరా టాల చరిత్రను, వలస వ్యతిరేక ప్రతిఘట నను, సామాజిక విముక్తిని, దోపిడీకి వ్యతి రేకంగా జరిగిన పోరాటాన్ని పరిచయం చేయాలి. విప్లవం అంటే అన్యాయమైన సామాజిక ఏర్పాట్లు శాశ్వతం కాదని, సంఘటిత ప్రజలు వాటిని మార్చగలరని అర్థం.
- ఆ తర్వాత ఈ ఉద్యమం డిసెంబర్ 1 నుండి 3 వరకు జరిగే 'జైల్ భరో ఆందోళన్' వైపు సాగాలి. ప్రతిపాదిత ఐదు లక్షల మంది సమీకరణను కేవలం ఒక ప్రతీకాత్మక కార్యక్రమంగా చూడకూడదు. అది సంఘటిత ప్రజాస్వామ్య ప్రతిఘటనకు ఒక శక్తివంతమైన ప్రదర్శనగా మారాలి. వ్యక్తిగత సమస్యలను సామూహిక రాజకీయ చర్యగా మార్చాలి. కార్మికుల డిమాండ్లు, రైతుల డిమాండ్లు, మహిళల హక్కులు, విద్యార్థుల సమస్యలు, ఉపాధి, ధరల పెరుగుదల, ఆహార భద్రత, సామాజిక న్యాయం, లౌకికవాదం, సమాఖ్య వాదం, ప్రజాస్వామ్యం ఒక ఉమ్మడి రాజకీయ వ్యక్తీకరణను కనుగొనాలి.

ప్రైవేటీకరణను ఎదుర్కొంటున్న దళిత, ఒబిసి విద్యార్థులు, పితృస్వామ్య హింసను ఎదుర్కొంటున్న వివిధ వర్గాల మహిళలకు, వారి విభజన కారణంగా లబ్ధి పొందే శక్తుల కన్నా, ఒకరితో ఒకరికి చాలా ఎక్కువ సారూప్యతలు ఉన్నాయి. సెప్టెంబర్ 1నాటి జన సమీకరణ రాజకీయ బలాన్ని ప్రదర్శించింది. ఆ బలాన్ని మార్పు కోసం సాగే నిరంతర పోరాటంగా మలచడమే ప్రస్తుతం మన ముందున్న కర్తవ్యం. మధ్యలో లభించే సమయాన్ని ప్రజా సంఘాలను నిర్మించడానికి, ప్రజా సంఘాలను బలోపేతం చేయడానికి, యువత, మహిళల కొత్త విభాగాలకు చేరువవడానికి, కార్మికులు, రైతులతో సంబంధాలను మరింతగా పెంపొందించుకోవడానికి, ఈ ఉద్యమాన్ని స్థానిక పోరాటాల్లోకి తీసుకువెళ్ళడానికి ఉపయోగించుకోవాలి.'బద్లావ్ జరూరీ హై' అనేది ఒక ర్యాలీకి సంబంధించిన నినాదంగా మిగిలిపోకూడదు. అది ప్రజల దైనందిన జీవితాల్లో వేళ్ళూనుకొన్న ఒక నిరంతర రాజకీయ ఉద్యమంగా మారాలి. దేశానికి దిశ మా ర్పు అవసరం – అది 'కార్పొరేట్ కేంద్రీకరణ నుంచి సామాజిక సంక్షేమం వైపు, అస్థిరమైన పని నుండి గౌరవప్రదమైన ఉపాధి వైపు, ప్రైవేటీకరణ నుంచి బలమైన ప్రభుత్వ సంస్థల వైపు, కుల వ్యవస్థ నుంచి సార్వత్రిక సామాజిక న్యాయం వైపు, పితృస్వామ్యం నుంచి సమానత్వం వైపు, మతపరమైన విభజన నుంచి సౌభ్రాతృత్వం వైపు, మితిమీరిన కేంద్రీకరణ నుంచి నిజమైన సమాఖ్య ప్రజాస్వామ్యం వైపు' దిశ మారాలి.

**ప్రజల సమస్యలకు మతపరమైన శత్రువులు ఉన్నారని ప్రజలను నమ్మించాలని ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి రాజకీయ వ్యూహం కోరుకుంటోంది. వామపక్షాలు దీనికి విరుద్ధంగా నిరూపించాలి. ఐక్య కార్యాచరణలోనే అసలైన బలం ఉందని చాటాలి. మనం ఐక్యంగా బ్రిటిష్ రాజ్‌ను ఓడించాము, ఇప్పుడు మళ్ళీ ఏకం అయ్యి ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి రాజ్‌ను తొలగించాల్సిన సమయం వచ్చింది.**

అభివృద్ధిని డొల్ల నినాదాలతోనో, శీర్షికల్లోని గణాంకాలతోనో కాకుండా, తమకు ఉద్యోగాలు ఉన్నాయా, తమ కుటుంబాలను పోషించే స్థాయిలో తమ వేతనాలు ఉన్నాయా, తమ పిల్లలు నాణ్యమైన విద్యను పొందుతున్నారా, ఆరోగ్య సంరక్షణ అందుబాటులో ఉందా, రైతులు గౌరవంగా జీవించగలుగుతున్నారా, మహిళలు సమానంగా, సురక్షితంగా ఉన్నారా, కుల అణచివేతను సవాలు చేస్తున్నారా, అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించే స్వేచ్ఛ పౌరులకు ఉందా అనే విషయాల ఆధారంగా సామాన్య ప్రజలు అంచనా వేస్తారు. అదే ప్రగతికి నిజమైన కొలమానం.అదే ప్రజాస్వామ్యానికి నిజమైన పరీక్ష. సెప్టెంబర్ 1వ తేదీన జరిగిన ర్యాలీ, మార్పు కోసం పిలుపు ప్రజలను సమీకరించగలదని నిరూపించింది. మన ఎదుట ఉన్న కర్తవ్యం మరింత కఠినమైనది, బృహత్తరమైనది. ఆ అసంతృప్తిని సంఘటితం చేయడం, ఆ పోరాటాలను ఏకం చేయడం, దేశాన్ని మార్చగల సామర్థ్యం ఉన్న ఒక రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించడం.

**మనం 'బద్లావ్ జరూరీ హై' ని ప్రతి కార్యాలయానికి, ప్రతి క్యాంపస్‌కు, ప్రతి గ్రామానికి, ప్రతి బస్తీకి, ప్రతి ప్రజాస్వామ్య పోరాటానికి తీసుకువెళ్లాలి. మనం ప్రజలను సంఘటిత పరచాలి. వారి పోరాటాలను ఏకం చేయాలి. దోపిడీని, అణచివేతను సవాలు చేయాలి.న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ వాగ్దానాన్ని పరిరక్షించాలి.ఆర్థిక భద్రత హక్కుగా, సామాజిక సమానత్వం వాస్తవరూపంగా, ప్రజాస్వామ్యం ప్రజలకు చెందినదిగా ఉండే భారతదేశాన్ని నిర్మించాలి.**

పిలుపు ఇవ్వబడింది. సమీకరణ ప్రారంభమైంది. ఇప్పుడు నిర్వర్తించాల్సిన కర్తవ్యం, ఈ పోరాటాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లి, 'బద్లావ్ జరూరీ హై'ని నిజమైన పరివర్తనకు ఒక శక్తిగా మార్చడం.

# ప్రజాపాలనలో ఆర్‌టిసికి పునరుజ్జీవనం

- దశాబ్దం తర్వాత గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు
- ఎన్నికల్లో ఆర్‌టిసి కార్మిక లోకం స్వచ్ఛందంగా పాల్గొనాలి: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాపాలనలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్‌ఆర్‌టిసి)కు పునర్జీవం లభిస్తోందని రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. టిజిఎస్‌ఆర్‌టిసిలో దాదాపు దశాబ్దం తర్వాత గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు జరగనున్నాయనీ, అక్టోబర్ 9న నిర్వహించనున్న ఎన్నికల్లో ఆర్‌టిసి కార్మికులు స్వచ్ఛందంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పాల్గొనాలని మంత్రి పిలుపునిచ్చారు. 2016 జూలై 19న చివరిసారిగా ఆర్‌టిసి కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు జరిగాయని, ఆ తర్వాత ఎన్నికలకు అవకాశం లేకుండా పోయిందని మంత్రి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్‌టిసి కార్మికుల సంఘ హక్కులను గత ప్రభుత్వం అణచివేసిందని ఆయన ఆరోపించారు.

**విలీన ప్రక్రియలో యూనియన్లకు భాగస్వామ్యం**

గుర్తింపు సంఘం ఎన్నికల అనంతరం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై తదుపరి ప్రక్రియ చేపడతామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన గుర్తింపు సంఘం ప్రతినిధులను అధికారుల కమిటీలో భాగస్వాములను చేసి, ఇతర రాష్ట్రాల్లో విలీనం తర్వాత ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా కార్మికుల ప్రయోజనాలను కాపాడేలా ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.

**కార్మిక సంక్షేమానికి పలు చర్యలు..**

ప్రజాపాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌టిసి కార్మికుల సంక్షేమానికి పలు చర్యలు చేపట్టిందని మంత్రి వివరించారు. పెండింగ్ డిఎల చెల్లింపుతో పాటు 2017, 2021 సంవత్సరాలకు సంబంధించిన ఫిట్‌మెంట్ అందజేశామని తెలిపారు. సిసిఎస్, పిఎఫ్ బకాయిల విడుదల, 1,432 కారుణ్య నియామకాలు, గతంలో తొలగించిన 250 మంది ఉద్యోగుల పునర్నియామకం, 4 వేల ఉద్యోగాల భర్తీకి అనుమతి వంటి చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అలాగే ఆర్‌టిసికి 2,932 కొత్త బస్సుల కొనుగోలు, 600 బస్సులకు మహిళలను యజమానులుగా చేసే కార్యక్రమం, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం వంటి చర్యలతో సంస్థను బలోపేతం చేస్తున్నామని మంత్రి తెలిపారు. 'ఆర్‌టిసి కార్మికులు ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముక. వారి హక్కులను కాపాడటం, సంక్షేమాన్ని పరిరక్షించడం ప్రజాపాలన ప్రభుత్వ బాధ్యత. గుర్తింపు ఎన్నికలతో కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరిస్తున్నాం' అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తెలంగాణదే కీలక పాత్ర

- దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను దాదాపు 5 నుంచి 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక
- ఢిల్లీలో 'వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో న్యూఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో శనివారం డిప్యూటీ సిఎం ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సిఎంతో పాటు రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. దేశం కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధిని సాధించేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకుంటూనే, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం, ఉత్పాదకతను పెంచడం, అభివృద్ధి ఫలాలను ప్రతి పౌరుడికి, ప్రతి ప్రాంతానికి అందించడం ప్రధాన సవాల్ అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం, రాష్ట్రాలు కలిసి ముందుకు కొనసాగాలని అన్నారు. తెలంగాణ కేవలం నిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని తెలిపారు. తెలంగాణ మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యం రాష్ట్రానికే పరిమితమైనది కాదని, 2047 నాటికి సుసంపన్నమైన, స్వావలంబనతో కూడిన వికసిత్ భారత్ నిర్మాణానికి తెలంగాణ అందించే భాగస్వామ్యమని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తూ పెట్టుబడులు, స్థిరమైన ఆర్థిక వనరులు, మానవ సామర్థ్యానికి ప్రాధాన్యం ఇస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని ఆయన అన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచే దిశగా ప్రణాళిక రూపొందించినట్లు డిప్యూటీ సిఎం చెప్పారు. తెలంగాణ బలమైన ఆర్థిక పునాదులతో తదుపరి దశ వృద్ధికి సిద్ధంగా ఉందని, ప్రస్తుత వృద్ధి పథంలో కొనసాగితే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ఉందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం అంతకంటే పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకుందని డిప్యూటీ సిఎం తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని, తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలన్నది లక్ష్యమని డిప్యూటీ సిఎం వివరించారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటు రూ.2,19,575తో పోలిస్తే దాదాపు రెండింతలని వివరించారు. సేవల రంగం 13.5 శాతం, ద్వితీయ రంగం 9.4 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు.

**ప్రైవేట్ పెట్టుబడుల సమీకరణకు ప్రాధాన్యం**

మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలంటే మౌలిక వసతులకు నిధులు సమకూర్చే విధానంలో మార్పు అవసరమని భట్టి విక్రమార్క అన్నారు. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతి నుంచి క్రమంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాజెక్టుల్లో పెట్టుబడిదారుల రిస్క్‌ను తగ్గించడం, వయబిలిటీ గ్యాప్‌ను పూడ్చడం, ప్రైవేట్ పెట్టుబడులకు విశ్వాసం కల్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వ నిధులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఇందుకోసం పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యాలు (పిపిపి), గ్రీన్ బాండ్లు, బ్లెండెడ్ ఫైనాన్స్ వంటి మార్గాలను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు.

**యువతే తెలంగాణకు అతిపెద్ద బలం**


3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మౌలిక వసతులు, పెట్టుబడులతో పాటు మానవ వనరులే అసలైన పునాది అని, యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని డిప్యూటీ సిఎం అన్నారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రముఖ అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక భద్రత, అందుబాటులో వైద్యం, నాణ్యమైన గృహవసతి, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాలకు మద్దతు ద్వారా అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నదే తమ విధానమన్నారు.



## పేదల ఇండ్లకు పట్టాలు ఇవ్వండి

- మంత్రి పొంగులేటికి సిపిఐ వినతి

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ నగరంలోని సర్వే నంబర్ 964, 966, దీన్ దయాల్ నగర్, బంధం చెరువు, కోట చెరువు, ఇందిరమ్మ కాలనీలలో గత అనేక సంవత్సరాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న సుమారు 1000 మంది నిరుపేదలకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ప్రతినిధి బృందం శనివారం హైదరాబాద్‌లోని మంత్రి పొంగులేటి నివాసంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కలిసి వినతి పత్రం అందజేశారు. సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సిపిఐ నాయకులు కిషోర్,అలకుంట్ల మల్లన్న, శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, జోగుదుర్గ, కనకం కావ్య తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, ఇల్లు లేనటువంటి నిరుపేదలకు పట్టాలు ఇచ్చి పక్క గృహాలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు.



సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్ రెడ్డి ఇటీవల మృతి చెందడంతో నల్గొండ జిల్లాలోని, పడమటిపల్లిలోని వారి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు. ఈ సందర్భంగా పల్లా సుధీర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి సాంబశివరావు నివాళులర్పించారు. సిపిఐ నల్గొండ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, ప్రజాపక్షం దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్‌కుమార్, తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## వరంగల్‌లో ప్రపంచస్థాయి విమానాశ్రయం కల సాకారం

విమానాశ్రయానికి ఏ పేరు పెడదాం?



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వరంగల్‌లో ప్రపంచ స్థాయి విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న కల సాకారం కానున్నదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పటికీ వరంగల్ విమానాశ్రయ కలను నిజం చేయలేక పోయిందని సిఎం పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు కేవలం తమ కుటుంబ ప్రయోజనాలు, విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి సారించారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో వరంగల్ విమానాశ్రయ కల ఎట్టకేలకు సాకారం అవుతోందని తెలిపారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి శనివారం 'ఎక్స్' వేదికగా ఒక ట్వీట్ చేశారు. మామునూర్ విమానాశ్రయ భూసేకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించిందని సిఎం వెల్లడించారు. అవసరమైన భూమిని పూర్తిగా సేకరించి, భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఎఎఐ)కి అప్పగించినట్లు తెలిపారు. మామునూర్ విమానాశ్రయ ప్రాజెక్టు ఇప్పుడు క్షేత్రస్థాయిలో రూపుదిద్దుకుంటోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మామునూర్ విమానాశ్రయం నుంచి ప్రయాణించేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని రేవంత్‌రెడ్డి తెలిపారు.

**విమానాశ్రయానికి ఏ పేరు?**

వరంగల్‌లో కొత్తగా రూపుదిద్దుకుంటున్న విమానాశ్రయానికి ఏ పేరు పెట్టాలనే విషయంపై ప్రజల నుంచి సూచనలను సిఎం రేవంత్ రెడ్డి కోరారు. విమానాశ్రయానికి తగిన పేరును సూచించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## సింగరేణి కార్మికుల ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు

- పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి 45 రోజుల గడువు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల హక్కు పత్రాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను 45 రోజుల్లోపు పరిష్కరించాలని అధికారులను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయంలో శనివారం సింగరేణి కార్మికుల ఇళ్ల స్థలాల సమస్యపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. తెలంగాణకు వెలుగులు పంచేందుకు భూమి పొరల్లోకి దిగి తమ చెమటను నల్లబంగారంగా మారుస్తున్న సింగరేణి కార్మికుల సేవలు అమూల్యమైనవన్నారు. సింగరేణి కుటుంబాలు ఎన్నో సంవత్సరాలుగా నివసిస్తున్న ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాల కోసం నిరీక్షిస్తున్నాయని, వారి సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలకాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జారీ చేసిన జి.ఓ. నెంబర్ 76ను పరిగణనలోకి తీసుకుని, భూముల స్వభావం, ప్రభుత్వ, సింగరేణి హక్కులు, ప్రస్తుతం ఉన్న నివాస పరిస్థితులు, చట్టపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కొమురం భీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో సింగరేణి బొగ్గు బెల్ట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను హైకోర్టు ఆదేశాలకు లోబడి 45 రోజుల్లోగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం కోసం ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధి, జిల్లా రిజిస్ట్రార్ సభ్యులుగా త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేశామన్నారు.

# జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద హైడ్రామా



- భూములు, నిర్మాణాలపై కాంగ్రెస్ నేతల పరిశీలన.. అనుమతులపై ఆరోపణలు
- అడ్డుకునేందుకు బిఆర్‌ఎస్ శ్రేణుల యత్నం.. భారీగా పోలీసుల మోహరింపు

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలోని ఫామ్‌హౌస్ వద్ద శనివారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూములు, నిర్మాణాలు, అనుమతుల వివరాలను పరిశీలించేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల బృందం అక్కడికి చేరుకుంది. దీంతో ఫామ్‌హౌస్ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. కాంగ్రెస్ నేతల పర్యటనను అడ్డుకునేందుకు బిఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రయత్నించడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పలువురు బిఆర్‌ఎస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

**ఫామ్‌హౌస్ వద్ద భూములు, నిర్మాణాలు పరిశీలించిన కాంగ్రెస్ నేతలు**

నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నిబంధనలకు అనుగుణంగానే నిర్మాణం జరిగిందా? నాలాపై నిర్మాణం చేపట్టారా? తదితర అంశాలపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపి డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. 111 జీవో పరిధిలోని భూముల్లో నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు ఉన్నాయని, జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? నాలాపై నిర్మాణం ఎలా చేపట్టారు? అనే అంశాలపై పూర్తి స్థాయి విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. భూములు, నిర్మాణాలకు సంబంధించిన వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. మరోవైపు ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సైతం ఫామ్‌హౌస్ నిర్మాణం, భూముల యాజమాన్యంపై ప్రశ్నలు లేవనెత్తారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు తేలితే సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**యజమాన్యం నాదే: ప్రదీప్‌రెడ్డి**

అయితే ఫామ్‌హౌస్ యజమానిగా పేర్కొంటున్న బి.ప్రదీప్‌రెడ్డి కాంగ్రెస్ నేతల ఆరోపణలను ఖండించారు. జన్వాడలోని భూమి తనదేనని, 2019లో నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. కెటిఆర్‌కు ఈ ఆస్తిపై ఎలాంటి యాజమాన్య హక్కులు లేవని, తాను తన చిన్ననాటి స్నేహితుడైన కెటిఆర్‌కు ఫామ్‌హౌస్‌ను లీజుకు ఇచ్చినట్లు వెల్లడించారు. భూమికి క్లియర్ టైటిల్ ఉందని, అధికారులు ఏవైనా సందేహాలు ఉంటే నోటీసులు జారీ చేస్తే సంబంధిత పత్రాలను చూపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో జన్వాడ ఫామ్‌హౌస్ భూముల యాజమాన్యం, నిర్మాణ అనుమతులు, నాలా ఆక్రమణ ఆరోపణలపై అధికారిక విచారణలో వెలువడే వివరాలపై ఆసక్తి నెలకొంది.

## గ్రామీణ ప్రాంతాల్లో నిర్మాణ పనులు వేగవంతం

మంత్రి సీతక్క ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన గ్రామపంచాయతీ, గ్రామ సమైక్య, అంగన్‌వాడి భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పనుల పురోగతిని సమీక్షించారు. రాష్ట్రంలో మంజూరైన 9,745 గ్రామ సమైక్య భవనాల్లో 534 పూర్తి కాగా, 3,906 గ్రామపంచాయతీ భవనాల్లో 444 పూర్తయ్యాయని, 2,313 అంగన్‌వాడీ భవనాల్లో 200 పూర్తయ్యాయని అధికారులు మంత్రికి వివరించారు. ప్రారంభం కాని పనులపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను శాఖల మధ్య సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. అంగన్‌వాడి భవనాల నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న నిధులతో పాటు ఉపాధి హామీ పథకం నుంచి రూ.8 లక్షలు వినియోగించాలని, మిగిలిన రూ.4 లక్షల కోసం ఇతర నిధులను మళ్లించాలని కలెక్టర్లను కోరారు. ఎంపి లాడ్స్ నుంచి కనీసం రూ.1 కోటి కేటాయించాలని కోరుతూ రాష్ట్రంలోని ఎంపిలకు లేఖలు రాయనున్నట్లు మంత్రి తెలిపారు. నిర్మాణ పనుల పురోగతిపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. అలాగే, హ్యామ్ విధానంలో చేపడుతున్న గ్రామీణ రహదారుల నిర్మాణ పనులను దసరాలోపు ప్రారంభించాలని కాంట్రాక్ట్ కంపెనీల సన్నద్ధతను పరిశీలించాలని సూచించారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ దాన కిశోర్, కమిషనర్లు దివ్య దేవరాజన్, శృతి ఓఝా, ఈఎన్‌సి జగదీష్ పాల్గొన్నారు.

# ఎరువుల అసమతుల్యత వినియోగం ఆందోళనకరం

- ప్రకృతి వ్యవసాయాన్ని 'తెలంగాణ నేచురల్ ఫార్మింగ్ బ్రాండ్'గా తీర్చిదిద్దాలి : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో పెరుగుతున్న రసాయన ఎరువుల వినియోగం, పంట మార్పిడి లేకపోవడం, ఎరువుల వినియోగంలో తీవ్ర అసమతుల్యతపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో కొన్ని అంశాల్లో పురోగతి ఉన్నప్పటికీ, లోటుపాట్లను సాకుగా చూపకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, అధికారుల జవాబుదారీతనం పెంచాలని స్పష్టం చేశారు. దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ సదస్సులో చర్చకు వచ్చిన అంశాల నేపథ్యంలో శనివారం సచివాలయంలో వ్యవసాయ శాఖపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమీక్ష సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి జి.సురేంద్ర మోహన్, డైరెక్టర్ బి.గోపి, వివిధ విభాగాల అధిపతులు, వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్ల వైస్ చైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు సమావేశంలో పాల్గొన్నారు.

**నత్రజని, భాస్వరం, పొటాషియం అధిక వినియోగం ఆందోళనకరం**

రాష్ట్రంలో నత్రజని (ఎన్), భాస్వరం (పి), పొటాషియం (కె) వినియోగ నిష్పత్తి 4:2:1 కిగాను ప్రస్తుతం 14.9:5.7:1 తీవ్ర అసమతుల్యత నిష్పత్తిగా ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో హెక్టారుకు సగటున 217 కిలోల యూరియా వినియోగం జరుగుతుండగా, జాతీయ సగటు 160 కిలోలుగా ఉందని తెలిపారు. సూక్ష్మ పోషకాలు, జీవ ఎరువులు, పచ్చిరొట్ట ఎరువులు, ఫెర్టిగేషన్ వినియోగాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**నకిలీ ఎరువులు, పురుగుమందులపై కఠిన చర్యలు**

నకిలీ ఎరువులు, పురుగుమందులను అరికట్టంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మంత్రి తుమ్మల తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తక్షణమే పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ, నాసిరకం ఉత్పత్తులపై నమోదయ్యే ప్రతి కేసులోనూ కచ్చితమైన ఫాలోఅప్ ఉండాల్సిందేనన్నారు. విచారణ, ప్రాసిక్యూషన్ ప్రక్రియలు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పప్పుధాన్యాల సాగుపై ప్రశంస.. విత్తనాలపై అసంతృప్తి**

పప్పుధాన్యాల సాగు విస్తీర్ణంలో నిర్దేశించిన లక్ష్యంకంటే 127 శాతం సాధించడంపై మంత్రి అధికారులను అభినందించారు. అయితే ధృవీకరించిన విత్తన ఉత్పత్తి కేవలం 47 శాతం పంపిణీ 34 శాతం మాత్రమే సాధించడంపై అంసతృప్తిని వ్యక్తం చేశారు. ఈ రెండు ఆంశాలపై అధికారులు పూర్తి దృష్టి సారించాలని సూచించారు. రాబోయే రబీ సీజన్‌కు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఎఐఎఫ్) కింద మంజూరైన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. కేవలం నిధుల మంజూరును పెంచడమే కాకుండా, వాటితో వాస్తవంగా ఏర్పడుతున్న మౌలిక సదుపాయాలు, వాటి ద్వారా రైతులకు కలుగుతున్న విలువ జోడింపుపై దృష్టి పెట్టాలని చెప్పారు. రైతు నేస్తం వ్యవస్థను కేవలం వ్యవసాయ శాఖకు పరిమితం చేయకుండా అన్ని వ్యవసాయ అనుబంధ శాఖలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, సహకార శాఖలు రైతు నేస్తం వేదికను పూర్తిస్థాయిలో ఉపయోగించుకునేలా సమన్వయం పెంచాలని సూచించారు.

**'తెలంగాణ నేచురల్ ఫార్మింగ్ బ్రాండ్ పేరుతో అమ్మకాలు**

ప్రకృతి వ్యవసాయాన్ని కేవలం సాగు విస్తీర్ణం పెంచే కార్యక్రమంగా చూడకుండామార్కెట్‌తో అనుసంధానం చేయాలని మంత్రి స్పష్టం చేశారు. క్లస్టర్, సర్టిఫికెషన్, ఎఫ్‌పిఒ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్ విధానాలతో విధానంలో ముందుకు సాగాలని సూచించారు. ఎంపిక చేసిన పంటలు, ప్రాంతాల్లో క్లస్టర్లను ఏర్పాటు చేసి వాటి ఉత్పత్తులను ''తెలంగాణ నేచరల్ ఫార్మింగ్ బ్రాండ్'' పేరుతో మార్కెటింగ్ చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాలపై రైతుల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. గ్రామస్థాయి వరకు పథకాల ప్రచారాన్ని విస్తరించాలని ఆదేశించారు.


**సిరిసిల్ల మున్సిపాలిటీ కార్యాలయం, రాజన్న సిరిసిల్ల జిల్లా**

నం. E1/358/3rd Party QC/2026 — ఆసక్తి వ్యక్తీకరణ (EOI) — తేదీ: 19-09-2026

సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలో చేపట్టే అన్ని రకాల సివిల్ పనులు మరియు ఇతర పనులకు సంబంధించి, ''థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్'' (నాణ్యత నియంత్రణ) సేవలను అందించడానికి ప్రసిద్ధ కన్సల్టెంట్ల నుండి సిరిసిల్ల మున్సిపాలిటీ కమిషనర్ ఆసక్తి వ్యక్తీకరణను (EOI) ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి గల ఏజెన్సీలు / కన్సల్టెంట్లు తమ ఆసక్తి వ్యక్తీకరణతో పాటు ఆర్థిక ప్రతిపాదన మరియు అవసరమైన పత్రాలను ఆన్‌లైన్‌లోనూ, అలాగే ఈ కార్యాలయానికి కూడా **21-09-2026 ఉదయం 11:00 గంటల నుండి 28-09-2026 సాయంత్రం 4:00 గంటల మధ్య** సమర్పించవలసిందిగా కోరడమైనది. **సాంకేతిక బిడ్:** 28-09-2026 సాయంత్రం 4:15 గంటలకు తెరవబడుతుంది. కన్సల్టెంట్లు బిడ్ పత్రాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించి సమర్పించాలి.

సం/- కమిషనర్,
సిరిసిల్ల మున్సిపాలిటీ

DIPR R.O. No. : 10285-PP/CL/ADVT/2026-27, Date: 19-09-2026

**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్**

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, బోడుప్పల్ సర్కిల్-10, బంగారు మైసమ్మ ఆలయం దగ్గర, బోడుప్పల్ - 500092. ఇ-మెయిల్: eecircle10MMC@gmail.com

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

టెండర్ నోటీసు నం. 27/EE/Boduppal Circle-10/MMC/Tenders/2026-27, తేదీ: 19.09.2026. ఎంఎంసి పరిధిలోని ఉప్పల్ జోన్, బోడుప్పల్ సర్కిల్-10లో 15 పనులకు సంబంధించిన టెండర్ నోటీసు. పూర్తి వివరాలను https://tender.telangana.gov.in/login.html వెబ్‌సైట్‌లో చూడవచ్చు. సంబంధిత కార్యక్రమాల వివరాలు కింద ఇవ్వబడ్డాయి:

| ఈవెంట్స్ | 17 పనులకు మాత్రమే |
|---|---|
| ప్రారంభ తేదీ | 21.09.2026, సాయంత్రం 4:00 గంటలకు |
| టెండర్ పత్రాల డౌన్‌లోడ్ ముగింపు తేదీ | 28.09.2026, సాయంత్రం 4:00 గంటలకు |
| బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం | 28.09.2026, సాయంత్రం 4:00 గంటలకు |
| ప్రైస్ బిడ్ తెరిచే సమయం | 28.09.2026, సాయంత్రం 4:01 గంటలకు |

**సంబంధిత అధికారి చిరునామా:** శ్రీ కె. రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బోడుప్పల్ సర్కిల్-10, MMC, హైదరాబాద్. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in/login.htmlలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్
బోడుప్పల్ సర్కిల్-10, ఎంఎంసి.

DIPR R.O. No. : 10301-PP/CL/ADVT/2026-27, Date: 19-09-2026



## సబ్ స్టేషన్ ముట్టడించిన రైతులు

**ప్రజాపక్షం/అయిజ:** అయిజ మండలం ఏక్లాస్‌పురం, దేవబండ గ్రామాల రైతులు అయిజ పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. 24 గంటలు ఇవ్వాల్సిన కరెంటు 7 గంటలు మాత్రమే ఇస్తున్నారని, దీంతో ఉన్న పంటలు కూడా ఎండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక ఎలక్ట్రికల్ ఎఇ చెన్నయ్య స్పందిస్తూ పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రైతులకు రావాల్సిన 10గంటల విద్యుత్‌ను పూర్తిగా అందిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ కురువ నాగన్న, మాజీ సర్పంచ్ కోడెల తిమ్మప్ప, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

**ప్రజాపక్షం/ధన్వాడ :** నారాయణపేట్ జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలోని గల తెలంగాణ మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ నందు కలుషిత ఆహారం తిని 18 మందికి పైగా విద్యార్థులు అస్వస్థతకు గురికావడం జరిగింది. ధన్వాడ మండల విద్యాశాఖ అధికారి గాయత్రి, జిఇసిఓ సంగీత చేపట్టిన విచారణలో తేలిన విషయాలు ఈ విధంగా ఉన్నాయి. శనివారం విద్యార్థులకు ఉదయం అల్పాహారంలో మైసూర్ బోండా, వెరుశనకాయల చట్నీ ఇవ్వడం జరిగింది. బూజు పట్టిన వేరుసెనగలు చట్నీ తినటం వలననే అస్వస్థతకు గురైనట్లు విద్యార్థులు, విచారణ అధికారులు తెలియజేశారు. వెరుశనక్కాయలు సరిగా లేకపోవడం వల్ల లేదా బుజుపట్టి ఉండటం వల్ల ఈ రకంగా జరిగి ఉండవచ్చునని అనుమానం వ్యక్తం చేశారు. ఈ వేరు సేనక్కాయలను సీజ్ చేసినట్లు తెలియచేశారు. విధులలో నిర్లక్ష్యం వహించినందుకు మోడల్ స్కూల్ లోని బాలికల హాస్టల్ లో కేర్‌టేకర్‌గా పనిచేస్తున్నటువంటి అనురాధ, వంట మనిషిగా పనిచేస్తున్నటువంటి కావేరి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశానుసారం, విధుల నుంచి తొలగిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు ప్రకటనలో తెలియజేశారు.

## నర్వ మండల పిఆర్‌టియు టిఎస్ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/నర్వ :** నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రంలో పిఆర్టీయు టిఎస్ మండల నూతన కార్యవర్గాన్ని ఘనంగా, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు వై.జనార్దన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె వెంకట్ రెడ్డి హాజరై నూతన కార్యవర్గ ఎన్నికను ఏకగ్రీవంగా పూర్తిచేశారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్షులుగా సూరం వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా గోడల హరీష్, మండల అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, సదన్‌రావు, వెంకటేశ్వర్లు, మధుసూదన్, అబ్దుల్ సలీం, వేణుగోపాల్ రెడ్డి, నరేష్ కుమార అఖిల్ పాషా, దామోదర్ రెడ్డి , ఎన్.రాజు, నాగరాజు, విష్ణువర్ధన్, ప్రవీణ్ కుమార్, రవికుమార్, నాగేష్, వీరేష్ బాబు, ప్రదీప్, శ్రీనివాసులు, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

## పెట్టుబడుల పేరుతో రూ.13.25లక్షల మోసం : కేసు నమోదు

ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇన్స్‌పెక్టర్ కమలాకర్

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు క్యువిఎస్‌ఇ అనే యాప్‌లో పెట్టుబడులు పెడితే డాలర్ల రూపంలో అధిక లాభాలు వస్తాయని నమ్మి మొత్తం సుమారు రూ.13.25లక్షలు పెట్టుబడిగా పెట్టి మోసపోయిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జడ్చర్ల పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కమలాకర్ తెలిపారు. ఫిర్యాదు వివరాల ప్రకారం ఒక వ్యక్తి క్యువిఎస్‌ఇ యాప్‌లో తాను పెట్టుబడి పెట్టి లాభాలు పొందుతున్నట్లు చూపిస్తూ పలువురిని నమ్మించినట్లు తెలిపారు. అతను పంపిన లింక్ ద్వారా బాధితులు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని మొదట కొంత మొత్తాన్ని ఫోన్ పే ద్వారా చెల్లించారు. ఈ క్రమంలో సొంత డబ్బులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు, పరిచయస్తుల నుంచి సేకరించిన మొత్తాలను ఫోన్ పే, నగదు రూపంలో చెల్లించి మొత్తం రూ.13,25,000 వరకు పెట్టుబడి పెట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే యాప్‌లో డబ్బు పెరుగుతున్నట్లు కనిపించినప్పటికీ, ఆ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో అనుమానం వ్యక్తం చేశారు. సంబంధిత వ్యక్తిని సంప్రదించగా మరికొంత సమయం వేచి ఉండాలని చెప్పినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కమలాకర్ మాట్లాడుతూ తక్కువ సమయంలో అధిక లాభాలు, డాలర్ల రూపంలో భారీ రాబడులు వస్తాయని చెప్పే ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, ఆన్‌లైన్ స్కీమ్‌లను నమ్మవద్దని సూచించారు. యాప్‌లో పెట్టుబడి మొత్తం లేదా లాభం పెరుగుతున్నట్లు కనిపించడం మాత్రమే అది నిజమైన పెట్టుబడి అని నిర్ధారించడానికి ఆధారం కాదని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే సంబంధిత లావాదేవీలను నిలిపివేసి, మోసపోయిన నగదును ఫ్రీజ్ చేయడానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనుమానాస్పద పెట్టుబడులపై ఎవరైనా ప్రోత్సాహిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని, సమాచార దాతల వివరాలను గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ కమలాకర్ తెలిపారు.

## ఎండిపోతున్న జూరాల ఆయకట్టు పంటలను తక్షణమే ఆదుకోవాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన ఎంపి

**ప్రజాపక్షం/గద్వాల్ రూరల్ :** జురాల ప్రాజెక్టు పరిధిలోని గద్వాల, ఆత్మకూరులో సాగునీరు అందక రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఎండిపోతున్న పంటలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నీటిని విడుదల చేయాలని మహబూబ్‌నగర్ ఎంపి డికె.అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ఎంపి డికె.అరుణ శనివారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. క్షేత్రస్థాయిలో రైతాంగం ఎదుర్కొంటున్న తీవ్రమైన పరిస్థితులను వివరించానన్నారు. ఈ సందర్భంగా డికె.అరుణ మాట్లాడుతూ జురాల ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు నీరు అందక ఎండిపోతుండటంతో గద్వాల, ఆత్మకూరు ప్రాంతాల్లోని రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని గుర్తుచేశారు. రైతులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, నిరసనలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాబోయే మూడు రోజులలోగా జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. రైతుల పంటలు పూర్తిగా ఎండిపోయిన తర్వాత భవిష్యత్తులో అధికారులు నీటిని విడుదల చేసినా ఎలాంటి ప్రయోజనం ఉండదని, అది కేవలం బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని స్పష్టం చేశారు. పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే అన్నదాతలు కన్నీరు పెడుతున్నారని, ప్రభుత్వం స్పందించి జురాల దిగువన సాగుభూములకు వెంటనే నీటిని విడుదల చేయాలని అన్నారు.

# ప్రజల ఆయుష్షు కాపాడలేని దుస్థితి

విజయ రాములు కుటుంబాన్ని పరామర్శించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/అమరచింత :** అంతరిక్షంలోకి పోతున్న నేటి యుగంలో కూడా ప్రజల ఆయుషు కాపాడలేని దుస్థితి దాపురించిందని గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి అంజయ్య నాయక్ విచారం వ్యక్తం చేశారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు కుటుంబాన్ని సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు పరామర్శించి జ్యోతి చిత్రపటానికి అంజయ్య నాయక్, సిపిఐ రాష్ట్ర నేతలు దాసోజు రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంజయ్య నాయక్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగం పరుగులు పెడుతుందని అంతరిక్షంలో మానవుడు సంచరిస్తున్నాడని గొప్పలు చెబుతున్న నేటి ఆధునిక యుగంలో కూడా ప్రజల ఆయుషుని కాపాడే వైద్యం లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యోతి మరణం అత్యంత విషాదకరమని అన్నారు. జ్యోతి చిరునవ్వుతో అందరినీ ఆత్మీయంగా పలకరించేదని, కమ్యూనిస్టు పార్టీ అన్న, ప్రజా ఉద్యమాలు అన్న చాలా గౌరవించేదని, పేదలు లేని రాజ్యం కావాలన్నదే జ్యోతి లక్ష్యమని అన్నారు. విజయ రాములు ఆశయాలకు ఎలాంటి లోటు లేకుండా కమ్యూనిజం సిద్ధాంతం తన నిజ జీవితంలో అన్వాయించుకోవడమే కాకుండా మంచి కమ్యూనిస్టుగా బ్రతికారని అన్నారు. ప్రజల మేలుకోరి అనునిత్యం ప్రజల కోసం పని చేస్తున్న విజయరాములు కుటుంబానికి తీరని శోకం మిగిలిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రవీందర్, శ్యాంసుందర్, భాస్కర్, సిపిఐ అమరచింత మండల కార్యదర్శి అబ్రహం, ఎఐటియుసి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.సురేష్, సిపిఐ నాయకులు లక్ష్మి నారాయణ, బాలస్వామి, గాయని శ్యామల, గీత పద్మావతి, భారతి, శారద, చెన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి కెటిఆర్ పరామర్శ

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి ఇటీవల మరణించడంతో సిరిసిల్ల ఎమ్మెల్యే కెటిఆర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ సింగోటం. గ్రామంలో టిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు శనివారం పర్యటించారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి ఇటీవల మృతి చెందారు. లక్ష్మారెడ్డి చిత్రపటానికి కెటిఆర్ పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కెటిఆర్ మృతుడు లక్ష్మారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన సానుభూతి తెలియజేశారు. కెటిఆర్ వెంట అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ మంత్రులు సంగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అల వెంకటేశ్వర్ రెడ్డి, అంజయ్య యాదవ్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తెలంగాణ బొటానికల్ గార్డెన్‌కు 'బ్రిలియంట్' విద్యార్థులు



**ప్రజాపక్షం/జడ్చర్ల :** డా.బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), జడ్చర్లలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను షాదనగర్‌కు చెందిన బ్రిలియంట్ గ్రామర్ స్కూల్‌కు చెందిన సుమారు 180 మంది విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులకు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.డి.నర్మద, గార్డెన్ సమన్వయకర్త డాక్టర్ బి.సదాశివయ్య సాదర స్వాగతం పలికారు. డాక్టర్ సదాశివయ్య విద్యార్థులను తెలంగాణ బొటానికల్ గార్డెన్‌లోని వివిధ విభాగాలకు తీసుకెళ్లి, అక్కడ ఉన్న వివిధ రకాల మొక్కలు, వాటి ఔషధ, పర్యావరణ, ఇతర ఉపయోగాలని వివరించారు.

**పాముకాటు నివారణపై అవగాహన :** అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పాముల సంరక్షణ, పాముల గుర్తింపు, పాముకాటు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స తదితర అంశాలపై డా.సదాశివయ్య అవగాహన కల్పించారు. బొటానికల్ గార్డెన్‌లో సంరక్షిస్తున్న నాగుపాము జెర్రిపోతు, పూడుపాము తదితర పాములను విద్యార్థులకు చూపించి, వాటి ప్రత్యేకతలు పర్యావరణంలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు గార్డెన్‌లో పెంచిన ఔషధ మొక్కలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో గార్డెన్ సమన్వయకర్త డా.బి.సదాశివయ్య, జంతు శాస్త్ర అధ్యాపకులు ఇస్రాత్ సుల్తానా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.డి.నర్మద, పాఠశాల ఉపాధ్యాయులు షేక్ నవాబ్, మురళీకృష్ణ, అనిత, లత, పరిశోధక విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 వాలంటీర్లు పాల్గొన్నారు.

## సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/కృష్ణ :** నారాయణపేట్ కృష్ణ మండల కేంద్రంలో మండల ప్రత్యేక అధికారి రహమాన్ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ సమావేశంలో తాగు నీటి సమస్య, రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి నియమించాలని, గ్రామ కంఠం భూమి సర్వే చేయాలని, లోవోల్టెక్ సమస్యలు, కొత్త స్థంభాలు ఏర్పాటులో సమస్యలు సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు చెప్పిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి రహమాన్ అధికారులకు ఆదేశించారు. ఎంపిడిఒ కిషోర్ కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, పిఎసిఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఎంఇఒ నిజముద్దీన్, ఎఒ సుదర్శన్ గౌడ్, హౌసింగ్ ఎఇ సాయి కార్తీక్, ఇరిగేషన్ ఎఇ అజామ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.26వేలకు పెంచాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్

మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కార్మికుల నిరసన



**ప్రజాపక్షం/మక్తల్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే కనీస వేతనం రూ.26వేలకు పెంచుతూ అమలు చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. శనివారం మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్ర పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికుల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీల విధానం అమలు చేస్తుందని అన్నారు.

ప్రైవేట్ ఏజెన్సీల మూడు సంవత్సరాల కాలవ్యవధితో టెండర్ గైడ్‌లైన్స్ రూపొందించి ఏజెన్సీలని ఎంపిక చేస్తున్నారని, ప్రస్తుతం నడుస్తున్న ఏజెన్సీల గడువు ముగిసి ఏడాదిన్నర అవుతున్నా వాటిని రద్దు చేయకుండా వారికే అనుమతులు పెంచుతూపోవడం సరికాదని అన్నారు. ప్రభుత్వాసుపత్రి కార్మికులకు మూడు సంవత్సరాలకు ఓసారి వేతనాల పెంపు జరగాలని, కానీ టెండర్లు రాకపోవడం చేత కార్మికులు తీవ్రమైన ఆర్థిక నష్టంతో పాటు మోయలేని పని భారంతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వేతనాల పెంపు పని భారం, తగ్గింపు, ఆసుపత్రి పడకల సామర్థ్యం ప్రకారం కార్మికుల సంఖ్య పెంపుదల చేయాలని, కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్స్, రక్షణ వస్తువులైన బూట్లు, సబ్బులు, గ్లౌజులు క్రమం తప్పకుండా అందించాలని, ఏజెన్సీల విధానం రద్దు చేసి కార్పొరేషన్ ద్వారా కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నేత అబ్రహం, కురుమూర్తి, ఆస్పత్రి, కార్మికులు బాలరాజ్, సంధ్య, లక్ష్మి , తిప్పమ్మ పాల్గొన్నారు.

# రాజీ మార్గంలో కేసుల పరిష్కారమే లక్ష్యం

డిసెంబర్ 12న నాలుగో జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** రాజీమార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఎంతో సమర్థవంతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. డిసెంబరు 12న నిర్వహించనున్న నాలుగో జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నారాయణపేట్ జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్, పోలీస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కక్షిదారులు లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సెప్టెంబర్ 12న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా 5,552 కేసులు పరిష్కరించగా, నారాయణపేట్ జిల్లా రాష్ట్రవ్యాప్తంగా 23వ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, సంబంధిత సిబ్బందిని అభినందించారు. డిసెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, నేగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ యాక్ట్ కేసులు, ఎగ్జిక్యూషన్ పిటిషన్(ఇపి), సైబర్ నేరాల కేసులు తదితరాలను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లకు సంబంధించిన కేసుల పరిష్కారంపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కార ప్రక్రియను యథావిధిగా కొనసాగించాలని తెలిపారు. అనంతరం మహిళా , శిశు సంక్షేమ శాఖ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం, వన్‌స్టాప్ సఖి కేంద్రాల సిబ్బందితో సమావేశమై పోక్సో కేసుల్లో తప్పనిసరి నివేదికలు, బాధితుల గుర్తింపు రక్షణ, ఫాస్ట్ ట్రాక్ విచారన తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. సమావేశంలో కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ జి.వినీత్ కుమార్, డిఎల్ఎస్ఎ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వింధ్యా నాయక్, డిఎస్పీ లింగయ్య, ఆర్డీఓ రమేష్, డిపిఆర్వో ఎం.ఎ.రషీద్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి కరిష్మా, వన్‌స్టాప్ సఖి సెంటర్ కోఆర్డినేటర్ క్రాంతిరేఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి అనిత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటనా స్థలాన్ని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పరిశీలించారు. శనివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని బస్సు డిపో సమీపంలో తాండూర్ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రమాదాన్ని గమనించి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికుల పరిస్థితిపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రయాణికులకు ఏమైనా ప్రమాదం సంభవించిందా, ఎవరికైనా గాయాలయ్యాయా అనే వివరాలను అక్కడున్న అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల భద్రతకు తీసుకున్న చర్యలపై కూడా అధికారులను ప్రశ్నించారు. బస్సు, టిప్పర్ డ్రైవర్లకు స్వల్ప గాయాలైనట్లు ట్రాఫిక్ ఎస్ఐ, సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై వివరాలను తెలుసుకున్నారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ రహదారి భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు.

## రైతులకు విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/వనపర్తి :** అన్నదాతలకు నిరంతరంగా వ్యవసాయ విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. శనివారం రోజు పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామం చెందిన సబ్ స్టేషన్ ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యుత్ సరఫరా లాగ్‌బుక్ ను పరిశీలించారు. విద్యుత్ సరఫరా పై సిబ్బందిని నిలదీశాడు. తమ హాయంలో రైతులకు 24 గంటల విద్యుత్ అందించామని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 12 గంటలకు కాదు కదా ఎనిమిది గంటలు కూడా విద్యుత్ సరఫరా నిరంతరంగా ఇవ్వటం లేదని దీనివల్ల అన్నదాతల పంటలు ఎండిపోతున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాతలను కష్టపెట్టను ఏ ప్రభుత్వం కూడా మరో కూడా సాధించలేదని ఆయన అన్నారు. శ్రీశైలం జలాలను ఆంధ్ర రాష్ట్రం తరలించుకోబోతుంటే పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రభుత్వాన్ని విమర్శించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడారు. పెబ్బేరు మండల కేంద్రంలో సుభాష్ చౌరస్తా దగ్గర కార్నర్ మీటింగులో కూడా రైతు భరోసా, రైతు బీమా, రుణమాఫీ, పింఛన్ల పెంపుదల విషయంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. 40 సంవత్సరాలుగా సుదీర్ఘంగా శ్రీశైలం నిర్వాసితుల ఉద్యోగాల విషయంపై నిర్వాసితులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో పాటు, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ , అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, లక్ష్మారెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, గుమ్మడం గ్రామ సర్పంచు నాగేష్, రైతు కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, న్యాయ సేవలపై అవగాహన

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లాలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి నిష్కపాత్రుడు దివ్యాంగ విద్యార్థులు విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి నిష్కపాత్రుడు సూచించారు. శనివారం గద్వాల పట్టణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గద్వాల పట్టణంలోని అంధుల పాఠశాలలో దివ్యాంగ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, న్యాయ సేవలు, హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి నిష్కపాత్రుడు హాజరై విద్యార్థులతో మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులు విద్యతో పాటు భవిష్యత్తులో స్వయం ఉపాధి లేదా ఉద్యోగ అవకాశాలను పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన ప్రాధాన్యతను వివరించారు. ముఖ్యంగా దివ్యాంగజన్ కౌశల్ వికాస్, దివ్యాంగజన్ రోజ్గర్ సేతు కార్యక్రమాల ద్వారా దివ్యాంగులకు అందుబాటులో ఉన్న నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఉపాధి అవకాశాలు, ఉద్యోగ సంబంధిత సేవలపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగన్న, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉడాన్‌తో తెలంగాణ యువతకు భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలు


'టాస్క్' సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** తెలంగాణ యువతను భవిష్యత్ సాంకేతిక రంగానికి సిద్ధం చేయడంతో పాటు, నైపుణ్యాల ఆధారంగా ఉపాధి అవకాశాలకు అనుసంధానం చేయడమే లక్ష్యంగా టాస్క్ డెల్ టెక్నాలజీస్ భాగస్వామ్యంతో ఉడాన్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు టాస్క్ సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టాస్క్ కూ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, ఐటి, సి జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, స్టేట్ కౌన్సిల్ సెక్రెటరీ రామ్, టాస్క్ సిఇఒ నితిన్ కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. టాస్క్ డెల్ టెక్నొలజీస్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం ద్వారా తెలంగాణలో 5,500 మంది విద్యార్థులకు 25 కేంద్రాల్లో మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఈ సమావేశంలో లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ కూ నిఖిల్, డెల్ టెక్నొలజీస్ ప్రతినిధులు కె.కృష్ణ కిషోర రమేష్ జంపుల తదితరులు పాల్గొన్నారు.



## సిఎంఆర్ఎఫ్ చెక్ అందజేత

**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని కొట్ర గ్రామానికి చెందిన చల్లమల్ల రామస్వామి గత కొద్ది రోజుల కితం రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండు కాళ్లను కొల్పోయాడు. ఈ విషయాని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పోనుగోటి రవీందర్‌రావు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టి తీసుకెళ్లాడు. దీంతో ఆయన సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.1,75,000ల చెక్‌ను బాధిత కుటుంబానికి స్థానిక సర్పంచ్ శ్యాంపూరి శారదచెన్నయ్యలతో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాలకు ఆపద సమయంలో సిఎంఆర్ఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కడారి శ్రీనివాస్‌యాదవ్, వసంతపు రామస్వామి, కొప్పు మల్లేష్, ఆంజనేయులు, పోలేమోని రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్‌యాదవ్, పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు

తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో సిపిఐ ధర్నా

**ప్రజాపక్షం/చండూరు:** చండూరు మున్సిపాలిటీలోని 3వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో శనివారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఇబ్బందులను అధికారులు తక్షణమే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్లరాజు సతీష్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ మున్సిపాలిటీలోని మూడవ వార్డులో గత మూడు నెలల నుండి తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ సమస్య పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. వార్డులోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలకు అవసరమైన మేరకు తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి మరింత పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడు ,4వ వార్డు కౌన్సిలర్ జిల్లా ధనమ్మ,శ్రీనివాసులు , దోటి వెంకన్న, దోటి యాదయ్య , గద్దం నవీన్ , అందిర్ల పరమేష్, పరమేష్ , సాలమ్మ , వెంకటమ్మ పాల్గొన్నారు.

## వేగవంతంగా రీ సర్వే పనులు

యాదాద్రి జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** రీ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర రావు అన్నారు. శనివారం రాజాపేట మండలం బసంతాపురం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా రీ సర్వే పనుల పురోగతిని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పలువురు రైతులతో మాట్లాడిన ఇంచార్జి కలెక్టర్, రీ సర్వే కార్యక్రమంలో రైతులు చురుగ్గా పాల్గొని సర్వే సిబ్బందికి సహకరించాలని సూచించారు. రీ సర్వే పనులను నాణ్యతతో, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాజాపేట మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తహసీల్దార్తో కలిసి జిల్లా ఇంచార్జి కలెక్టర్ భాస్కర్ రావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్సీలోని అటెండెన్స్ రిజిస్టర్ను పరిశీలించి, సిబ్బంది హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు నిర్వహించాలని ఇంచార్జి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల తహసీల్దార్ రవి కిరణ్ కుమార్, సర్వేయర్ సత్యం, మండల గిర్ధావర్ పల్లెపాటి నరసింహులు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ సలావుద్దీన్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్

**ప్రజాపక్షం/యాదాద్రి :** పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న భువనగిరి పట్టణంలోని 27వ వార్డు మాజీ కౌన్సిలర్ సలావుద్దీన్ ( రఫీవుద్దీన్)ను కాంగ్రెస్ పార్టీ నుండి తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు కూర వెంకటేష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గత ఎన్నికల సమయంలో పార్టీ అధికారిక అభ్యర్థులకు వ్యతిరేకంగా వ్యవహరించడం, ఇతర పార్టీలకు మద్దతు తెలపడం ,సోషల్ మీడియా, వాట్సాప్ వేదికల ద్వారా పార్టీ ఉన్నత స్థాయి నాయకాలపై అవాస్తవ ప్రచారాలు చేస్తూ పార్టీ ప్రతిష్టను దిగజార్చేలా ప్రవర్తించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. తీవ్ర క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన సలావుద్దీన్ను వివరణ కోరగా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో, అధిష్టానం ఆదేశాల మేరకు ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు అన్ని రకాల బాధ్యతల నుండి సస్పెండ్ చేసినట్లు స్పష్టం చేశారు. ఇకపై సలావుద్దీన్తో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు మరియు కార్యకర్తలు ఎవరూ ఆయనతో ఎలాంటి పార్టీ పరమైన లావాదేవీలు లేదా కార్యక్రమాలలో పాల్గొనవద్దని కూర వెంకటేష్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలి

**ప్రజాపక్షం/చివ్వెంల :** వ్యవసాయానికి ప్రభుత్వం 12 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తిరుమలగిరి సబ్‌స్టేషన్ ఎదుట గుంజలూరు గ్రామ రైతులు నిరసన తెలిపి మాట్లాడారు. కొన్ని మండలాల్లో 12 గంటలు, మరికొన్ని మండలాల్లో 10 గంటల విద్యుత్ సరఫరా చేస్తోందని అదేవిధంగా తమకు కూడా 12 గంటల విద్యుత్ సరఫరా చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, కోతల కారణంగా వ్యవసాయ పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల రైతులకు నాణ్యమైన 12 గంటల విద్యుత్ సరఫరా చేయకపోతే అన్ని గ్రామాల రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు బొల్లికొండ గోపి, ఎక్కటి ఉపేందర్, ఐతరాజు మోహన్, పెద్ది బాలకృష్ణ, పరాలా మల్లికార్జున్, ఎక్కటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



### వారం రోజుల్లో సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి

# నల్లగొండ జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్య

డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత
ఇంటి స్థలంతో పాటు
రూ.10 లక్షలు కేటాయించాలి
మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి
రెండో రోజు దీక్షలకు సిపిఐ(ఎం) మద్దతు

**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ నగర జర్నలిస్టుల ఇంటి స్థలాల సమస్య పరిష్కారం కోసం వచ్చే వారం రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్షులు పున్న కైలాస్ నేత అన్నారు. టియుడబ్ల్యూజే (ఐజెయు) నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణ జర్నలిస్టుల స్థలాల కోసం చేపట్టిన రెండో రోజు దీక్షకు శనివారం సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల ప్రజల కోసం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించడానికి జిల్లా మంత్రులు,ఎంపీలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తో కలిసి నల్లగొండ జర్నలిస్టుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. జర్నలిస్టులు అడుగుతున్న ఇళ్లస్థలం న్యాయబద్ధమైనదని, ధర్మం ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం చేయాల్సిన బాధ్యత తాము చేపట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నామన్నారు జర్నలిస్టులు సమాజానికి బ్యాక్ బోన్ పిల్లర్ వంటి వారన్నారు. నల్లగొండలో జర్నలిస్టులు నిర్వహిస్తున్న దీక్షల వేదిక నుంచే సీఎం రేవంత్ రెడ్డికి రెండు చేతులు జోడించి కోరుతున్నానని, నల్లగొండలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తానే ముందు ఉండి పరిష్కారమయ్యే దిశగా కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇంటి స్థలం పొందడం ఆత్మగౌరవం అన్నారు.



**మంత్రి కోమటిరెడ్డి జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చి ప్రతి ఇంటి నిర్మాణానికి రూ. 10 లక్షలు ఇవ్వాలి:మాజీ ఎమ్మెల్యే కంచర్ల**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే నల్లగొండ పట్టణ జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు,ప్రతి ఒక్కర్తికీ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం తరఫున రూ.10లక్షలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. తాను శాసన సభ్యునిగా ఉన్న కాలంలో 113 మందికి ఇళ్ల స్థలాల పట్టాలకై డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని ప్లాట్లు కూడా విభజించడం జరిగిందన్నారు. జర్నలిస్టులు అందరి దగ్గర దరఖాస్తులు కూడా స్వీకరించామని,ఈలోగా ఎన్నికలు రావడంతో పట్టాల పంపిణీ ప్రక్రియ ఆగిపోయిందని తెలియజేశారు.న్యాయమైన మీ కోరికను తీర్చవలసిన బాధ్యత నేటి మంత్రి,జిల్లా కలెక్టర్ పై ఉన్నదని,రెడీగా ఉన్న ప్లాట్లను ఫైల్ తెప్పించుకొని అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి,నాయకులు దండంపల్లి సత్తయ్య,బిఆర్ఎస్ జిల్లా నాయకుడు పాలడుగు నాగార్జున సంఘీభావం తెలిపారు.జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కోసం జిల్లా కమిటీ చేపట్టిన రిలే నిరాహార దీక్షకు తమ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. టియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి, యూనియన్ నాయకులు దోటి శ్రీనివాస్,జిల్లా యాదయ్య,అశ్వక్ అహ్మద్,అబ్బోజు మదనాచారి,పిట్టల రామకృష్ణ,వంగాల శ్రీనివాసరెడ్డి, కత్తుల యాదగిరి,నర్సయ్య,తెలంగమ్మ దశరథ,సోమ చంద్రశేఖర్,ఉయ్యాల లింగయ్య గౌడ్,రమేష్,జాజాల కృష్ణ,రమేష్, చెనగోని రెడ్డిపల్లి యాదగిరి,చేపూరి రవి,సుధాకర్,సూరారపు రాంప్రసాద్, నగరా భాస్కర్,కంది సూర్యనారాయణ,అశోక్, గంగాధర్ వెంకటేశ్వర్లు, స్వామి దీక్షలో పాల్గొన్నారు.



## రైతులతో కలిసి పత్తిపంట పొలాల క్షేత్ర సందర్శన

**ప్రజాపక్షం/మునుగోడు:** ప్రస్తుత ఎల్ నినో ప్రభావ పరిస్థితుల్లో సాగు చేసిన పంటలను జిల్లా వ్యవసాయ అధికారి ఉట్ల వినోద్ కుమార్ శనివారం పరిశీలించారు.మండలంలోని పులిపలుల క్లస్టర్ పరిధిలోని సింగారం గ్రామంలో వానాకాలంలో సాగు చేసిన పత్తి పంట పొలాలను రైతులతో కలిసి క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా పత్తి పంటలో ప్రస్తుత పరిస్థితుల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులను ప్రస్తుతం సాగు చేస్తున్న పంటల వివరాలు,ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగారం,ఊకొండి,కొంపల్లి గ్రామాలలోని పంట పొలాలను సందర్శించారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మాదగోని నరసింహ గౌడ్,నిఖిల్ కుమార్,అఖిలాష్,రైతులు కారింగు సత్తయ్య,వట్టి అంజిరెడ్డి,సరికొండ సైదులు, రావుల నరసింహ,రాంబాబు, కవిత,ఉప్పునూతల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి హక్కుల కోసం 90 ఏళ్ల అలుపెరుగని పోరాటం

హనుమకొండలో జరిగే ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలి: శాంతి కుమార్




**ప్రజాపక్షం/భువనగిరి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 90వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 28, 29, 30 తేదీలలో హనుమకొండలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఏఐఎస్ఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఉప్పల శాంతి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలో కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ 90 ఏళ్లుగా విద్యార్థుల హక్కులు, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థుల పక్షాన నిలుస్తున్న సంఘంగా ముందుకు సాగుతోందన్నారు.చదువుపోరాడు అనే నినాదంతో విద్యార్థుల్లో చైతన్యం నింపుతూ, విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని, విద్యారంగంలో ప్రభుత్వ బాధ్యత పెరగాలని నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఉప్పల శాంతి కుమార్ అన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్లు, ఫీజు రీయింబర్స్మెంట్లు విడుదల చేయాలని, ప్రభుత్వ విద్యాసంస్థలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యను వ్యాపారంగా మార్చే విధానాలకు అడ్డుకట్ట వేయాలని అన్నారు.విద్యార్థుల సమస్య ఏదైనా ఏఐఎస్ఎఫ్ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని తెలిపారు. హనుమకొండలో మూడు రోజుల పాటు జరిగే ఈ వార్షికోత్సవాల్లో విద్యార్థులు, యువత, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కందుల మధు నాయకులు అశోక్, నరేందర్, రవీందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వాటర్‌షెడ్ పనులపై విచారణ

క్షేత్రస్థాయిలో పరిశీలించిన డిఆర్‌డిఎ పిడి సురేష్



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** కొత్తగూడెం గ్రామపంచాయతీ పరిధిలో వాటర్షెడ్ కార్యక్రమం కింద నిర్మించిన కుంటలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులు, అవకతవకల ఆరోపణలపై డిఆర్డిఏ పిడి సురేష్ శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులతో సమావేశం నిర్వహించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు వాటర్షెడ్ ఆధ్వర్యంలో చేపట్టిన కుంటల నిర్మాణ పనులకు సంబంధించిన సమస్యలు, తమకు ఎదురైన ఇబ్బందులు, పనులపై ఉన్న అభ్యంతరాలను డిఆర్డిఏ పి డి వివరించారు. ముఖ్యంగా గ్రామస్థులు, వాటర్షెడ్ కమిటీ సభ్యులకు పనులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియకుండానే కొన్ని పనులు చేపట్టారని ఆరోపించారు.అవసరం లేని ప్రాంతాల్లో, నీటి వసతి లేని చోట్ల కూడా ఊట కుంటలు నిర్మించడంతో ప్రజాధనం దుర్వినియోగమైనట్లు గ్రామస్థులు అధికారికి విన్నవించారు. అలాగే కుంటల నిర్మాణ పనులను స్థానికులకు కాకుండా ఇతర గ్రామాలకు చెందిన కాంట్రాక్టర్లకు అప్పగించి, వారి ఇష్టానుసారంగా పనులు నిర్వహించినట్లు ఆరోపించారు. పనుల ఎంపిక, నిర్మాణ నాణ్యత, ఖర్చులు తదితర అంశాలపై సమగ్రంగా విచారణ జరిపించాలని గ్రామస్థులు కోరారు.గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న డిఆర్డిఏ పి డి సురేష్, అధికారులతో కలిసి వాటర్‌షెడ్ ద్వారా నిర్మించిన కుంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పనుల నాణ్యత, నిర్మాణ వివరాలు, సంబంధిత రికార్డులను పరిశీలించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా డిఆర్డిఏ పి డి సురేష్ మాట్లాడుతూ, విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాలను జిల్లా కలెక్టర్కు నివేదిక రూపంలో సమర్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహ కురుమ, సర్పంచ్ చెరుకుపల్లి బీరయ్య, మాజీ సర్పంచ్ చెరుకుపల్లి నరసింహ, బీజేపీ మండల కార్యదర్శి కోడూరు బీరయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రాచకొండ జంగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మల్లేష్ గౌడ్, సీపీఎం వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ పనులను వేగవంతం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలో కొనసాగుతున్న వివిధ రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అధికారులు సమన్వయంతో వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ జూలకంటి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. శనివారం మండల ప్రజా పరిషత్ ఆవరణలో ఆయన అధ్యక్షతన మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రజలకు రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని, నూతన కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ అధికారి మేకల రుషేంద్రమణి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విద్యాశాఖ ద్వారా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్స్, నోట్ బుక్స్, రెండు జతల పాఠశాల దుస్తులు పంపిణీ చేసినట్లు ఎంఈవో ధర్మానాయక్ తెలిపారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు అందజేశామని పశుసంవర్ధక అధికారి జ్ఞానేశ్వర్ ప్రసాద్ వివరించారు.తక్కెలపాడు, ఆలగడప, లక్ష్మీపురంలో నిలిచిపోయిన వివో భవనాల నిర్మాణాలను తక్షణమే ప్రారంభించాలని, ఎస్బీఎం నిధుల కింద మంజూరైన డ్రెయిన్లు, కమ్యూనిటీ సోక్ పిట్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఏఈ వరలక్ష్మి కోరారు. వాటర్ ట్యాంక్ తండా వద్ద ఆర్ 5 ఎత్తిపోతల పథకానికి సంబంధించి మరమ్మతు పనులను పూర్తి చేసినట్లు నీటిపారుదల శాఖ ఏఈ ప్రభాకర్ స్పష్టం చేశారు. మిర్యాలగూడ నుండి దిలావర్‌పూర్ వరకు టీక్యతాండా మీదుగా రోడ్డు వెడల్పు పనులు ప్రగతిలో ఉన్నాయని ఆర్అండ్‌బీ ఏఈ వెల్లడించారు. సమావేశానికి ఏఈ రాకుండా లైన్‌మన్‌ను పంపడంపై సర్పంచులు నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్‌గా ఈడ్దుల మస్తాన్‌బాబు



**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్‌గా దండుమల్కాపురం గ్రామానికి చెందిన ఈడ్దుల మస్తాన్‌బాబు ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. డైరెక్టర్లుగా పర్నే శివారెడ్డి,సుర్కంటి లక్ష్మమ్మ,నల్ల నరేందర్‌రెడ్డి, బొబ్బిళ్ళ రాజేందర్,జక్కిడి వెంకట్‌రెడ్డి,రావుల స్వామి,ఎర్ర పెంటయ్య, పానుగోతు లచ్చిరాం,గుర్రం మనోహర్‌రెడ్డి,సుగుణమ్మ,దేవేందర్‌రెడ్డి, శ్రీహరిలను నియమించింది. పాలకవర్గ సభ్యులు శనివారం సింగిల్ విండో కార్యాలయంలో పదవి బాధ్యలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్,మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయ దేవేందర్,మునిసిపల్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి ఆయా గ్రామాల సర్పంచ్‌లు,కౌన్సిలర్లు పాల్గోన్నారు.



## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** విద్యార్థులు పాఠశాల స్థాయిలో చదువుతో పాటు క్రీడారంగంలో కూడా విశేషంగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. మిర్యాలగూడ మండల పరిధిలోని తుంగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రావీణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, క్రీడా నిర్వాహకులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## హెరిటేజ్ వాక్స్ పోటీలు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పర్యాటక రంగాన్ని దేశ అభివృద్ధిలో భాగం చేయడానికి ఎన్‌జి కళాశాల విద్యార్థులు,కోఆర్డినేటర్ సభ్యులు తమ వంతు కృషి చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫసర్ సముద్రాల ఉపేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని చారిత్రక,పర్యాటక,సాంస్కృతిక రంగాన్ని ప్రోత్సహిస్తూ 2047 నాటికి వికసిత్ భారత్, రైజింగ్ తెలంగాణ లక్ష్యంగా ప్రజల్లో చైతన్యం తేవడానికి హెరిటేజ్ వాక్స్,పాటల పోటీలు, డాన్స్, ఆర్ట్, క్రాఫ్ట్స్, రీల్స్,షార్ట్ ఫిల్మ్ విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఛాయా సోమేశ్వరాలయం,క్లాక్ టవర్,చర్చి,లతీఫ్ సాహెబ్ గుట్ట వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించామని తెలిపారు. టూరిజం ఇంచార్జ్ మహ్మద్ అక్బర్ అలీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 40 పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, ఇంకా గుర్తించాల్సిన ప్రాంతాలు చాలా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ టూరిజం క్లబ్ కోఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య,బాటనీ లెక్చరర్ కృష్ణ, చరిత్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్.కె.హబీబ్, కె.శివరాణి,శిరీష,యువ టూరిజం క్లబ్ సభ్యులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మద్దెలమ్మ దేవాలయంలో చోరీ

నగదు అపహరణ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** పోచంపల్లి పురపాలక పరిధిలోని భావనాఋషి పేటలోని శ్రీశ్రీశ్రీ మద్దేలమ్మ దేవాలయంలో శుక్రవారం అర్ధరాత్రి కొందరు దుండగులు చోరికి పాల్పడ్డ ఘటన చోటు చేసుకుంది.ఆలయ పూజారి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎప్పటి మాదిరిగానే శుక్రవారం రాత్రి భజన కార్యక్రమం ముగించుకొని ఆలయ ప్రధాన ద్వారానికి తాళాలు వేసి ఇళ్ళకు వెళ్ళి పడుకున్నారు. శనివారం హోమం కార్యక్రమం ఉండటంతో ఆలయం తెరిచేందుకు వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించారు.వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్టేషన్ హౌజ్ ఆఫీసర్ జగన్ బృందం విచారణ చేపట్టారు.గేట్ తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించినట్లు పోలీసులు గుర్తించారు.హుండీ లాక్ విరగగొట్టి నగదును ,సిసి కెమెరాలు అపహరించారు.చోరి దృశ్యాలు చిక్కకుండా సిసి కెమెరాలను ఎత్తుకెళ్ళినట్లు ప్రాథమికంగా దర్యాప్తులో భావిస్తున్నారు.ఇటీవలే బోనాల జాతర ఉత్సవాలు జరగటంతో హుండీలో భారీగా నగదు ఉంటుందనే పక్క ప్రణాళికతో గుర్తుతెలియని వ్యక్తులు ఈ దొంగతనానికి పాల్పడ్డేరేమో అనే కోణంలో క్లూస్ టీం దర్యాప్తు చేస్తున్నారు.భక్తులు వేసిన కానుకలు కాబట్టి నగదు ఎంత దోచుకున్నారో స్పష్టంగా చెప్పలేమని ఆలయ నిర్వాహకులు చెప్పారు.వేలిముద్రలు ఇతర ఆధారాలతో దొంగలను వెతికే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

## ఉపాధ్యాయులతోనే సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధ్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ప్రజాపక్షం/షాబాద్:** ఉపాధ్యాయులతోనే సమాజం అని రంగాల్లో అభివృద్ధి సాధ్యం అవుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ ఎలుగంటి మధుసుదనరెడ్డి అన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులు అభీర్ సింగ్, లలిత, సుజాత, మాధవరెడ్డి, క్రిష్ణయ్య, బడుగుల రమాదేవి, భ్రమరాంబదేవి, అనురాధ, బాలకృష్ణ, ఉమాదేవి, షరీఫ్, బషిర్ జాన్, సమిత, రామేశ్వరి, శ్రీలక్ష్మి, గోవర్ధన్‌లను మండల విద్య అధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి మాట్లాడుతూ షాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభవంతులుగా రాణిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమాజంలో మార్పు రావడానికి విద్యార్థులకు పూర్తి అవగాహన కలిగించే విధంగా విద్యను నేర్పించాలని కోరారు. కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్, షాబాద్ సర్పంచ్ అశోక్, పాఠశాల సంఘాల నాయకులు, ఉపాధ్యాయలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు



**ప్రజాపక్షం/యాచారం:** మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈసంధర్బంగా ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ చెరువు కట్ట లీకేజీని అరికట్టి కట్ట వెడల్పు చేయాలన్నారు. చెరువులో ఏపుగా పెరిగిన కంప చెట్లను తక్షణమే తొలగించాలని కోరారు. తక్షణమే ఇరిగేషన్‌అధికారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఫోన్‌లో ముదిరాజు సంఘం నాయకులు ఇచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముచ్చర్ల సుగణ సంపత్, నాయకులు సత్యానారాయణ, కానమోని గణేశ్, నరేంధర్ గోదాసు నర్సింహ్మా, శ్రీరాములు పాల్గొన్నారు. ఫోటోరైటఫ్....02. ఎంఎల్‌ఎ ను కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు..

## రైతులకు ప్రభుత్వం 24 గంటల కరంటు సరఫరా చేయాలి

సాగర్ రహదారిపై ర్యాలీ... సబ్ స్టేషన్ ముందు ధర్నా




**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం రైతులకు 24 గంటల కరంటు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం రైతు సంఘం అధ్వర్యంలో యాచారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని 33 బై 11కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రైతు సంఘం యాచారం మండల అధ్యక్ష, కార్యదర్శులు మండల బాల్‌రాజ్, తావునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యహరిస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు సకాలంలో కురువక పోవడంతో రైతులు పెట్టుబడులు పెట్టి నానా ఇబ్బందులు పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు 24 గంటల కరెంటు ఇస్తామని హామీ ఇచ్చింది కాని, ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదన్నారు. వరి పంట ఎండిపోతుందన్నారు. పశువులకు గడ్డి దొరుకని పరిస్థితి నెలకొందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే అందోళనను చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎ. నర్సింహ్మా, పి.అంజయ్య, ఎ.జంగయ్య, చందునాయక్, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.బాలయ్య, మండల ఉపాధ్యక్షులు శ్రీశైలం, సహాయకార్యదర్శి అంజనేయులు, భాషయ్య, బుగ్గరాములు, గడ్డం యాదగిరి, జంగయ్య, మల్లేశ్, జంగయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల ఎంఆర్‌పిఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నామని ఎంఎస్‌పి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు రావుగల్ల బాబు, విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య తెలిపారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ అదేశాల మేరకు కమిటీని ఎన్నుకున్నామని తెలిపారు. అధ్యక్షుడిగా కంబాలపల్లి రవీందర్, అధికార ప్రతినిధిగా కంబాలపల్లి మహేశ్, ప్రధాన కార్యదర్శులుగా మస్కు మహేందర్, మస్కు మహేశ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా చిన్నోళ్ళ యాదయ్య, కంబాలపల్లి జంగయ్య, యంజాల వెంకటేశ్, కోంద్రు శేఖర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, పాండు, బోడ ముత్యాలు, జంగయ్య, మూలి మహేష్, శేఖర్, ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/షాబాద్:** కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్టు షాబాద్ ఎస్‌హెచ్‌ఒ లక్ష్మీ రెడ్డి తెలిపారు. షాబాద మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన జిట్టా చంద్రశేఖర్ (16) గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ఇంట్లో కుటుంబ సభ్యులు మందలించినందుకు మనస్తాపానికి గురైన చంద్రశేఖర్ గ్రామశివారులోని పంటపొలాల్లో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వఆసుపత్రికి తరలించిన్నట్లు ఎస్‌హెచ్‌ఒ పేర్కొన్నారు.

# ఆర్‌కె పురం ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలి

పెండింగ్ అంశాలు త్వరగా పరిష్కరించాలి

ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్.కె. పురం ఫ్లైఓవర్ (ఆర్ఓబి/ఆర్‌యుబి) ప్రాజెక్టు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పురోగతిపై మల్కాజిగిరి జోనల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన వివిధ శాఖల అధికారులతో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. ప్రాజెక్టు పరిధిలో చేపట్టాల్సిన పనులు, ఇప్పటివరకు నమోదైన పురోగతి, పెండింగ్‌లో ఉన్న అంశాలు, ప్రభావిత ఆస్తుల యజమానులకు సంబంధించిన ప్రక్రియలపై అధికారులు కమిషనర్‌కు వివరించారు. ప్రాజెక్టు అమలులో భాగంగా ప్రభావితమయ్యే ఆస్తుల యజమానుల నుంచి టిడిఆర్ దరఖాస్తులు, సమ్మతి పత్రాలు(కన్సెంట్), ఇతర సంబంధిత ప్రక్రియలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. ఆస్తుల యజమానులతో సమన్వయం కొనసాగిస్తూ పెండింగ్‌లో ఉన్న అంశాలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలన్నారు. అలాగే టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, లీగల్ తదితర విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసి, ఒక శాఖలోని పెండింగ్ కారణంగా ప్రాజెక్టు పనులు ఆలస్యం కాకుండా పరస్పర సహకారంతో సమస్యలను సకాలంలో పరిష్కరించాలన్నారు. పెండింగ్ కేసులను అంశాల వారీగా పరిశీలించి, ప్రతి అంశంపై తదుపరి చర్యలను నిర్ణయించి అమలు చేయాలని కమిషనర్ సూచించారు. ఆర్.కె. పురం ఫ్లైఓవర్(ఆర్ఓబి/ఆర్‌యుబి) ప్రాజెక్టు పూర్తయితే ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రయాణ సమయం ఆదాకావడం, రహదారి భద్రత మెరుగుపడడం, పట్టణ రవాణా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారే అవకాశముందన్నారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ నిర్ణీత ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి, పెండింగ్ అంశాలను పరిష్కరించడం ద్వారా పనుల్లో గణనీయమైన పురోగతి సాధించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఆర్.కె. పురం ఆర్ఓబి, ఆర్‌యుబి ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలను నిరంతరం కొనసాగించాలన్నారు. సమావేశంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, చీఫ్ సిటీ ప్లానర్ బి.ప్రదీప్ కుమార్, అదనపు చీఫ్ సిటీప్లానర్ రజిత్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరిత రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



## ఇంధన పొదుపులో దక్షిణ మధ్య రైల్వేకు జాతీయ కీర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంధన వినియోగాన్ని తగ్గిస్తూ పర్యావరణ హిత రైల్వే కార్యకలాపాలకు పెద్దపీట వేస్తున్న దక్షిణ మధ్య రైల్వేకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 27వ సిఐఐ నేషనల్ ఎక్సలెన్స్ ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్–2026 పురస్కారాల్లో ఎస్‌సిఆర్‌కు ఏకంగా ఆరు అవార్డులు దక్కాయి. ఇందులో కాచిగూడ రైల్వే స్టేషన్‌కు ప్రతిష్ఠాత్మక 'ఎక్సలెంట్ ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్' పురస్కారం లభించగా, మరో ఐదు ఎస్‌సిఆర్ యూనిట్లు 'ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్స్'గా ఎంపికయ్యాయి. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసిలో శుక్రవారం జరిగిన సిఐఐ ఎనర్జీ ఎఫిషియెన్సీ సమ్మిట్‌లో అవార్డులను ప్రదానం చేశారు. కాచిగూడ రైల్వే స్టేషన్‌తోపాటు లేఖా భవన్, సెంట్రల్ హాస్పిటల్, జోనల్ రైల్వే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జెడ్ఆర్‌టిఐ)మౌలాలి, రైల్ బోగీ కార్ఖానా, యాద్గిర్, సిగ్నల్ అండ్ టెలికాం వర్క్‌షాప్ మెట్టుగూడలకు ఎనర్జీ ఎఫిషియెంట్ యూనిట్లుగా గుర్తింపు లభించింది. విద్యుత్ వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, ఇంధన పొదుపు చర్యలు చేపట్టడం, గ్రీన్ ఇనిషియేటివ్‌లను అమలు చేయడం, సుస్థిర పద్ధతులను అవలంబించడం వంటి చర్యలతో ఎస్‌సీఆర్ ఈ గుర్తింపు సాధించింది. వివిధ డివిజన్లు, వర్క్‌షాప్‌లు, ఫీల్ యూనిట్లు సమన్వయంతో చేపట్టిన చర్యలు ఇంధన వినియోగాన్ని తగ్గించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతున్నాయని రైల్వే అధికారులు తెలిపారు. అవార్డులను హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ రామారావుతోపాటు ఇతర సీనియర్ రైల్వే అధికారులు అందుకున్నారు. జాతీయ స్థాయిలో ఎస్‌సిఆర్‌కు గుర్తింపు రావడంపై జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సంతోషం వ్యక్తం చేశారు. అవార్డులు సాధించడంలో కృషి చేసిన ప్రిన్సిపల్ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఇతర అధికారులను అభినందించారు. ఇంధన సంరక్షణ, సమర్థవంతమైన ఇంధన నిర్వహణకు దక్షిణ మధ్య రైల్వే నిరంతరం కట్టుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## 17 కేసులు ఛేదించిన హైదరాబాద్ పోలీసులు

9మంది అరెస్టు, రూ.22లక్షల నగదు, 15 ఫోన్లు, మూడు కార్లు స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పశువులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి అపహరణ.. ఆ తర్వాత మొబైల్ షాపుల షట్టర్లు ఎత్తి చోరీలు.. దోచిన ఫోన్లను ముంబైకి తరలించి, అక్కడి నుంచి బంగ్లాదేశ్‌కు అక్రమంగా చేరవేత.. పశువుల దొంగతనాలు, మొబైల్ షాపుల చోరీలతో పాటు చోరీ సెల్‌ఫోన్ల అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ డిస్పోజల్ నెట్‌వర్క్‌ను హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఛేదించారు. మొత్తం 17 కేసులను ఛేదించిన పోలీసులు.. నిందితుల నుంచి రూ.22 లక్షల నగదు, 15 మొబైల్ ఫోన్లు, మూడు కార్లు, నంబర్ ప్లేట్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్ లో తబ్రేజ్, రఫీక్, జుబైర్, నవీద్, ఫరహాన్ షేక్, ముబీన్ షేక్, మెహబూబ్ షేక్ అలియాస్ పాపా, మహ్మద్ జాహెద్ ఖాన్ అలియాస్ రాజా భాయ్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ శనివారం మీడియాకు వెల్లడించారు. రంజాన్, బక్రీద్ సమయంలో పశువులకు డిమాండ్ పెరగడాన్ని గ్యాంగ్ అవకాశంగా మార్చుకుంది. రాత్రివేళల్లో ఒంటరి ప్రాంతాల్లోని పశువుల కొట్టాలను గుర్తించి, జైలజైన్ మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి పశువులను వాహనాల్లో తరలించేవారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలతో పాటు ఫ్యూచర్ సిటీ ప్రాంతాల్లో 13 పశువుల చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. పశువుల డిమాండ్ తగ్గిన తర్వాత గ్యాంగ్ మొబైల్ షాపులను టార్గెట్ చేసింది. జూన్ 11న ఖమ్మంలోని సోనోవిజన్ మొబైల్ షాపులో షట్టర్ ఎత్తి ఫోన్లు దోచుకున్నట్లు తెలిపారు. అనంతరం జూలై 10న మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని ఫ్రీగంజ్ ప్రాంతంలో రెండుమొబైల్ షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. గుజరాత్‌లో మరో చోరీకి ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసుల పెట్రోలింగ్‌ను చూసి పారిపోతూ ప్రమాదానికి గురైనట్లు పేర్కొన్నారు. దొంగిలించిన మొబైళ్లను ముంబైకి తరలించి, మధ్యవర్తుల ద్వారా జాహెద్ ఖాన్ అలియాస్ రాజా భాయ్‌కు చేరవేసేవారని తెలిపారు. అతడు నెలకు సుమారు 400–500 సెల్‌ఫోన్ల వరకు లావాదేవీలు నిర్వహిస్తూ, ముంబైలోని చోర్ బజార్, మదన్‌పురా నెట్‌వర్క్ ద్వారా ఫోన్లను ఇతర ప్రాంతాలకు తరలించేవాడని వెల్లడించారు. కోల్‌కతా మీదుగా అక్రమ మార్గాల్లో బంగ్లాదేశ్‌కు ఫోన్లను తరలించినట్లు తేలిందన్నారు ఈ వ్యవహారంలో హవాలా లావాదేవీలపైనా విచారణ కొనసాగుతోందని సిపి తెలిపారు. వరుస చోరీల అనంతరం నిందితులు హైదరాబాద్‌లో మరిన్ని నేరాలకు పాల్పడేందుకు కొత్త వోక్స్‌వ్యాగన్ వెంటో కారును సమకూర్చుకున్నట్లు సిపి తెలిపారు. ఆగస్టు 17న హైదరాబాద్‌లో మరోనేరానికి పథకం వేస్తున్న సమయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారన్నారు. హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్ డిసిపి గైక్వాడ వైభవ్ రఘునాథ్, జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ యాదేందర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐలు డి.రవిరాజ్, జి.సందీప్‌రెడ్డి, సిబ్బంది ఆపరేషన్‌లోపాల్గొన్నారు.

## 'హమారా ప్రసాద్'పై సిసిఎస్‌లో కేసు

అంబేడ్కర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యల ఆరోపణలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్‌ను ఉద్దేశించి సోషల్ మీడియాలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదుతో 'హమారా ప్రసాద్' అలియాస్ నాగులారపు వరప్రసాద్‌పై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్)లో కేసు నమోదైంది. ఫేస్‌బుక్‌లో ప్రసారమైన వీడియోలో అంబేడ్కర్‌ను కాల్చేస్తానంటూ, చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుంటానంటూ వ్యాఖ్యలు చేసినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు, ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫిర్యాదు ప్రకారం.. 'బాబాసాహెబ్ ఒక కల్పిత నాయకుడు' పేరుతో వరప్రసాద్ పుస్తకం ప్రచురించారని, దానిలోనూ అభ్యంతరకర అంశాలు ఉన్నట్లు సోషల్ మీడియా ప్రచారం ద్వారా తెలిసిందని ఫిర్యాదుదారు తెలిపారు. పుస్తకాన్ని ఈ నెల 18న సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించనున్నట్లు ప్రచారం జరిగిందని పేర్కొన్నారు.

## ఇంజినీరింగ్ కళాశాలల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సోదాలు




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మండల పరిధిలోని గురునానక్, శ్రీహిందు, సివిఆర్ ఇంజినీరింగ్ విద్యా సంస్థల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కళాశాలల్లో విద్యార్థుల వాస్తవసంఖ్య, రికార్డులు, అడ్మిషన్స్ వివరాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలతో పాటు ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేసి అనుమతి లేకుండా భవన నిర్మణాలు, విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూళ్ళు సంబందించిన అంశాలను అధికారుల బృందం క్షుణంగా పరిశీలించారు. అయితే మూడు కళాశాలలు మైనార్టీ, అటానమ‌‌ష్‌లో టాప్–10లో ఉండటంతో యాజమాన్యలు ఇష్టానుసారంగా ఫీజులు వసూళ్లు చేసి విద్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారనే ఆరోపణలు రావటమే కాక కేంద్రంలో రాజకీయ నాయకుల పలుకుబడిని ఆసరాగ చేసుకోని యాజమాన్యాలు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ సోదాలకు సంబంధించిన వివరాలను త్వరలో అధికారికంగా వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ భూములు కబ్జా చేసిన కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి : సిపిఐ



అక్రమంగా ప్రభుత్వ భూములు కబ్జా చేసిన ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ మండల పరిధిలో గురునానక్, శ్రీ హిందు, సివిఆర్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ, అసైన్డ్‌మెంట్ భూములు కబ్జా చేసి, భవన నిర్మాణాలు చేయటం సిగ్గు చేటని విమర్శించారు. కళాశాలలో అన్యాక్రాంతమైన భూములపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపి స్వాధీనం చేసుకోని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే కబ్జా చేసిన భూముల్లో ఎర్ర జెండాలను పాతుతామని హెచ్చరించారు.

## నిరుపేద విద్యార్థినికి 'చేయూత'

ఎంబిబిఎస్ చదువుకు రూ.1.29 లక్షల సాయం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పేదరికం వైద్య విద్యకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో టిపిసిసి ఎస్‌సి డిపార్ట్‌మెంట్ నిరుపేద విద్యార్థినికి ఆర్థిక చేయూత అందించింది. వరంగల్ జిల్లా చెన్నారెడ్డిపల్లి లేబర్ కాలనీకి చెందిన వద్దేపల్లి రహేల్ ఎంబిబిఎస్ విద్యను అభ్యసిస్తున్న నేపథ్యంలో ఆమె చదువుకు రూ.1,29,500 విలువైన చెక్కును మానకొండూర్ ఎమ్మెల్యే, టిపిసిసి ఎస్‌సి సెల్ చైర్మన్ డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రహేల్ కుటుంబసభ్యుల విజ్ఞప్తికి స్పందించిన ఆయన ఈ సాయం అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పేదరికం కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదన్నారు. రహేల్ తనఎంబిబిఎస్ చదువును ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా పూర్తి చేసి మంచి వైద్యురాలిగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆమె చదువుకు తన సహాయం కొనసాగుతుందని తెలిపారు. పూర్తి విద్యకు అవసరమైన బాధ్యతను కూడా తానే స్వీకరిస్తున్నట్లు హామీ ఇచ్చారు. ఆర్థిక సాయంతో పాటు పుస్తకాల బాధ్యతను స్వీకరించిన సత్యనారాయణకు రహేల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు అమలు చేయాలి

రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు అధికంగా ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఉపాధ్యాయులను కేటాయించడం జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద కేటాయించిన ఉపాధ్యాయులను సంబంధిత పాఠశాలల నుంచి విధుల నుంచి రిలీవ్ చేసి, కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అయితే, ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయకుండా కేటాయించిన ఉపాధ్యాయులను విధుల నుంచి రిలీవ్ చేయని 83 మంది ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డిఇఒ వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలను ఎలాంటి సముచిత కారణం లేకుండా ఉల్లంఘించినట్లు తేలితే, సంబంధిత అధికారులపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి స్పష్టం చేశారు. పాఠశాలల్లో విద్యాబోధనకు ఎలాంటి అంతరాయం కలగకుండా, ఉపాధ్యాయుల అందుబాటును సమతుల్యం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా వర్క్ అడ్జస్ట్‌మెంట్ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

## ప్రైవేట్‌కు దీటుగా 'పట్నం' ఆసుపత్రి అభివృద్ధి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** సర్కార్ దవాఖానను నిర్మించి ప్రైవేట్‌కు దీటుగా మాడల్ ఆసుపత్రిగా అభవృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఆధునిక పద్ధతిలో నిర్మిస్తున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గం కేంద్రంలో ప్రజలకిచ్చిన హామీ మేరకు వంద పడకల ఆసుపత్రిని నిర్మించి ప్రయివేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందిచటమే లక్ష్యమన్నారు. ఆసుపత్రి నిర్మాణ పనుల్లో వేగం పెంచి మూడు నెలల్లో నాణ్యత లోపాలు లేకుండా నూతన భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టుదారులను ఆదేశించారు. ఇబ్రహీంపట్నం పెద్ద చెర్వు పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేసి, పర్యాటకులకు కోసం బోటు సౌకర్యం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజక వర్గంలోని రోడ్లన్నింటిని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారం చేయటం సిగ్గుచేటని విమర్శించారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించి నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేసి చౌరస్తాను అభివృద్ధి చేస్తామన్నారు. నియోజకవర్గంలో బిఆర్ఎస్ నాయకులు అక్రమంగా కబ్జా చేసిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోని నిరుపేదలకు పంపిణీ చేస్తామన్నారు. శ్రీరాంరెడ్డి కాలనీలో జరిగిన వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కె.గురునాథ్ రెడ్డి, ఆసుపత్రి ఇన్‌చార్జీ శ్రీలత, వినయ్, లక్ష్మి ప్రసన్న, మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, కౌన్సిలర్ రాందాస్, మంఖాల దాసు, ఎండి గౌస్, కోడూరు రమేష్ అధికారులు పాల్గొన్నారు.

# ఎఫ్‌టిఎలతో భారత యువతకు కొత్త ఉపాధి అవకాశాలు

- 'రోజ్‌గార్ మేళా'లో ప్రధాని నరేంద్ర మోదీ
- 51,000కు పైగా అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



**న్యూఢిల్లీ :** వివిధ దేశాలతో భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) కుదుర్చుకోవడం వల్ల యువతకు ఉపాధి అవకాశాల విషయంలో కొత్త ద్వారాలు తెరిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పుకొచ్చారు. శనివారం ఆయన 'రోజ్‌గార్ మేళా' (ఉపాధి కల్పన కార్యక్రమం)లో వర్చువల్ విధానంలో ప్రసంగించారు. భారతీయ యువత ప్రతిభ, నైపుణ్యాలు ప్రపంచవ్యాప్తంగా విశ్వాసాన్ని పొందాయని, భారతీయ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, దేశ యువశక్తిపై ప్రపంచానికి గొప్ప అంచనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. 'భారత్ 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ ఒప్పందాలు మన యువతకు కొత్త అవకాశాల ద్వారాలను తెరుస్తున్నాయి. ఇటువంటి వాణిజ్య ఒప్పందాలు మన పారిశ్రామికవేత్తలకు కొత్త భాగస్వామ్యాలకు మార్గం సుగమం చేస్తాయి, కొత్త మార్కెట్లకు దారులు తెరుస్తాయి. యువతకు కెరీర్ పరంగా కొత్త అవకాశాలను సృష్టిస్తాయి' అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో, వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలలో చేరనున్న నూతనంగా ఎంపికైన యువతకు ప్రధాన మంత్రి వర్చువల్ విధానంలో 51,000కు పైగా నియామక పత్రాలను అందజేశారు. ఇటీవల ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం గురించి ప్రస్తావిస్తూ, బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకుండా చూసేందుకు భారత్ కృషి చేస్తోందని మోదీ చెప్పారు. 'మన పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత ఇలా ప్రతి ఒక్కరూ ఈ భాగస్వామ్యంలో క్రియాశీల భాగస్వాములు కావాలి' అని ఆయన అన్నారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ గురించి ప్రస్తావిస్తూ, ఇందులో భారతీయ యువశక్తి ప్రతిబింబిస్తోందని, స్టార్టప్ వ్యవస్థ ఇకపై కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా ఇతర నగరాలకు కూడా విస్తరించిందని ప్రధాన మంత్రి అన్నారు. 'నేడు భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థను కలిగి ఉంది. భారత స్టార్టప్ ప్రస్థానం ఇకపై కేవలం పెద్ద నగరాల కథ మాత్రమే కాదు. నేడు, గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్–2, టైర్–3 నగరాల్లోనే ఉన్నాయి' అని ఆయన చెప్పారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే అత్యంత కీలకమైన లక్ష్యం దిశగా దేశం ముందుకు సాగుతోందని ప్రధాని మోదీ అన్నారు. 'ఇందులో మీలాంటి యువత కీలక పాత్ర పోషించాల్సి ఉంది. ప్రభుత్వంలో పనిచేస్తున్నప్పుడు, అభివృద్ధి చెందిన, స్వయం సమృద్ధి గల భారత్ కోసం సాగుతున్న ఉద్యమాన్ని నిరంతరం బలోపేతం చేసే నిర్ణయాలనే మీరు తీసుకోవాలి. యువకులుగా మీకు ఒక ప్రత్యేక బాధ్యత ఉంది, ముఖ్యంగా తోటి యువత పట్ల' అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో మొత్తం 45 'రోజ్‌గార్ మేళాలు' (ఉపాధి కల్పన కార్యక్రమాలు) నిర్వహించబడ్డాయి. ప్రధాన మంత్రి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, కొత్తగా ఎంపికైన అభ్యర్థులు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో (రెవెన్యూ శాఖ, రైల్వే మంత్రిత్వ శాఖ, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం మరియు రక్షణ మంత్రిత్వ శాఖతో సహా) విధుల్లో చేరనున్నారు. యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడంపై, దేశ అభివృద్ధి ప్రయాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంచడంపై ప్రభుత్వం నిరంతరం చూపుతున్న శ్రద్ధకు ఈ ' రోజ్‌గార్ మేళా' (ఉపాధి మేళా) నిదర్శనమని అధికారిక ప్రకటన పేర్కొంది. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి, ఇప్పటివరకు వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలలో 12.75 లక్షల మంది యువత నియామక పత్రాలను అందుకున్నారని ఆ ప్రకటన తెలిపింది.

# విద్యార్థులు ప్రశ్నించడం వ్యవస్థకు ఇష్టం లేదు

ఇండోర్‌లో 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో రాహుల్‌గాంధీ



**ఇండోర్ :** దేశం మొత్తాన్ని ఒక వ్యవస్థ తన గుప్పిట్లోకి తీసుకుందని, విద్యార్థులు ప్రశ్నలు అడగడం ఆ వ్యవస్థకు ఇష్టం లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యార్థుల గళం) అనే యువజన సంప్రదింపుల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశం నుండి ద్వేషాన్ని తొలగించే శక్తి కేవలం విద్యార్థులకే ఉందని, ప్రధాని నరేంద్ర మోదీ మద్దతుదారులనుద్దేశించి విమర్శకులు వాడే 'అంధభక్తులు' (గుడ్డి అనుచరులు) దీన్ని చేయలేరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యప్రదేశ్ నలుమూలల నుండి వచ్చిన విద్యార్థులు తమ సమస్యలను ప్రస్తావించారు. ముఖ్యంగా ఒబిసి కోటా పెంపుపై ఉన్న న్యాయపరమైన వివాదాల కారణంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో 13 శాతం నిలిపివేత వంటి అంశాలను వారు లేవనెత్తారు. విద్యార్థులే భారతదేశ భవిష్యత్తు అని, వారు లేకుండా ఏ దేశమూ బలపడదని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. అదానీ, అంబానీ, జై షా, ఇతరులతో కూడిన 'వ్యవస్థ' గురించి విద్యార్థులు ప్రశ్నలు అడుగుతుంటే, 'అంధభక్తులు' వారిని వ్యతిరేకిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు జిజ్ఞాస, ప్రేమ, వినయం, సహనం, నిజాయితీలకు ప్రతీకలుగా ఉంటారని, అదే అంధభక్తులలో ఈ గుణాలు ఏవీ ఉండవని, పైగా వారు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తారని ఆయన అన్నారు. దేశంలో పది లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 55 శాతంతో సహా మొత్తం లక్ష పాఠశాలలు మూతపడ్డాయి అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 2014లో యుపిఎ ప్రభుత్వం బడ్జెట్‌లో 4.6 శాతాన్ని విద్యకు కేటాయించగా, ఇప్పుడు ఆ కేటాయింపు 2.6 శాతానికి (రూ. 7.7 లక్షల కోట్లు) పడిపోయిందని ఆయన చెప్పారు. 'విద్యార్థులే దేశానికి పునాది. విద్యార్థులే దేశాన్ని నిర్మిస్తారు. నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా, విద్య అనేది విలాసం కాదు. విద్య అనేది ఒక ఉపకారం కాదు. విద్య అనేది భారతదేశంలోని ప్రతి విద్యార్థి హక్కు' అని అన్నారు. ప్రభుత్వం సమర్థవంతమైన విద్యా వ్యవస్థను నడపాలి. కానీ దేశంలో దీనికి విరుద్ధంగా జరుగుతోందని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. స్కాలర్‌షిప్‌ల గురించి ప్రస్తావిస్తూ, గత 10 ఏళ్లలో 1.5 కోట్ల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లకు దూరమయ్యారని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. 'భారతదేశం (కేంద్ర ప్రభుత్వం), ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు 1.5 కోట్ల కంటే తక్కువ స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నాయి. ఇక ఉపాధ్యాయుల విషయానికి వస్తే, సుమారు 10 లక్షల ఉద్యోగాలు (ఖాళీలు) ఉన్నాయి' అని ఆయన అన్నారు. కఠినమైన భద్రతా ఏర్పాట్ల మధ్య, పూర్తిగా కప్పి, బారికేడ్లతో ఏర్పాటు చేసిన ఈ సభా ప్రాంగణానికి విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ పలువురు విద్యార్థులను వేదికపైకి ఆహ్వానించి, వ్యవస్థాగత పరిపాలనా వైఫల్యాలను, సురక్షితమైన విద్యార్థి వసతి మౌలిక సదుపాయాల తీవ్ర కొరతను ఎత్తి చూపుతూ, ఢిల్లీలో ఇటీవల సత్యనికేతన్ భవనం కూలిపోయిన ఘటనకు సంబంధించిన ఫుటేజ్‌తో సహా పలు దృశ్య క్లిప్‌లను ప్రదర్శించారు.

# 'ప్రజాస్వామ్యం హత్య'

బెంగాల్‌లో ఇసి, బిజెపి కుమ్మక్కైంది : కపిల్ సిబల్



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘంపై రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కయిందని (జుగల్‌బందీ) ఆరోపించారు. పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను ఆయన 'ప్రజాస్వామ్యం హత్య'గా, జవాబుదారీతనం లేని సంపూర్ణ నియంతృత్వ ధోరణిగా అభివర్ణించారు. నందిగ్రామ్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్ అరెస్టు 'పగటిపూట జరిగిన ప్రజాస్వామ్య హత్య' అని సిబల్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు వ్యవస్థాగత జవాబుదారీతనం లోపించిందనడానికి నిదర్శనమని ఆయన అన్నారు. 'ఎన్నికల సంఘం, ప్రభుత్వం మధ్య ఉన్న ఈ కుమ్మక్కు, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడులు, నియంతృత్వ నిర్ణయాలు, స్పీకర్ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు... ఇవన్నీ ఇంకెంతకాలం కొనసాగుతాయి?' అని సిబల్ శనివారం విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు. దేశమంతా ఈ పరిణామాలను గమనిస్తోందని, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన తీరు చూస్తుంటే ప్రజాస్వామ్యం, అలాగే మన వ్యవస్థలు కూడా డొల్లగా మారిపోయాయనిపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్‌తో పాటు ఇతర నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు నిర్వహిస్తామని ఎన్నికల సంఘం సెప్టెంబర్ 7న ప్రకటించిందని సిబల్ గుర్తుచేశారు. 13న టిఎంసికి చెందిన సంచితా ప్రధాన్ దే నందిగ్రామ్ నుండి, రబియుల్ ఆలం చౌదరి రెజినగర్ నుండి నామినేషన్లు దాఖలు చేశారని ఆయన తెలిపారు. నందిగ్రామ్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా మిలన్ ప్రధాన్, బిజెపి అభ్యర్థిగా హసిరాణి రాత్ పోటీలో ఉన్నారని సిబల్ పేర్కొన్నారు. 'సెప్టెంబర్ 17 సాయంత్రం, ఎన్నికల సంఘం టీఎంసీ గుర్తును స్తంభింపజేసింది. ఇది చాలా అసాధారణమైన విషయం ఎన్నికల ప్రకటన అప్పటికే వెలువడింది, అదే సమయంలో పార్టీ గుర్తును కూడా స్తంభింపజేశారు' అని ఆయన అన్నారు. ఆ తర్వాత సంచితా ప్రధాన్ ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారని సిబల్ చెప్పారు. ఆమె నామినేషన్ ఉపసంహరణ అనంతరం, సెప్టెంబర్ 18న సాయంత్రం 4:30 గంటల ప్రాంతంలో మమతా బెనర్జీ వర్గం కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మద్దతు ప్రకటించిందని ఆయన తెలిపారు. అదే రోజు సాయంత్రం 5:30 నుండి 6:30 గంటల మధ్య, 2007 నాటి ఒక ఘటనకు సంబంధించి 2021, 2023లో జారీ అయిన వారెంట్ల ఆధారంగా ప్రధాన్‌ను అరెస్టు చేశారని సిబల్ పేర్కొన్నారు. ఈ అరెస్టును 'ప్రజాస్వామ్య హత్య'గా అభివర్ణించిన సిబల్, ఇది వ్యవస్థాగత జవాబుదారీతనం లేకపోవడాన్ని ఎత్తిచూపుతోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల సంఘం, రాష్ట్ర అధికారుల తీరును ఆయన విమర్శిస్తూ, ఈ పరిణామాలను ఒక 'వికారమైన కుట్ర'గా, 'జవాబుదారీతనం లేని సంపూర్ణ నిరంకుశత్వం'గా అభివర్ణించారు.

# విద్యార్థి ప్రాణం తీసిన చాట్ జిపిటి

**ముంబై:** కృత్రిమ మేధ (ఎఐ) ప్రజల, ప్రత్యేకించి విద్యార్థుల దైనందిన జీవితంలో వేగంగా భాగమవుతోంది. సమాచారాన్ని వెతకడం, అనువాదం చేయడం, పాఠాలు అర్థం చేసుకోవడం, రాయడం, కోడింగ్, వైద్య సమాచారంపై ప్రాథమిక అవగాహన పొందడం వంటి అనేక పనుల్లో ఎఐ మనిషికి సహాయక సాధనంగా మారింది. ఈ సాంకేతికతను ఉపయోగించడంలో సహజంగానే ఎలాంటి ప్రమాదం లేదు. అయితే ఒక సాధనాన్ని ఉపయోగించడం, ఆ సాధనంపైనే ఎక్కువగా ఆధారపడటం మధ్య చాలా తేడా ఉంది. ముంబయి ఐఐటిలో చోటు చేసుకున్న తాజా ఘటన ఈ తేడాను మరోసారి గుర్తుచేస్తోంది. వివరాల్లోకి వెళ్తే..పరీక్షలో చాట్ జిపిటి ఉపయోగిస్తూ పట్టుబడ్డ ఐఐటి బాంబే విద్యార్థి హాస్టల్‌లోని తన గదిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహారాష్ట్ర యవత్మాల్ జిల్లాకు చెందిన సాహిల్ రవీంద్ర వాకోడె (22) శుక్రవారం సాయంత్రం తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడని పోలీసులు తెలిపారు. సాహిల్ ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం రెండో సంవత్సరం చదువుతున్నాడని వారు పేర్కొన్నారు. ఐఐటి బాంబే అధికారుల వివరాల ప్రకారం పరీక్ష సమయంలో సమాధానాలు తెలుసుకోవడానికి ప్రశ్న పత్రాన్ని చాట్ జిపిటిలో అప్‌లోడ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థి గదిలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆస్పత్రికి తరలించామని పోలీసులు వెల్లడించారు. సాహిల్ ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ జరిపించాలని విద్యార్థులు ఆందోళన చేశారు. కాగా..సదరు సంస్థ ప్రకారం, పరీక్షలో జరిగిన ఘటనపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ప్రారంభించలేదు. అధ్యాపకులు, విభాగాధిపతి విద్యార్థితో మాట్లాడి, అతని విద్యా భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం ఉండదని భరోసా ఇచ్చినట్లు సంస్థ పేర్కొంది. ఈ మరణానికి ఖచ్చితమైన కారణాలను దర్యాప్తు పూర్తయ్యే వరకు నిర్ధారించలేం. అందువల్ల ఎఐ వినియోగాన్ని ఈ విషాదానికి నేరుగా కారణంగా పేర్కొనడం కూడా సరికాదు. అయితే ఈ ఘటనను విస్తృతమైన ప్రశ్నను పరిశీలించడానికి ఒక ఉదాహరణగా చూడవచ్చు. ఎఐ మనకు సమాధానం ఇవ్వగలదు. కానీ ప్రతి సమాధానాన్ని మనమే ఆలోచించి అర్థం చేసుకునే అలవాటును అది భర్తీ చేయకూడదు. విద్యార్థి ఒక సమస్యను ఎదుర్కొన్నప్పుడు ముందుగా ఆలోచించడం, తప్పులు చేయడం, మళ్లీ ప్రయత్నించడం, ఉపాధ్యాయుడిని లేదా సహచరుడిని సంప్రదించడం వంటి ప్రక్రియలు నేర్చుకునే భాగాలు. ప్రతి దశలో ఎఐ సమాధానాన్ని సిద్ధంగా అందిస్తే, ఆలోచనా ప్రక్రియ క్రమంగా బలహీనపడే ప్రమాదం ఉంది. ఇదే విషయం విద్యా వ్యవస్థను దాటి సమాజానికీ వర్తిస్తుంది.

# డియుఎస్‌యు ఎన్నికల్లో ఎబివిపి విజయం



**న్యూఢిల్లీ :** ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం (డియుఎస్‌యు) ఎన్నికలలో, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ అయిన ఎబివిపి నాలుగు కేంద్ర ప్యానెల్ పదవులలో మూడింటిని గెలుచుకుంది. అదే సమయంలో, ఎన్‌ఎస్‌యుఐ టికెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దీపాన్షు షోకీన్ ఉపాధ్యక్ష పదవిని కైవసం చేసుకున్నాడు. కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం (ఎన్‌ఎస్‌యుఐ) ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. అయితే ఆ యూనియన్ అభ్యర్థులు అధ్యక్ష, సంయుక్త కార్యదర్శి పదవులను చాలా తక్కువ తేడాతో కోల్పోయారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి 13,700కు పైగా భారీ ఓట్ల మెజారిటీతో ఉపాధ్యక్ష పదవిని గెలుచుకున్న ఎన్‌ఎస్‌యుఐ రెబల్ అభ్యర్థి దీపాన్షు షోకీన్ కారణంగా ఎన్‌ఎస్‌యుఐకు తీవ్ర ఎదురుదెబ్బ తాకింది. ఎబివిపి అధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులను గెలుచుకోవడంతో, ఎన్‌ఎస్‌యుఐ నాలుగు కేంద్ర ప్యానెల్ పదవులలో దేనినీ సాధించలేకపోయింది. జంతర్ మంతర్ వద్ద జన్ జీ నిరసనలు, ఐదుగురు ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థుల ప్రాణాలను బలిగొన్న సత్యనికేతన్ భవనం కూలిపోయే ఘటన వంటి పరిణామాల నేపథ్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో, ఎబివిపి అభ్యర్థి యశ్ దాబాస్ అధ్యక్ష పదవిని గెలుచుకుని ఘనవిజయం సాధించారు. అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో, దాబాస్ 24,576 ఓట్లు సాధించి, ఎన్‌ఎస్‌యుఐ అభ్యర్థి విజయ్ శంకర్ మీనాను 2,053 ఓట్ల తేడాతో ఓడించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన దీపాన్షు షోకీన్ 30,615 ఓట్లతో ఉపాధ్యక్ష పదవిని గెలుచుకున్నారు. సంయుక్త కార్యదర్శి పదవికి జరిగిన పోటీలో, సమాజ్‌వాదీ ఛాత్ర సభ అభ్యర్థికి వచ్చిన 15,778 ఓట్లతో పోలిస్తే ఎబివిపి అభ్యర్థి 16,615 ఓట్లు సాధించారు. కార్యదర్శి పదవికి జరిగిన పోటీలో, ఎబివిపి అభ్యర్థి 21,650 ఓట్లు సాధించగా, ఎన్‌ఎస్‌యుఐ అభ్యర్థి 14,869 ఓట్లు పొందారు. షోకీన్, విశేష్ యాదవ్‌లతో సహా స్వతంత్ర అభ్యర్థులు గట్టి పోటీని ఇచ్చారు. ఎబివిపి, ఎన్‌ఎస్‌యుఐ రెండింటికీ చెందిన గణనీయమైన సంఖ్యలో ఓట్లను చీల్చడం ద్వారా వారు ఫలితాలను ప్రభావితం చేయగలిగారు. ఎబివిపికి చెందిన లక్ష్య రాజ్ సింగ్ 16,615 ఓట్లు సాధించి సంయుక్త కార్యదర్శి పదవిని గెలుచుకోగా, ఎన్‌ఎస్‌యుఐ అభ్యర్థి గోపాల్ చౌదరి 15,206 ఓట్లతో మూడవ స్థానంలో నిలిచారు.

# మమత పార్టీలో హైడ్రామా


- పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన రెజీనగర్ అభ్యర్థి
- గంటల్లో నిర్ణయం ఉపసంహరణ : పోటీలో ఉన్నట్లు ప్రకటన



**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నికలవేళ నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మమతా బెనర్జీ పార్టీ తరపున రెజీనగర్ ఉప ఎన్నిక అభ్యర్థిగా ఉన్న రబియుల్ ఆలం చౌదరి శనివారం నాడు పోటీ నుండి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే, కొన్ని గంటల వ్యవధిలోనే ఆ ప్రకటనను వెనక్కి తీసుకుని, పార్టీ అధినేత్రి కోరిక మేరకు అక్టోబర్ 6న జరిగే ఎన్నికల పోరులో పాల్గొంటానని స్పష్టం చేశారు. నందిగ్రామ్ ఉప ఎన్నికలో మమతా పార్టీ అభ్యర్థిగా ఉన్న సంచితా ప్రధాన్ డే, సువేందు అధికారితో సమావేశమైన తర్వాత తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్న మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. మాజీ టిఎంసి ఎమ్మెల్యే అయిన చౌదరి, అంతకుముందు ముర్షిదాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ 'నిరంతరం వేధింపులకు గురవుతున్న క్షేత్రస్థాయి కార్యకర్తలను ఉత్సాహపరచడం నాకు కష్టంగా మారింది. అలాగే, ఇంత తక్కువ సమయంలో ఓటర్లకు కొత్త 'ఫుట్‌బాలర్' గుర్తు గురించి అవగాహన కల్పించడం కూడా చాలా కష్టమైన పని. ఈ పరిస్థితుల్లో, పోటీ చేయకూడదన్న నా నిర్ణయాన్ని శుక్రవారం రాత్రే మమతా దీదీకి తెలియజేశాను...' అని అన్నారు. అయితే, కొన్ని గంటల తర్వాత హడావిడిగా ఏర్పాటు చేసిన మరో విలేకరుల సమావేశంలో 'నేను ఉప ఎన్నికలో పోటీ చేస్తాను. పార్టీ అధినేత్రి (మమత) జోక్యం చేసుకున్న తర్వాత పోలీసులు నాకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు... నేను పార్టీ అధినేతతో మాట్లాడాను, వారు నన్ను ఎన్నికల బరి నుండి తప్పుకోవద్దని సూచించారు. నేను బెల్దంగా పోలీస్ స్టేషన్ అధికారులను కలిశాను, ప్రచార సమయంలో నాకు, నా కార్యకర్తలకు భద్రత కల్పిస్తామని వారు కూడా హామీ ఇచ్చారు. నా మునుపటి నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నాను. మా కార్యకర్తలు ఎవరూ వేధింపులకు గురికాకుండా చూసుకుంటాను. నా దగ్గర కేవలం 10 మంది కార్యకర్తలు ఉన్నా సరే, నేను గెలుస్తాను' అని ఆయన స్పష్టం చేశారు.

# అవినీతి కేసులో ప్రభుత్వ ఉద్యోగిని నిర్దోషిగా విడుదల చేసిన సుప్రీంకోర్టు

సిబిఐ విచారణలో లోపాలు, అసహనాన్ని ఎత్తిచూపిన ధర్మాసనం



**న్యూఢిల్లీ :** రెండు దశాబ్దాలకు పైగా పాతదైన ఒక అవినీతి కేసులో, లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై ఉచ్చు పన్నిన నేపథ్యంలో, అత్యున్నత న్యాయస్థానం ఒక ప్రభుత్వ ఉద్యోగిని నిర్దోషిగా విడుదల చేసింది. అదే సమయంలో, ఈ కేసు దర్యాప్తులో సిబిఐ నుంచి ఉన్న 'తీవ్రమైన లోపాలు, అసహనాన్ని' కూడా సుప్రీంకోర్టు ఎత్తిచూపింది. ప్రత్యేక విచారణ కోర్టు విధించిన అతని నేర నిర్ధారణ, శిక్షను ధృవీకరించిన కేరళ హైకోర్టు వెలువరించిన మే 2024 ఉత్తర్వులను సవాల్ చేస్తూ అతను దాఖలు చేసిన అప్పీళ్లపై తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు, 'ఆ ఉచ్చును పూర్తిగా అమలుకానివ్వలేదు' అని స్వాధీనం చేసుకున్న లంచం డబ్బు అతని కోసమేనని సిబిఐ నిరూపించలేకపోయిందని పేర్కొంది. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్‌గా పనిచేస్తున్నప్పుడు బదిలీలు, పోస్టింగ్‌లు, ఇతర సర్వీస్ సంబంధిత ప్రయోజనాలను కోరుతున్న ఆర్‌పిఎఫ్ సిబ్బంది నుండి, మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న కింది స్థాయి అధికారుల ద్వారా అక్రమ లంచాలు డిమాండ్ చేయడం, పొందడం ద్వారా అప్పీల్‌దారుడు తన అధికారిక పరిధిని దుర్వినియోగం చేశాడనే ఆరోపణను ఎదుర్కొన్నాడు. ఈ దర్యాప్తు అక్రమ లంచాల ఆరోపణలకు సంబంధించిన వేర్వేరు లావాదేవీల ఆధారంగా పలు తుది నివేదికలను దాఖలు చేయడం, అనేక అభియోగాలను ప్రారంభించడంతో ముగిసింది. ఈ కేసులో ఉచ్చు పన్నిన తీరులో సందేహాస్పద అంశాలు ఉన్నాయని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎన్. కోటేశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అప్పీల్‌దారుడు లంచం డిమాండ్ చేశాడనే ఆరోపణల గురించి ఫిర్యాదుదారుడు 2005 ఆగస్టు 3న సిబిఐకి తెలియజేయగా, దర్యాప్తు సంస్థ మరుసటి రోజే ఉచ్చు పన్నాలని నిర్ణయించుకుందని ధర్మాసనం పేర్కొంది. 2005, ఆగస్టు 4న ఎఫ్‌ఐఆర్ నమోదైందని అదే రోజు ఉచ్చు పన్నారని అందులో పేర్కొన్నారు.'అధికారికంగా ఎఫ్‌ఐఆర్ నమోదు కాకముందే, లంచం ఫిర్యాదును ధృవీకరించడం ద్వారా సిబిఐ ఒక విచారణార్హమైన నేరం(కాగ్నిజిబుల్ ఆఫెన్స్)పై దర్యాప్తు ప్రారంభించడం ఆశ్చర్యం కలిగిస్తోందని ధర్మాసనం తెలిపింది. అంతేకాకుండా, ఉచ్చు పన్నడానికి చాలా తక్కువ వ్యవధిలోనే సిబిఐ ఇద్దరు స్వతంత్ర సాక్షులను ఏర్పాటు చేసినట్లు కూడా గమనించబడింది' అని సెప్టెంబరు 16న వెలువరించిన తన తీర్పులో ధర్మాసనం పేర్కొంది. ఇంత 'అసాధారణ వేగం'తో ఉచ్చు పన్నినందుకు దర్యాప్తు సంస్థను తప్పు పట్టలేనప్పటికీ, దానిపై కొన్ని సందేహాలు తలెత్తుతున్నాయని బెంచ్ తెలిపింది. ట్రయల్ కోర్టు అప్పీల్‌దారుడు లేవనెత్తిన సందేహాలను తోసిపుచ్చిందని ధర్మాసనం పేర్కొంది. 'ట్రయల్ కోర్టు గుర్తించిన లోపాలు, మా అభిప్రాయంలో, ప్రాసిక్యూషన్ కేసుపై సహేతుకమైన సందేహాన్ని కలిగిస్తున్నాయి' అని ద్విసభ్య ధర్మాసనం వివరించింది. 'సహేతుకమైన సందేహాలు ఇంకా మిగిలి ఉన్నందున', అప్పీల్‌దారుడిపై ఉన్న అభియోగం రుజువైందని చెప్పలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. రెండు అప్పీళ్లను అనుమతిస్తూ, ఈ కేసుల్లో అప్పీల్‌దారుడిని అన్ని ఆరోపణల నుంచి సుప్రీంకోర్టు నిర్దోషిగా విడుదల చేసింది.

## రాష్ట్రపతి పాలన విధించినట్లయితే యుటి ఎల్‌జిలకు...

# అంతర్‌రాష్ట్ర మండలి సమావేశాలలో పాల్గొనే ఛాన్స్

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంబంధిత నిబంధనలను సవరించిన నేపథ్యంలో పుదుచ్చేరి, జమ్మూకశ్మీర్, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతాలలో రాష్ట్రపతి పాలన అమలులో ఉన్నప్పుడు, ఆయా ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు (ఎల్‌జిలు) అంతర్‌రాష్ట్ర మండలి సమావేశాలలో పాల్గొనే అవకాశం కలుగుతుంది. మండలిని ఏర్పాటుచేసిన 1990 అంతర్‌రాష్ట్ర మండలి ఉత్తర్వులోని సవరణను, హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సెప్టెంబరు 9న నోటిఫై చేయగా, శుక్రవారం (సెప్టెంబరు 18న) ప్రచురించింది. 1990 మే నాటి ఉత్తర్వు ప్రకారం, ఈ అంతర్‌రాష్ట్ర మండలిలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, నిర్దిష్ట కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు, కేబినెట్ హోదా కలిగిన ఆరుగురు కేంద్ర మంత్రులు ఉంటారు. ఆ సంవత్సరం జులైలో ప్రవేశపెట్టబడిన దాని నిబంధన, వారి వారి రాష్ట్రాలలో ఆర్టికల్ 356 కింద ప్రకటన అమలులో ఉన్నప్పుడు, లేదా జమ్మూ, కశ్మీర్ రాజ్యాంగంలోని సెక్షన్ 92 కింద పూర్వపు జమ్మూ, కశ్మీర్ రాష్ట్ర గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వు అమలులో ఉన్నప్పుడు గవర్నర్ హాజరును ప్రస్తావించింది. 2019లో, ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌ను, జమ్మూ కశ్మీర్, లడఖ్ అనే రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. 2026 నాటి ఉత్తర్వు, 1990 జులై నాటి ఆ నిబంధన స్థానంలో నాలుగు భాగాలు కలిగిన ఒక నిబంధనను ప్రవేశపెడుతుంది. ఆర్టికల్ 356 ప్రకారం రాష్ట్రానికి సంబంధించిన నిబంధనను ఇది కొనసాగిస్తుంది. 'ఆ రాష్ట్ర గవర్నర్‌ను కౌన్సిల్ సమావేశాలకు హాజరు కావడానికి ఆహ్వానించాలి' అని ఆ ఉత్తర్వు నిర్దేశిస్తుంది. ఆ తర్వాత, శాసనసభలు కలిగిన కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన మూడు నిబంధనలను ఇదిజోడిస్తుంది. శాసనసభలు కలిగిన మూడు కేంద్ర పాలిత ప్రాంతాల (పుదుచ్చేరి, జమ్మూకశ్మీర్, ఢిల్లీ ఎన్‌సిటి) పాలనకు సంబంధించిన చట్టాలలోని నిబంధనల ప్రకారం రాష్ట్రపతి పాలన విధించినప్పుడు, ఆయా కౌన్సిల్ సమావేశాలలో లెఫ్టినెంట్ గవర్నర్ పాల్గొనడానికి ఈ సవరణ వీలు కల్పిస్తుంది. పుదుచ్చేరికి సంబంధించి , 1963 కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టంలోని సెక్షన్ 5 కింద ఒక ఉత్తర్వు అమలులో ఉన్నప్పుడు, 'పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంత లెఫ్టినెంట్ గవర్నర్‌ను మండలి సమావేశాలకు హాజరుకావడానికి ఆహ్వానించాలి' అని ఇది నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 293 ఎబి కింద ఏదైనా ఉత్తర్వు అమలులో ఉన్నప్పుడు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌ను ఆహ్వానిస్తారని అది పేర్కొంది. ఒక రాష్ట్రంలో లేదా కేంద్రపాలిత ప్రాంతంలో రాజ్యాంగ యంత్రాంగం విఫలమైనప్పుడు రాష్ట్రపతి పాలన విధిస్తారు.

# సైబర్ వలలో యుపి ఎమ్మెల్యే

- ఫోన్‌పే, యుపిఐ ద్వారా సుమారు రూ.1.55 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

**ప్రయోగ్‌రాజ్ :** సైబర్ వలలో పడి డబ్బులు కోల్పోయిన ఘటనలు ఇటీవలి కాలంలో ఎక్కువ అవుతున్నాయి. సామాన్యుల నుంచి మొదలుకుని ప్రజాప్రతినిధుల వరకు కేటుగాళ్లు ఎవరిని వదిలిపెట్టడంలేదు. తాజాగా, ఉత్తర్‌ప్రదేశ్ కౌశంబీ జిల్లాలో చాయల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పూజా పాల్, సైబర్ మోసగాళ్ల బారిన పడ్డారు. సైబర్ కేటుగాళ్లు ఆమె బ్యాంకు ఖాతాను హ్యాక్ చేసి, ఫోన్‌పే, యుపిఐ ద్వారా సుమారు రూ.1.55 లక్షలు కాజేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదు ఆధారంగా, ప్రయాగ్‌రాజ్ కమిషనరేట్‌లోని ధూమన్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల కథనం ప్రకారం, ఎమ్మెల్యే పూజా పాల్‌కు ధూమన్‌గంజ్‌లోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉంది. అయితే, ఈ ఏడాది ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 13 మధ్య, ఆమె ఖాతా నుంచి ఫోన్‌పే, యుపిఐ ద్వారా అనేక అనుమానాస్పద లావాదేవీలు జరిగాయి. సెప్టెంబర్ 14న ఆమె ఖాతా స్టేట్‌మెంట్ బ్యాంక్ వివరాలను పరిశీలించినప్పుడు ఈ మోసం బయటపడింది. అయితే, అప్పటికే, మోసగాళ్లు ఆమె ఖాతా నుంచి విడతల వారీగా డబ్బును లాగేసుకున్నారు. ఈ మోసాన్ని గుర్తించిన పూజా పాల్, సైబర్ క్రైమ్ అధికారులకు, స్థానిక ధూమన్‌గంజ్ పోలీస్ స్టేషన్, సంబంధిత బ్యాంకులో ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించి యుపిఐ లావాదేవీల స్క్రీన్‌షాట్‌లు, బ్యాంకు స్టేట్‌మెంట్‌లను పోలీసులకు అందించారు. తన ఐఫోన్ 17ను ఎవరో హ్యాక్ చేసి ఈ అనధికార లావాదేవీలు నిర్వహించి ఉంటారని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. పూజా పాల్ ఫిర్యాదు ఆధారంగా, ధూమన్‌గంజ్ పోలీసులు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# అణుశక్తి పురోగతిని వ్యతిరేకులు అడ్డుకుంటున్నారు

- ప్రధాని మోదీ
- వాతావరణ మార్పులకు అభివృద్ధి చెందుతున్న దేశాలను తరచూ నిందిస్తున్నారని ధ్వజం

**న్యూఢిల్లీ :** అభివృద్ధిచెందిన దేశాలు భారతదేశం కంటే ఆరు రెట్లు ఎక్కువగా తలసరి కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తున్నాయని, అయినప్పటికీ, వాతావరణ మార్పులకు అభివృద్ధి చెందుతున్న దేశాలను తరచుగా, అన్యాయంగా నిందిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీధ్వజమెత్తారు. ఆయన శనివారం ఇక్కడ పర్యావరణం, వాతావరణంపై జరిగిన అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. అనంతరం ప్రసంగిస్తూ, అణుశక్తి ఉత్పత్తిపై దేశం వేగంగా పని చేస్తోందని చెప్పారు. అయితే, తాను అణుశక్తి ఉత్పత్తిపై పనిని ముందుకు తీసుకెళ్లినప్పుడల్లా, పర్యావరణం గురించి గట్టిగా ప్రభోదించే వారే, ప్రభుత్వ అణుకార్యక్రమాలను నిలిపివేయడానికి కోర్టు కేసులు వేస్తూ స్వచ్ఛ ఇంధన పరిష్కారాలను చురుకుగా వ్యతిరేకిస్తున్నారని ప్రధాని ఆరోపించారు. 'కార్బన్ ఉద్గారాల బాధ్యతను తరచుగా అభివృద్ధి చెందుతున్న దేశాలపై తప్పుగా మోపుతున్నారనే విషయం మనందరికీ తెలుసు. అయితే, చారిత్రక వాస్తవం ఏమిటంటే, నేటికీ తలసరి కార్బన ఉద్గారాల విషయంలో భారతదేశం వాటా ప్రపంచ సగటులో సగం కన్నా తక్కువగానే ఉంది' అని పర్యావరణ నిపుణులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, న్యాయ నిపుణులు, ఉన్నత ప్రభుత్వ అధికారులు హాజరైన రెండు రోజుల కార్యక్రమంలో ఆయన తెలిపారు. భారతదేశంతో పోలిస్తే, అభివృద్ధి చెందిన దేశాలలో తలసరి కార్బన్ ఉద్గారాలు ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నాయని, ఈ వాస్తవాన్ని న్యూఢిల్లీ ప్రపంచ వేదికలపై బలంగా బలంగా ప్రస్తావిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. 'ప్రతీ భారతీయుడికి నేను చెప్పేది ఏమిటంటే, మీరు కూడా ఈ విషయాన్ని బలంగా చెప్పండి' అని మోదీ కోరారు. భారతదేశం ప్రపంచంలోని ఇతర దేశాలతో కలిసి పనిచేస్తూ పర్యావరణ పరిరక్షణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని తెలియజేశారు. 'మన అభివృద్ధి వేగవంతమైనది, అలాగే సుస్థిరమైనది' అని మోదీ నొక్కిచెప్పారు. భారతదేశం పునరుత్పాదక ఇంధనంపై దృష్టి సారిస్తోందని, పారిస్ (సిఓపి 21) ఒప్పందానికి నిర్దేశించిన గడువు కంటే చాలా ముందే తన కట్టుబాట్లను నెరవేర్చిన ఏకైక దేశం జి–20లో భారతదేశం మాత్రమేనని ప్రధాని చెప్పారు. ఇదే నూతన భారతదేశపు శక్తి. శిలాజేతర ఇంధనాలు, సౌరశక్తి సామర్థ్యం, కార్బన్ ఉద్గారాల నిలుపుదల..ఇలాంటి అన్ని కొలమానాల్లో భారతదేశపు పనితీరు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది' అని ఆయన తెలియజేశారు.

# రష్యా డ్యూమాకు కొనసాగుతున్న ఎన్నికలు

● ఉక్రేన్ ఆక్రమిత ప్రాంతాల్లో తొలిసారి పోలింగ్ ● మా భవితకోసం ఓటేశాం:డోనెట్స్క్ ఓటర్ వెల్లడి

**మాస్కో:**ఒకవైపు ఉక్రేన్‌తో యుద్ధం ఉద్ధృతస్థాయిలో కొనసాగుతున్న తరుణంలో రష్యా పార్లమెంటు డ్యూమా (దిగువసభ )కు తొమ్మిదవసారి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. సెప్టెంబరు 18న ప్రారంభమైన పోలింగ్ శనివారం రెండోరోజు కూడా జోరుగా కొనసాగింది. ఆదివారం రాత్రి వరకూ పోలింగ్ కేంద్రాలు తెరచే ఉంటాయని ఎన్నికల అధికారులు ప్రకటించారు. పార్లమెంటరీ ఎన్నికల్లో రెండోరోజు శనివారం పోలింగ్ ఎంతో ఉత్సాహంగా కొనసాగుతోందని ఎన్నికల సంఘం ఛైర్మన్ (సిఇసి)ఎల్లా పామ్ఫిలోవా చెప్పారు. 89 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఖచ్చితమైన సమయానికి తెరుచుకుని పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నాయని ఆమె చెప్పారు.ఉక్రేన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మొదటిసారి ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఉక్రేన్‌లో ఆక్రమించిన ప్రాంతాలను కూడా కలిపి కొత్త రీజియన్స్‌లో మొదటిసారి ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తున్నారు. డోనెట్స్క్‌లో జరిగిన పోలింగ్ సందర్భంగా అక్కడి ఓటర్లు ''తమ భవిష్యత్తుకోసం ఈ ఓటింగ్‌లో పాల్గొంటున్నాం'' అని చెప్పారు. ఉక్రేన్‌లో దాదాపు 20 శాతం ప్రాంతాన్ని రష్యా తన



స్వాధీనంలోకి తెచ్చుకుంది. డొనెట్స్క్, లుహాన్స్క్, జపోరిజ్జియా,ఖెర్సాన్,క్రిమ్లియన్ రీజియన్లు రష్యా అధీనంలో ఉన్నాయి. రష్యన్ ఫెడరేషన్ పరిధిలో నిర్ణీత సమయానికి ముందుగానే 46,63,960 మంది ఓటు హక్కు ఉపయోగించుకున్నారని సిఇసి ఎల్లా పామ్ ఫిలోవా శనివారం మీడియా సమావేశంలో చెప్పారు.మార్షల్ లా అమలులో ఉన్న 12 ప్రాంతాలలో 44 లక్షలమంది ప్రజలు ముందుగానే ఓట్లు వేశారని చెప్పారు.450 స్థానాలు ఉన్న రష్యా డ్యూమాలో అధికారం చెలాయించడానికి ఏ పార్టీ అయినాగానీ 226 స్థానాలు గెలుచుకోవాలి.దిగువసభ ''ఫెడరల్ అసెంబ్లీ''కి ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. 2021లో జరిగిన ఎన్నికల్లో ఆల్ రష్యన్ పొలిటికల్ పార్టీ ''యునైటెడ్ రష్యా'' 324 సీట్లు గెలుచుకుని 48.9 శాతం ఓట్లతో అధికారం చేపట్టింది. యునైటెడ్ రష్యా 2001 నుండి అధికారంలో కొనసాగుతోంది.2011లో పుతిన్ స్థాపించిన ఆల్ రష్యా యునైటెడ్ ఫ్రంట్‌లో యునైటెడ్ రష్యా ప్రధాన పార్టీగా ఉంది. ఈసారి ఎన్నికల్లో మొత్తం పది పార్టీలు పాల్గొంటున్నాయి.యునైటెడ్ రష్యాతో పాటు కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ద రష్యన్ ఫెడరేషన్,న్యూ పీపుల్,ఎ జస్ట్ రష్యా-ఫర్ ట్రూత్,పార్టీ ఆఫ్ పెన్షనర్స్ ఫర్ సోషల్ జస్టిస్,కమ్యూనిస్ట్స్ ఆఫ్ రష్యా,రోడినా,పార్టీ ఆఫ్ డైరెక్ట్ డెమోక్రసీ,గ్రీన్స్ ఎకోలాజికల్‌పార్టీ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రష్యాలోని 39 ప్రాంతీయ విభాగాలకు సంబంధించిన ప్రాంతీయ శాసనసభలకు కూడా ఎన్నికలు జరుగుతున్నాయి.ఎనిమిది ప్రాంతాలలో నాయకులు నేరుగా ఎన్నికవుతారు. మూడు ప్రాంతాలలో నాయకులను ప్రాంతీయ పార్లమెంటులు ఎన్నిక చేస్తాయి.మొత్తం 23,000 స్థానాలను ఎన్నికల ద్వారా భర్తీచేస్తారు.

# హెచ్–1బికి మరో ఏడాది లక్షడాలర్ల ఫీజు

**వాషింగ్టన్:**కొత్తగా హెచ్–1 బి వీసాలు మంజూరు చేయడానికి లక్ష డాలర్ల ఫీజు చెల్లించాలని ట్రంప్ గతంలో విధించిన ఉత్తర్వును ఏడాదిపాటు పొడిగించారు. గత ఏడాది అమలులోకి తెచ్చిన ఈ రుసుము విధింపు ఉత్తర్వు గడువు ఈనెలాఖరుతో పూర్తి కావాల్సి ఉండగా దీనిని మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వు ఇచ్చారు. ఇప్పటికే అమెరికాలో విద్యార్థి వీసాలపై లక్షలమంది ఉన్నారు. గతంలో హెచ్–1 బి వీసాలు తీసుకున్నవారికి ఈ లక్షడాలర్ల ఫీజు వర్తించదు.ఈ పరిస్థితుల్లో నవంబరు ఎన్నికల ఒత్తిడిని తట్టుకోవడానికి గడువు పెంచారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వరంగ విభాగాలమధ్య సమన్వయంతో కఠినంగా ఈ వీసాలను మీక్ష చేయడానికి,దరఖాస్తుల పరిశీలను కఠినతరం చేయడానికి మరో ప్రత్యేక ఉత్తర్వు కూడా జారీ చేశారు. అదేవిధంగా ఇప్పటికే ఉన్న విదేశీ నైపుణ్య కార్మికుల పరిస్థితిని సమీక్షించడానికి సంబంధించి యాజమాన్యాలను ప్రశ్నించడానికి 30 రోజులు గడువు ఇచ్చారు. అనర్హులను చిన్న ఉద్యోగాల్లో కొనసాగిస్తే యాజమాన్యాలపై ఈ సమీక్ష ద్వారా చర్యలు తీసుకుంటారు. ఈ వీసాల వల్ల ప్రయోజనం పొందేవారిలో భారతదేశీయులే అగ్రస్థానంలో ఉన్నారు.అమెరికన్లు చేయగలిగిన చిన్న చిన్న ఉద్యోగాలను కూడా ఈ వీసాలు ఇచ్చి

ట్రంప్ తాజా ఉత్తర్వు




విదేశీయులను పిలిపించి తక్కువ వేతనాలతో పనులు చేయించుకుంటున్నారని, కేవలం ఎంతో గొప్ప నైపుణ్యం ఉన్న ఉద్యోగులను రప్పించడంకోసమే ఈ వీసాలను ఉపయోగించాలనేది ట్రంప్ ఉద్దేశం. హెచ్–1 బి వీసాలకు ఈ విధంగా ఏడాదిపాటు లక్ష డాలర్లు రుసుము ఈ వీసాలపై విధించడంవల్ల స్థానికంగా పుట్టిన దేశీయ అమెరికన్ పౌరులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, జాతీయ భద్రతకు భరోసా వస్తుందని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పారు.హెచ్–1బి వీసా మంజూరు చేయడానికి లక్ష డాలర్లు విదేశీయులు చెల్లించాలని ట్రంప్ 2025లో తెచ్చిన ఉత్తర్వు ఇప్పటికే న్యాయపరమైన సవాళ్ళను ఎదుర్కొంటోంది.అమెరికాలోని రెండు వేరు వేరు న్యాయస్థానాలలో ఈ విషయంపై విచారణలు కొనసాగుతున్నాయి. లక్షడాలర్లు వసూలు చేయాలనే ఉత్తర్వులు ఇచ్చినప్పటినుండీ అమెరికాలోని అత్యున్నత స్థాయి ఐటీ కంపెనీలకు ఈ వీసాలపై వచ్చేందుకు విదేశీ ఉద్యోగులు దాఖలు చేసుకునే రిజిస్ట్రేషన్లు 92 శాతం మేరకు తగ్గారని ట్రంప్ వాదిస్తున్నారు. ఈ ఉత్తర్వు ద్వారా గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. ఈ విధానం వల్ల అమెరికాలో ఉంటే స్థానిక గ్రాడ్యుయేట్లకు ఉద్యోగావకాశాలు పెరుతాయన్నారు. దేశంలో లేని, అత్యున్నతమైన నైపుణ్యంగల ఉద్యోగులను మాత్రమే అవసరాలకు అనుగుణంగా కంపెనీలు అమెరికాకు తెచ్చుకోవడానికి వీలు కలగుతుందని, ఇప్పటివరకూ ఈ విధానంపై కఠిన నిబంధనలు లేకపోవడంవల్ల నైపు ణ్యంతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ అమెరికా వస్తున్నారని, చిన్న చిన్న ఉద్యోగాలలో చేరుతున్నారని, దీనివల్ల స్థానికంగా పుట్టిన అమెరికన్లు తాము చేయగలిగిన ఉద్యోగావకాశాలు కూడా కోల్పోతున్నారని ట్రంప్ అన్నారు. ఈ ఉత్తర్వు ద్వారా ఈ పరిస్థితిని అదుపు చేశామన్నారు.

# రష్యాపై ఆంక్షల బిల్లుకు చట్టరూపం

**వాషింగ్టన్:**రష్యాను ఆర్థికంగా దెబ్బకొట్టేందుకు వీలుగా అమెరికా ప్రతినిధుల సభ ఆమోదించన బిల్లుపై ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. దీంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. ఈ చట్టం ద్వారా ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడానికి విశేషాధికారాలు లభిస్తాయి. కానీ రష్యాకు అనేక దశాబ్దాలుగా చమురు,సహజవాయువు కొనుగోలుదారుడుగా ఉన్న చైనాపై ఆంక్షలను అమలు చేయడం ట్రంప్‌కు అంత తేలికైన విషయం కాదు.చైనా నుండి దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ భారీగా సుంకాలు విధించినప్పుడు ఎంతో సాహసంతో సవాలు చేసిన చైనా కూడా అమెరికా వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించింది.అంతర్జాతీయ చట్టాలతో,భద్రతా మండలితో సంబంధం లేని ఈ బిల్లును తాము పట్టించుకోబోమని, దానికి ఎలాంటి చట్టబద్ధతా లేదని ఇప్పటికే చైనా స్పష్టం చేసింది. భారతదేశం కూడా తగిన అన్ని రక్షణ చర్యలూ తీసుకుంటామని ప్రకటించింది.రష్యా నుండి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు జరిమానాగా ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు.భారత్‌కు 40 శాతంగా ఉండే రష్యా చమురు దిగుమతులు ఆ తర్వాత 19 శాతానికి తగ్గిపోయాఇయి. అమెరికా సుప్రీంకోర్టు గడచిన ఫిబ్రవరిలో ట్రంప్ అడ్డగోలు సుంకాలను రద్దుచేశాక ఈ దిగుమతులు మళ్ళీ 51 శాతానికి పెరిగాయి.ఉక్రేన్‌ను ఆక్రమించాలని చూసే యుద్ధోన్మాది రష్యాను ప్రోత్సహిస్తున్నాయంటూ భారత్,చైనా సహా మరికొన్ని దేశాలను ట్రంప్ లక్ష్యంగా చేసుకుని ఈ చట్టం తీసుకువచ్చారు.గడచిన ఆగస్టునెలలో 86–11 ఓట్లతో సెనేట్, 262–159 ఓట్ల తేడాతో అమెరికా ప్రతినిధులసభ సెప్టెంబరు 17న ఆమోదించింది. ఈ మంత్రం ఎన్నికల ప్రచారానికి తప్ప చైనాపై పనిచేయదని అమెరికా బిజినెస్‌లాబీ పెదవి విరిచింది.

# మూడు మీడియా సంస్థలపై ట్రంప్ నిషేధం

● ఆ హక్కు నాకుందని ఉద్ఘాటన ● చట్టవిరుద్ధమైన దాడి:మీడియా ఖండన

**వాషింగ్టన్:**వైట్‌హౌస్ నుండి సిఎన్ఎన్,పొలిటికో, ఎంఎస్ నౌ మీడియా సంస్థలను డోనాల్డ్ ట్రంప్ నిషేధించారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని ప్రకటించారు. తప్పుడు కథనాలు, వ్యతిరేక కథనాలు రాసే మీడియా సంస్థలపై నిషేధంవిధించే హక్కు,అధికారాలు తనకు ఉన్నాయని ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. తాను అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ఈ మూడు మీడియా సంస్థలు కల్పిత కథలు, తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నాయని, అసత్య ప్రచారం చేస్తున్నాయని వాటిని సహించబోనన్నారు.ఐతే ఆరోపణల నిర్ధారణకుగాను ఆయన ఎలాంటి ఉదాహరణలను పేర్కొనలేదు. ఇది చాలా సులభమైన నిషేధమన్నారు. ఐతే ఈ మీడియా సంస్థలను వైట్‌హౌస్ ప్రాంగణంలోకి రాకుండా అడ్డుకుంటారా? అనే విషయంపై ఎలాంటి స్పష్టతా లేదు.ఐతే ఈ నిషేధాన్ని సిఎన్ఎన్ సంస్థ చట్టవిరుద్ధమైన దాడిగా పేర్కొంది. తీవ్రమైన చర్యగా ఖండించింది. ప్రభుత్వం నుండి ఎలాంటి ఆటంకాలు లేకుండా,ప్రభుత్వ



జోక్యం లేకుండా రిపోర్టింగ్ చేయడానికి అమెరికా రాజ్యాంగం ప్రకారం హక్కులు ఉన్నాయని సిఎన్ఎన్ ఒక ప్రకటనలో తెలియజేసింది. అధ్యక్షుడు విధించిన నిషస్త్రధం నిజంగా అమలులోకి వస్తే అది రాజ్యాంగ విరుద్ధం కాగలదని పేర్కొంది. ట్రంప్ చర్యను ఈ మూడు మీడియా సంస్థలు చట్టబద్ధంగా,న్యాయపరంగా సవాలు చేసి ప్రతిఘటించే అవకాశాలున్నాయి.ఈ ప్రకటన వెలువడిన తర్వాత కూడా సిఎన్ఎన్,పొలిటికో మీడియా సంస్థలకు చెందిన అధికార ప్రతినిధులు వైట్‌హౌస్ ప్రాంగణంలోనే తిరుగాడుతూ ఉండటాన్ని మీడియా గమనించింది. సిఎన్ఎన్ బృందం ఒకటి జె.డి.వాన్స్‌తో కలిసి అయోవాలో ఒక కార్యక్రమంలో పాల్గొంది. 'పొలిటికో' మీడియా సంస్థ కూడా ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్ సారథ్యంలోని వైట్‌హౌస్ మాత్రమే కాదు, భవిష్యత్ వైట్‌హౌస్ కార్యకలాపాలను కూడా రిపోర్టింగ్ చేసే హక్కులు తమకు ఉన్నాయని పేర్కొంది. ఐతే ట్రంప్ చర్యను చట్టవిరుద్ధమైనదిగా ఫ్రీడమ్ ఆఫ్ ద ప్రెస్ ఫౌండేషన్ తప్పుపట్టింది. గతంలో కూడా ట్రంప్ ద వాల్ స్ట్రీట్ జర్నల్,ద న్యూయార్క్ టైమ్స్, బిబిసిసహా పలు అమెరికా, అంతర్జాతీయ మీడియా సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. న్యాయస్థానాలలో వ్యాజ్యాల ఫలితంగా కొన్ని మీడియా సంస్థలు కోట్లాదిరూపాయలు పరిహారం చెల్లించడానికి సిద్ధపడ్డాయి. అదేవిధంగా బిబిసిపై ట్రంప్ వేసిన వ్యాజ్యం కోర్టులో ఇంకా విచారణలోనే ఉంది.

# క్యూబాలో మళ్ళీ గ్రిడ్ వైఫల్యం

● దేశవ్యాప్తంగా అంధకారం

**హవానా:**క్యూబాలో మరోసారి అంధకారం అలముకుంది. గ్రిడ్ విఫలం కావడంతో క్యూబా దేశవ్యాప్తంగా ప్రజలకు విద్యుత్ సరఫరా లేకుండాపోయింది. ఈ ఏడాదిలో ఈ విధంగా గ్రిడ్ విఫలం కావడం ఏడోసారి. విద్యుత్ గ్రిడ్ పూర్తిగా విఫలమైందని, ప్రజలు అంధకకారంలో ఉన్నారని ఇంధన మంత్రిత్వ శాఖ శనివారం ప్రకటించింది. ఒకవైపు అమెరికా చమురు ఆంక్షలు కొనసాగుతున్న సమయంలోనే క్యూబన్ ప్రజలు ఈ విద్యుత్ కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఐతే రాజధాని హవాననాలోని కొన్ని ఆసుపత్రులు,నీటి పంపింగ్ కేంద్రాలకు కొద్ది గంటల తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. క్యూబాలో విద్యుత్ మౌలిక సదుపాయాలు అనేక దశాబ్దాలుగా ఉన్నవే. వాటిలో మార్పులు చేయలేదు. అమెరికా ఆంక్షల కారణంగా కొత్త విద్యుత్ సామాగ్రిని ఏర్పాటు చేసి కొత్త యంత్రాలు ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడంవల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసుకోవడంలో తీవ్ర కొరతను ప్రభుత్వం ఎదుర్కొంటున్నది. ఒక ప్రత్యామ్నాయ విధానంగా సోలార్ ప్యానల్స్‌ను క్యూబా అంతటా ఏర్పాటు చేస్తూ ప్రజలను ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలవైపు నడిపిస్తోంది.అదేవిధంగా ఇటీవలికాలంలో ఆహారం,ఔషధాల కొరత కొనసాగుతోంది. ఆసుపత్రులు కూడా సరిగ్గా పనిచేయలేని దశకు వస్తున్నాయి.పాఠశాలలను,కార్యాలయాలను తరచు మూసివేయాల్సి వస్తోంది. ఇవన్నీ అమెరికా అనుసరిస్తున్న విద్వేషపూరిత విధానాల ఫలితమే.గతంలో కేవలం అప్పుడప్పుడు మాత్రమే అవాంతరాలువచ్చేవని, ఇప్పుడు ఆంక్షలు పెరిగిపోవడంవల్ల తరచు అవాంతరరాలు వస్తున్నాయని క్యూబన్ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

# ప్రజల దృష్టి మళ్లించేందుకు బిఆర్ఎస్ నేతలడైవర్షన్ డ్రామాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**కల్వకుంట్ల కుటుంబం భూ వ్యవహారాలు బయటపడటంతోనే బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీశ్‌రావు ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ డ్రామాలకు తెర లేపారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు . ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేవనెత్తిన భూ అంశాలపై సమాధానం చెప్పలేకనే నీటి సమస్యను తెరపైకి తెచ్చి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. శనివారం సిఎల్‌పి కార్యాలయంలో ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులకు ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు ప్రధాన కారణాలని వారు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా లేక ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గాయని, ఈ పరిస్థితిపై ప్రభుత్వం ముందుగానే రైతులను అప్రమత్తం చేసిందన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలని ప్రభుత్వం సూచించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు అవసరమైన విద్యుత్‌ను చేసి రైతులకు సరఫరా చేస్తున్నామని ఆయన తెలిపారు.

# శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు ప్రమాదం

● ముగ్గురు కూలీలు మృత్యువాత ● సపోర్ట్ రాళ్లు తేవడానికి వెళ్లిన మరో ఇద్దరు కూలీలకు తప్పిన ప్రాణగండం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఔటర్ రింగ్ రోడ్డుపై అశోక్ లేలాండ్ వాహనాన్ని డిసిఎం వ్యాన్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు కూలీలు మృత్యువాత పడిన సంఘటన శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ఎగ్జిట్ 7లో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాద సంఘటన వివరాలను శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి తెలిపారు. హైద్రాబాద్‌లోని ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన మహ్మద్ హుస్సేన్ (టిఎస్ 09 యుడి 3611) నెంబర్ గల అశోక్ లేలాండ్ వాహనాన్ని చేగుంట నుంచి స్క్రాప్ లోడ్ చేసుకుని నలుగురు కూలీలు ఇబ్రహీం, రింకు, అశోక్, బీమ్‌షాలను ఎక్కించుకుని శామీర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కీసర వైపు వస్తుండగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో అశోక్ లేలాండ్ వాహనం వెనక టైర్ పంక్చరయ్యింది. వాహనాన్ని ఎమర్జెన్సీ లైన్ పక్కకు ఆపాడు. ఆ వాహనం టైర్ పంక్చర్ చేయడానికి మహ్మద్ హుస్సేన్, రింకులు జాకీ, రాడ్లతో ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో షేక్ ఇబ్రహీం టార్చ్ లైట్ పట్టుకుని సహాయ పడుతున్నాడు. మరో ఇద్దరు కూలీలైన బీమ్‌షా, అశోక్‌లు సపోర్ట్ రాళ్లు తేవడానికి సమీపంలోకి వెళ్లారు. ఆ సమయంలో ఔటర్ రింగ్





రోడ్డుపై మృత్యురూపంలో దూసుకొచ్చిన డిసిఎం వ్యాన్ (టిఎస్ 15 యుడి 8932) ను నడుపుతున్న డ్రైవర్ నాగరాజు అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా నడుపుతు అశోక్ లేలాండ్ వాహనాన్ని వెనకాల నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అశోక్ లేలాండ్ వాహనం కింద ఉన్న ఇద్దరు కూలీలు మహ్మద్ హుస్సేన్ (26), రింకు(34)లకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృత్యువాత పడ్డారు. మరో కూలీ ఇబ్రహీం (20) తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. సపోర్ట్ రాళ్లు తేవడానికి వెళ్లిన బీమ్‌షా, అశోక్‌లకు ప్రాణగండం తప్పింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి తెలిపారు.

# త్రిముఖ వ్యూహం

(మొదటి పేజీ తరువాయి)

పర్యవేక్షించనున్నారు. తద్వారా రవాణలో వేగం పెరగడంతో పాటు రవాణాలో పారదర్శకంగా సాగనుంది.

**'ఫిజికల్ వెరిఫికేషన్' యాప్‌తో ఆకస్మిక తనిఖీలు:**

క్షేత్రస్థాయిలో అధికారుల జవాబుదారీతనాన్ని పెంచేందుకు 'ఫిజికల్ వెరిఫికేషన్' మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. డివిజన్, జిల్లా స్థాయి అధికారులు ఈ యాప్ ద్వారా మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నారు. తద్వారా కొనుగోలు కేంద్రాల్లో రికార్డులు, నిల్వలు, మిల్లులకు తరలించిన ధాన్యం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. ముఖ్యంగా నకిలీ రశీదులు, ఫేక్ షీట్లు సృష్టించే పిపిసి ఇంఛార్జీలపై కఠిన చర్యలకు పౌర సరఫరాల శాఖ సిద్ధమవుతోంది.

**వర్షాల నుంచి ధాన్యానికి రక్షణ :**

ఖరీఫ్ కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలను ముందుగానే అన్ని వసతులతో సిద్ధం చేస్తున్నారు. రైతులు తెచ్చిన ధాన్యం తడిసి నష్టపోకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు, నిల్వ ప్రాంతాల్లో మాయిశ్చర్ మీటర్లు, క్లీనర్లు, డ్రయ్యర్లు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ధాన్యం నాణ్యతను కాపాడటంతో పాటు తేమ కారణంగా రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

**క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించండి : స్టీఫెన్ రవీంద్ర**

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యేనాటికి క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం. స్టీఫెన్ రవీంద్ర అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి శనివారం ఆయన ప్రధాన కార్యాలయంలో జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి జిల్లాలో అందుబాటులో ఉన్న గోదాములు, ప్రత్యామ్నాయ నిల్వ ప్రాంతాలు, రవాణా వాహనాలు, హమాలీల లభ్యత, కొనుగోలు కేంద్రాల సన్నద్ధతపై వివరాలు సేకరించారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులకు సూచనలు చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఎండి కొర్ర లక్ష్మి, జిల్లా పౌరసరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

# గ్రీన్‌లాండ్

(మొదటి పేజీ తరువాయి)

సంతకాల తతంగం పూర్తిచేస్తారని భావిస్తున్నట్లు వారు చెప్పారు.ఐతే ఒప్పందంలో ఏ అంశాలు ఉన్నాయో వారెవ్వరూ వివరించలేదు.భవిష్యత్తులో గ్రీన్‌లాండ్ ఒక స్వయంప్రతిపత్తి సార్వభౌమాధికారదేశంగా మారినప్పటికీ, ఈ ఒప్పందం గడువు ముగిసేఅవకాశం లేదని అంగీకృత నిబంధనలలో ఉన్నట్లు పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా విదేశాంగశాఖాధికారి చెప్పినట్లు బిబిసి పేర్కొంది. అదేవిధంగా గ్రీన్‌లాండ్,డెన్మార్క్ పాలకుల అనుమతి లేకుండానే ఈ ప్రాంతంలో సైనిక స్థావరాలను,కేంద్రాలను నిర్మించుకోవడానికి అమెరికాకు ఏకపక్ష అధికారాలున్నాయని అధికారి చెప్పారు.ఐతే నాటోయేతర దేశాలు ఎలాంటి కార్యకలాపాలు చేయకుండా ఒప్పందం నిషేధిస్తుంది.అమెరికా తనకు కావాల్సినన్ని దళాలను గ్రీన్‌లాండ్‌కు పంపి అక్కడే ఉంచుకోవచ్చు. వ్యూహాత్మక ఆయుధాలను మోహరించవచ్చు.గ్రీన్‌లాండ్ వాయువ్య కొనప్రాంతం ఫిటుఫిక్‌లో ఇప్పటికే అమెరికా 100 మంది సైనికులను మోహరించింది.రక్షణ విషయం పక్కనపెడితే గ్రీన్‌లాండ్‌లో అత్యంత విలువైన,అరుదైన ఖనిజ సంపద ఉంది. ఈ ఖనిజాలు మొబైల్‌ఫోన్లు,ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి ఎంతో కీలకమైనవి.చైనా–రష్యాల నుండి అమెరికాపై భవిష్యత్తు దాడులను అడ్డుకోవాలంటే గ్రీన్‌లాండ్‌లో వ్యూహాత్మక ఆయుధాలు మోహరించాలని, యుద్ధ ఎత్తుగడల్లో అమెరికా రక్షణకు గ్రీన్‌లాండ్ అత్యంత కీలకమైన ప్రదేశమని,దానిని స్వాధీనం చేసుకుంటామని,లేకపోతే ఎంత డబ్బైనా ఇచ్చి కొనుగోలు చేస్తామని ఆ మధ్య ట్రంప్ ప్రకటనలతో తీవ్ర వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. దీనివల్ల నాటో కూటమిలో కూడా విభేదాలు బహిర్గతమయ్యాయి.ఈ రగడ చల్లారిపోయిందని అందరూ అనుకున్న తరుణంలో ట్రంప్ పట్టు వదలకుండా చాపకింద నీరులా తన ప్రయత్నాలన్నీ పూర్తిచేశారు.గ్రీన్‌లాండ్‌లో అపారమైన ఖనిజ సంపద ఉంది. ఈ విషయాన్ని ట్రంప్ మరుగున పరిచారు. చైనా–రష్యాలు అమెరికాపై దాడి చేయడానికి గ్రీన్‌లాండ్ అనువైన ప్రాతంగా ఉందని, వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా దీనిని అమెరికా రక్షణకు వ్యూహాత్మక ఆయుధ మోహరింపు కేంద్రంగా మార్చుకుంటానని అనేక నెలలు ట్రంప్ బహిరంగ ప్రకటనలు చేశారు.ఒప్పందం తర్వాత ఎలాంటి పూర్తిపాఠాన్నీ విడుదల చేయలేదు.గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని ట్రంప్ లేవనెత్తిన బెదిరింపులతో చెలరేగిన దౌత్యపరమైన వివాదాన్ని పరిష్కరిస్తూ ఒప్పందం కుదిరింది. పాక్షిక స్వయంప్రతిపత్తిగల డేనిష్ భూభాగం గ్రీన్‌లాండ్ భద్రత, ఇతర అవసరాలకు సంబంధించి ఈ ఒప్పందం ద్వారా శాశ్వత నియంత్రణ వచ్చిందని ట్రంప్ అన్నారు.ఈ ఒప్పందాన్ని డెన్మార్క్,గ్రీన్‌లాండ్ పాలకులు స్వాగతించారు. ''ఇకమీదట శత్రుదేశాలు మా స్పష్టమైన,లిఖితపూర్వక అనుమతి లేకుండా ఎలాంటి సైనిక కార్యకలాపాలు సాగించే దుస్సాహసానికి పాల్పడలేవు,ఈ మేరకు ఒప్పందంలో ఒక నిబంధన జోడించాం'' అని ఎక్స్ వేదికగా ట్రంప్ చెప్పారు.ఈ ఒప్పందంవల్ల అమెరికాకు ఎలాంటి ఖర్చూ ఉండదని,గ్రీన్‌లాండ్ భద్రత,రక్షణకు సంబంధించి ఏం చేయాలన్నా అమెరికాకు ఈ ఒప్పందం పూర్తి అధికారాలు ఇస్తుందని చెప్పారు.గ్రీన్‌లాండ్ ద్వీపం భౌగోళికంగా ఉత్తర అమెరికా భూభాగంలో ఉన్నప్పటికీ సాంస్కృతికంగా యూరప్‌తోనే సంపూర్ణ అనుబంధం కలిగి ఉంది. అంటార్కిటికా తర్వాత అత్యధికంగా భూమి ఉపరితం అంతా ఐస్‌తో పేరుకుపోయి ఉంటుంది.మూడువంతుల భూభాగం మంచుగడ్డలతో నిండి ఉంటుంది.

# త్వరలో ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో ఉన్న 64 కాలనీల్లోని 44 కాలనీల సమస్యను పరిష్కరించామని తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఎల్‌బి నగర్ నియోజకవర్గ ప్రజలకు 118 జీఓ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చడం జరిగిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏ పార్టీవారు ప్రాతినిధ్యం వహిస్తున్నా తాము బేషజాలకు పోకుండా ఇక్కడి 44 కాలనీల సమస్యలపై కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులున్నా ఇప్పుడు వాటిని నెల రోజులలోగా పరిష్కరించి ఇళ్లను రెగ్యులరైజ్ చేస్తామని, ఎవరి ఇళ్లు కూల్చదని స్పష్టం చేశారు. జీవో 118 సహకారంతో మేడ్చల్, రంగారెడ్డి జిల్లాలోని మరికొంత మందికి కూడా నెలలోగా సమస్య పరిష్కరిస్తామని ప్రకటించారు. ఈ ప్రాంత కాలనీలు చాలా కాలం నుంచి 22ఎలో ఉన్నాయని వివరిస్తూ 22ఎ కు సంబంధించి త్వరలో ఈ ప్రభుత్వం తీపి కబురు చెప్పనుందని తెలిపారు. మరో వారం రోజుల్లో సమస్య పరిష్కరించే విధంగా ప్రభుత్వ ఆదేశాలు రానున్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో రిజిస్ట్రేషన్ సమస్య, దరఖాస్తు చేసుకోని వారి సమస్యను పరిష్కరించేందుకు ఈ వేదికగా ఆదేశాలు ఇస్తున్నామని తెలిపారు. మరో 45 రోజుల్లో పూర్తిస్థాయిలో భూసమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు డి.సుధీర్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపి, ఎల్ బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# లోటు వర్షపాతం

(మొదటి పేజీ తరువాయి)

రాజస్థాన్‌లోని మరికొన్ని ప్రాంతాలు, అలాగే పంజాబ్, సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాల నుండి కూడా రుతుపవనాలు ఉపసంహరించుకోవడానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని ఆ శాఖ పేర్కొంది. 'సాధారణంగా సెప్టెంబర్ 17న జరగాల్సిన ఈ ప్రక్రియ, ఈ ఏడాది సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాల నుండి నైరుతి రుతుపవనాల ఉపసంహరణతో మొదలైంది' అని ఐఎండి ఒక ప్రకటనలో తెలిపింది. ఐఎండి గణాంకాల ప్రకారం ఆగస్టు 31న విడుదల చేసిన నెలవారీ అంచనాలో గత నెలలో దేశవ్యాప్తంగా 213.3 మి.మీ వర్షపాతం నమోదైందని ఐఎండి పేర్కొంది. 2001 తర్వాత ఆగస్టు నెలలో నమోదైన వర్షపాతంలో ఇది ఏడవ అత్యల్ప స్థాయి. ఈ రుతుపవన సీజన్‌లో ఇప్పటివరకు జులై నెలలో మాత్రమే దేశ వ్యాప్తంగా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఆ నెలలో సగటు వర్షపాతం 280.5 మి.మీ కాగా, 283.3 మి.మీ వర్షం కురిసింది. జూన్‌లో మొత్తం వర్షపాత లోటు 35 శాతంగా ఉంది. ఆ నెలలో సగటు వర్షపాతం 165 మి.మీ ఉండాలి, కానీ కేవలం 106.8 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. ఈ రుతుపవన సీజన్‌లో వర్షపాత లోటుకు ఒక ప్రధాన కారణం జూన్ నెలలో భూమధ్యరేఖకు సమీపంలోని పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో 'ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడటం. 'ఎల్ నినో' అనేది 'ఎల్ నినో సదరన్ ఆసిలేషన్' (ఇఎన్ఎస్ఒ) అనే వాతావరణ ప్రక్రియలోని మూడు దశలలో ఒకటి. మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో సముద్ర ఉష్ణోగ్రతలలో మార్పులు, వాటికి అనుగుణంగా వాతావరణంలో వచ్చే హెచ్చుతగ్గులు దీని ప్రధాన లక్షణాలు. ఎల్ నినో భూమిపై ఉష్ణోగ్రతలను పెంచే ప్రభావాన్ని కలిగి ఉండి, భారతదేశంలో తక్కువ వర్షపాతానికి కారణమవుతుందని భావిస్తారు. దీనికి విరుద్ధమైన దశ అయిన 'లా నినా' సాధారణంగా చల్లని వాతావరణ పరిస్థితులకు దారితీస్తుంది. ఇఎన్ఎస్ఒలో ఒక తటస్థ దశ కూడా ఉంటుంది.

# మెగా జాబ్‌మేళా

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగాలు పొందిన యువతకు శాసనసభ శాసనమండలి సభాపతులు గడ్డం ప్రసాద్, ఐటి మంత్రివర్యులు శ్రీధర్‌బాబు, గుత్తా సుఖేందర్‌రెడ్డిలతో కలిసి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రెండు నియోజకవర్గాల ప్రజలు తన కుటుంబ సభ్యులని, వారికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేనన్నారు. గ్రామీణ ప్రాంతాలలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు పొందేందుకు ఒక వేదిక ఈ జాబ్‌మేళా అని గత సంవత్సరం హుజూర్‌నగర్‌లో ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఫ్యాక్స్‌ఖాన్ ప్రముఖ కంపెనీతో పాటు రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలోని ప్రతి కంపెనీని కూడా ఇక్కడకు ఆహ్వానించామన్నారు. 350 కంపెనీలు ఇక్కడికి రాగా 30వేల మందికి పైగా ఉద్యోగ అవకాశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఇంతపెద్ద ఎత్తున జరిగిన జాబ్‌మేళా ఇదేనని అభివర్ణించారు. ఇక్కడ 4వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయన్నారు. తాము పదవులలో ఉన్న లేకపోయినా ఇక్కడి ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు కృషి చేస్తూనే ఉంటామన్నారు. శాసనసభ మండలి సభాపతులు గడ్డం ప్రసాద్, గుత్తా సుఖేందర్‌రెడ్డి లు మాట్లాడుతూ కనీవిని ఎరగని రీతిలో ఈ జాబ్‌మేళా నిర్వహించినందుకు మంత్రి ఉత్తమ్ పద్మావతి దంపతులను అభినందిస్తున్నామన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం 60వేల ఉద్యోగాలు భర్తీ చేసి పలు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేస్తుందన్నారు. కృత్రిమ మేధకు ధీటుగా యువత అప్‌డేట్ కావాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాఅభివృద్ధికి మంత్రి ఉత్తమ్ పదివేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పద్మావతి అధ్యక్షతన వహించిన ఈసమావేశంలో ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఆసియా క్రీడలు ఆరంభం

## త్రివర్ణ పతాకం చేతబూని భారత బృందం కవాతు




క్రీడాలోకం అమితాసక్తి కనబరుస్తున్న ఆసియా క్రీడలు ప్రారంభమయ్యాయి. అరకొర వసతులపై అసంతృప్తుల నడుమ జపాన్‌లోని నగోయలో శనివారం అట్టహాసంగా ఆరంభ వేడుకలు జరిగాయి. ఈ సెరొమొనీలో ఒలింపిక్ విజేత మనూ భాకర్ , కబడ్డీ ఆటగాడు పవన్ షెహ్రావత్‌లు భారత బృందానికి నేతృత్వం వహించారు. వీరిద్దరూ పతాకధారులుగా ముందు నడువగా.. అథ్లెటిక్స్ బృందం మువ్వన్నెల జెండాను చేబూని కవాతు చేసింది. ఆద్యంతం కన్నులపండువను తలపించిన ఈ దృశ్యం అనంతరం పతక వేట షురూ కానుంది. జపాన్ వేదికగా 20వ ఆసియా క్రీడలు మొదలయ్యాయి. ఆసియాలోని పలు దేశాల అథ్లెట్లు పతక వేటకు సిద్ధమవ్వగా శనివారం సంబురంగా ఆరంభ వేడుక నిర్వహించారు. మిజుహో పార్క్ అథ్లెటిక్స్ స్టేడియంలో.. ఒలింపిక్ విజేత మనూ భాకర్, కబడ్డీ ఆటగాడు పవన్ షెహ్రావత్లు ఈ సెరెమొనీలో భారత బృందానికి పతాకధారులుగా వ్యవహరించారు. షూటర్ మనూతో షాట్పుటర్ తజిందర్పాల్ తూర్ మువ్వన్నెల జెండా చేబూని ముందు నడవాల్సింది. కానీ, అతడికి అధికారికంగా జెర్సీ అందడం ఆలస్యం కావడంతో ఆమెతో కలిసి పవన్ భారత దళానికి నేతృత్వం వహించాడు. ఆసియా క్రీడల ఆరంభం సందర్భంగా.. నగోయలో వసతుల కొరత, అసౌకర్యాలను పక్కనపెట్టేసి పతకంపై దృష్టి సారించాలని మనూ భాకర్ భారత బృందానికి సూచించింది. గత సీజన్లో మాదిరిగానే ఈసారి కూడా వందకుపైగా పతకాలు లక్ష్యంగా మన అథ్లెట్లు పోటీ పడనున్నారు. 20వ ఆసియా క్రీడల్లో ఇండియా నుంచి 36 క్రీడా విభాగాల్లో.. 499 మంది పోటీ పడుతున్నారు. అక్టోబర్ 4వ తేదీ వరకూ ఈ మెగా టోర్నీ జరుగనుంది.

# భారత జట్టులో 'టఫ్ బ్యాటర్' అతడే

## ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్



భారత క్రికెటర్లలో ఎవరికి బౌలింగ్ చేయడం కష్టం? అని అడగ్గానే.. విరాట్‌కోహ్లీ, రోహిత్‌శర్మ అని టక్కున చెప్పేస్తారు ఎవరైనా. కానీ, ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మాత్రం వీరిద్దరు కాదంటున్నాడు. ఇటీవల కమిన్స్ మాట్లాడుతూ తనకు సవాల్ విసిరిన భారత క్రికెటర్ పేరును ఇటీవల వెల్లడించాడు. తన సుదీర్ఘ కెరీర్లో పలుదేశాల నుంచి సవాల్ విసిరిన ఆటగాళ్ల గురించి చెప్పిన ఆసీస్ సారథి.. టీమిండియాతో మ్యాచుల్లో విరాట్, హిట్‌మాన్ కాకుండా తనను ఛతేశ్వర్ పుజారా ఎక్కువగా ఇబ్బంది పెట్టాడని తెలిపాడు. భారత క్రికెట్‌లో దిగ్గజ ఆటగాళ్లు చాలామందే ఉన్నారు. వరల్డ్‌క్లాస్ బ్యాటింగ్ విన్యాసాలతో మేటి బౌలర్లను గడగడ వణికించిన వారికి కొదవలేదు. అయితే.. వీరిలో టన్నుల కొద్ది పరుగులు సాధించిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ అందరికంటే కాస్త ముందు వరసలో ఉంటారనుకుంటాం. ఎందరో బౌలర్లపై పైచేయి సాధించిన ఈ ఇద్దరు తనను అంతగా ఇబ్బంది పెట్టలేదని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అంటున్నాడు. భారత్ విషయానికొస్తే.. తనను అత్యంత కష్టపెట్టింది మాత్రం ఛతేశ్వర్ పుజారా అని కమిన్స్ అన్నాడు. తాజాగా ప్రైమ్‌వీడియో స్పోర్ట్స్ అంజ్లో మాట్లాడిన ప్యాటీ .. పుజారా పట్టుదల, అంకితభావం అమోఘమని, అందుకే అతడిని ఔట్ చేయడం కష్టంగా తోచేదని పేర్కొన్నాడు. టీమిండియాలో పుజారాను ఔట్ చేయడం చాలా కష్టం. అతడు నా వ్యూహాలను చిత్తు చేసేవాడు. అతడు అనుకుంటే సంతోషంగా 100 డాట్ బాల్స్ ఆడేవాడు. అంతేతప్ప ప్రత్యర్థి బౌలర్లకు ఒక్క అవకా శం కూడా ఇచ్చేవాడు కాదు అని కమిన్స్ వెల్లడించాడు.

**కుక్, డివిలియర్స్...** అలానే వివిధ దేశాల జట్లలో తనకు సవాల్ విసిరిన, తాను ఫిదా అయిన క్రికెటర్ల పేర్లను ఆసీస్ కెప్టెన్ ఈ వీడియోలో చెప్పాడు. మూడు ఫార్మాట్ల కెరీర్లో బ్రెండన్ మెక్కల్లమ్(న్యూజిలాండ్), తిలకరత్నే దిల్షాన్ (శ్రీలంక), అలెస్టర్ కుక్(ఇంగ్లండ్), ఏబీ డివిలియర్స్(దక్షిణాఫ్రికా), క్రిస్ గేల్ (వెస్టిండీస్)లు తనను ఇబ్బంది పెట్టారని కమిన్స్ వివరించాడు. ఇక పాకిస్థాన్ మాజీ స్పిన్నర్ సయీద్ అజ్మల్ ఓవర్లో ఆఖరి బంతికి తాను క్లీన్బౌల్ అవ్వడం తనకింకా గుర్తుందని కమిన్స్ అన్నాడు. అక్టోబర్ 9న దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్కు సిద్ధమవుతున్నాడీ వెటరన్ పేసర్.




## ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్ఛేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్: ప్రారంభం 74,781.76 పాయింట్లు. ముగింపు 74,294.96 పాయింట్లు. నష్టం 486.80 పాయింట్లు.
జాతీయ స్టాక్ ఎక్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఇ)లో నిఫ్టీ: ప్రారంభం 23,398.10 పాయింట్లు. ముగింపు 23,346.40 పాయింట్లు. నష్టం 51.70 పాయింట్లు.

(స్టాక్ మారెట్లు వరుసగా ఆరో వారం కూడా నష్టాల్లో ముగిశాయి. అయితే, గతవారంతో పోలిస్తే, ఈ వారం నష్టం వేల పాయింట్ల నుంచి వందల పాయింట్లలోకి తగ్గింది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు ఇప్పటికీ తీవ్ర ప్రభావాన్ని చవిచూస్తునే ఉన్నాయి. అయితే, క్రమంగా కోలుకోవడం శుభపరిణామం)

# రష్యా చమురుపై అమెరికా ఒత్తిడి




రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి కల్పించే చట్టం ఇప్పుడు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త అనిశ్చితిని తెచ్చింది. సెప్టెంబర్ 18న ఈ చట్టంపై సంతకం జరిగింది. అయితే 100 శాతం సుంకం వెంటనే అమలవుతుందని అర్థం కాదు. దాన్ని ఎప్పుడు, ఏ దేశాలపై ఎంత మేరకు అమలు చేయాలనే విషయంలో అమెరికా ప్రభుత్వానిదే నిర్ణయాధికారం. భారతదేశానికి ఈ పరిణామం ముఖ్యంగా చమురు దిగుమతుల కారణంగా ప్రాధాన్యం సంతరించుకుంది. దేశీయ చమురు అవసరాల్లో 88 శాతానికి పైగా దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌కు రష్యా ప్రస్తుతం ప్రధాన సరఫరాదారుగా ఉంది. 2026 జూన్ మాసంలో భారత్ దిగుమతి చేసుకున్న మొత్తం ముడి చమురులో రష్యా వాటా దాదాపు 49 శాతానికి చేరింది. జులైలో అది 50 శాతాన్ని దాటినట్లు వివిధ మార్కెట్ అంచనాలు సూచిస్తున్నాయి. ఇక్కడ సమస్య కేవలం అమెరికాకు ఎగుమతి చేసే వస్తువులపై అదనపు సుంకంతో ఆగిపోదు. భారత్‌పై అమెరికా భారీ సుంకం విధిస్తే, అమెరికా మార్కెట్‌పై ఆధారపడే భారత ఎగుమతిదారుల వ్యయాలు, ధరల పోటీతత్వం, ఆర్డర్లు, ఉపాధిపై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, రసాయనాలు, ఔషధాలు, ఆభరణాలు వంటి అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసే రంగాలు తమ ధరల వ్యూహాన్ని పునఃపరిశీలించాల్సి రావచ్చు. అయితే వాస్తవ ప్రభావం సుంకం అమలు విధానం, మినహాయింపులు, కాలపరిమితి వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు రష్యన్ చమురును వేగంగా తగ్గించి ప్రత్యామ్నాయ సరఫరాదారుల నుంచి కొనుగోలు చేస్తే దేశీయ ఇంధన వ్యయంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. ప్రపంచ చమురు ధరలు కూడా సరఫరా పరిస్థితులు, పశ్చిమాసియా పరిణామాలు వంటి అనేక అంశాలపై ఆధారపడతాయి. కాబట్టి పెట్రోల్, డీజిల్ ధరలు ఎంత పెరుగుతాయో ఇప్పుడే ఖచ్చితంగా చెప్పడం సాధ్యం కాదు. ఇలాంటి సమయంలో ప్రభుత్వానికి ఎదురయ్యే ప్రధాన ఆర్థిక సవాలు పారదర్శకమైన ప్రమాద అంచనా.

# ఎండిఆర్‌పై ప్రకంపనలు




యుపిఐ చెల్లింపులపై కొత్తగా మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండిఆర్) విధించే నిర్ణయం ప్రకంపనలు సృష్టిస్తున్నది. రాజకీయ, వ్యాపార వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. అక్టోబర్ 15, 2026 నుంచి రూ.2,000కు మించిన కొన్ని వ్యక్తినుంచివ్యాపారి (పి2ఎం) యుపిఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండిఆర్ అమల్లోకి వస్తుంది. రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ లావాదేవీలకు ఈ రుసుము గరిష్ఠంగా రూ.300గా ఉంటుంది. వ్యక్తినుంచివ్యక్తికి జరిగే యుపిఐ బదిలీలకు ఈ ఛార్జీ వర్తించదు. రూ.2,000 వరకు జరిగే వ్యాపారి చెల్లింపుల్లో కూడా ఎక్కువ భాగం ఉచితంగానే కొనసాగుతాయి. ప్రభుత్వ వివరణ ప్రకారం ఎండిఆర్ అనేది పన్ను కాదు. చెల్లింపు వ్యవస్థలో పాల్గొనే బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, యుపిఐ యాప్‌లు వంటి సంస్థల మధ్య ఈ మొత్తాన్ని పంచుకుంటారు. యుపిఐ మౌలిక వసతులు, సైబర్ భద్రత, వ్యవస్థ విస్తరణ వంటి ఖర్చులకు దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం కల్పించడమే ఈ మార్పు ఉద్దేశమని ప్రభుత్వం చెబుతోంది. దాదాపు 96 శాతం పి2ఎం లావాదేవీలు ఈ మార్పు ప్రభావానికి దూరంగా ఉంటాయని కూడా ప్రభుత్వం వెల్లడించింది. అయితే వ్యాపార వర్గాలు, కొన్ని రాజకీయ పార్టీలు ఈ నిర్ణయాన్ని విమర్శిస్తున్నాయి. అధిక విలువ కలిగిన లావాదేవీలపై ఖర్చు పెరగడం వల్ల చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై అదనపు భారం పడుతుందని వారి వాదన. ఈ ఖర్చును వ్యాపారులు స్వయంగా భరిస్తారా, లేక ధరలను పెంచి పరోక్షంగా వినియోగదారులపై మోపుతారా అనే ప్రశ్న కూడా ముందుకు వస్తోంది. ప్రభుత్వం మాత్రం ఎండిఆర్ భారాన్ని వినియోగదారుల నుంచి వసూలు చేయకుండా పర్యవేక్షణ చర్యలు తీసుకుంటామని చెబుతోంది. ఈ నిర్ణయంపై కొన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. యుపిఐని విస్తృతంగా ప్రోత్సహించిన తర్వాత ఇప్పుడు దానిపై ఛార్జీలు విధించడం డిజిటల్ చెల్లింపుల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని ప్రభావితం చేయవచ్చని విమర్శకులు అంటున్నారు. మరోవైపు, యుపిఐ వినియోగం భారీగా పెరిగిన నేపథ్యంలో దాని నిర్వహణ, భద్రత, విస్తరణకు స్థిరమైన ఆదాయ నమూనా అవసరమని అధికార వర్గాలు వివరిస్తున్నాయి. అందువల్ల అసలు చర్చ 0.4 శాతం రుసుము పరిమాణం గురించి మాత్రమే కాకుండా, దేశంలోని విస్తృత డిజిటల్ చెల్లింపుల మౌలిక వ్యవస్థ ఖర్చును భవిష్యత్తులో ఎవరు భరించాలి అనే అంశం చుట్టూ కూడా సాగుతోంది.

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర(సుమారుగా)
24 క్యారెట్లు: రూ.1,54,530
22 క్యారెట్లు: రూ.1,41,550
18 క్యారెట్లు: రూ. 1,15,900
(గమనిక: నగరం, జ్యువెలరీ సంస్థ, మేకింగ్ ఛార్జీలు, జిఎస్‌టిలను బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు).

# హనుమకొండలో ఎఐఎస్‌ఎఫ్ 90వ వార్షికోత్సవం

## విజయవంతం చేయాలని తక్కళ్లపల్లి పిలుపు




ప్రజాపక్షం/హనుమకొండ : అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, హనుమకొండ వేదికగా ఈనెల 28,29,30 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి వార్షికోత్సవ వేడుకలను విద్యార్థి లోకం విజయవంతం చేయాలని ఎఐఎస్‌ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు కోరారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఏదునూరి వెంకట్రాజం అధ్యక్షతన ఎఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవాల సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ హనుమకొండ వేదికగా రాష్ట్రస్థాయి ఎఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. దేశంలో విద్యార్థి హక్కులు, ఉచిత నాణ్యమైన విద్య, నిరుద్యోగ నిర్మూలన, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటాలు చేస్తున్న ఎఐఎస్‌ఎఫ్ చరిత్రలో ఈ 90వ వార్షికోత్సవం ఎంతో చారిత్రాత్మకమైనదని తెలిపారు. విద్యార్థులు, యువకులు, ప్రగతిశీలవాదులు, విద్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వేడుకలను విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. రాష్ట్ర, జాతీయ నాయకులు ఈ వేడుకలకు హాజరై దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు కర్రె బిక్షపతి, సిరబోయిన కరుణాకర్, తోట బిక్షపతి, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, ఉట్కూరు రాములు, కర్రె లక్ష్మణ్, బత్తిని సదానందం, ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర యూనివర్సిటీల ఇంచార్జ్ రెహమాన్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉట్కూరు ప్రణీత్‌గౌడ్, భాషబోయిన సంతోష్, దిడ్డి పార్థసారథి, ల్యాదెల్ల శరత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ 90 వార్షికోత్సవాల స్ఫూర్తి బ్యానర్‌ను జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు.




# పేదలకు విద్యను దూరం చేస్తున్న పాలకులు

## ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్

### ఘనంగా ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా 28వ మహాసభలు




ప్రజాపక్షం/ఖమ్మం : దేశంలో విద్య కాషాయికరణ ప్రమాదంలో ఉందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ తెలిపారు. విద్యను కాషాయికరణ చేయడంతో పాటు చరిత్రను వక్రీకరించేందుకు ప్రయత్నం జరుగుతుందని పసి మెదళ్లలో మతోన్మాదాన్ని నింపుతున్నారని ఆయన ఆరోపించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఖమ్మం జిల్లా 28వ మహాసభలు శనివారం స్థానిక ఐఎంఎ హాల్‌లో జరిగాయి. మహాసభలను పురస్కరించుకుని పాత సిపిఐ కార్యాలయం నెహ్రూనగర్ నుండి పాత బస్టాండ్ మయూరిసెంటర్ మీదుగా పోటు ప్రసాద్‌నగర్ (ఐఎంఎ హాల్) వరకు విద్యార్థి ప్రదర్శన నిర్వహించారు. మహాసభలను పురస్కరించుకుని ఎఐఎస్‌ఎఫ్ పతాకాన్ని మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ ఆవిష్కరించారు. మడుపల్లి లక్ష్మణ్, బుర్రా మనోజ్, అమృత అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభల్లో పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ పాలకులు అవలంభిస్తున్న విధానాలు పేదలకు విద్యకు దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యకు నిధుల కేటాయింపు పూర్తిగా తగ్గిపోయిందని, కేటాయించిన బడ్జెట్‌ను కూడా ఖర్చు చేయడం లేదని లక్ష్మణ్ ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే విద్యకు అత్యంత ప్రాధన్యతనిస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి పాలన ఆ దిశగా సాగడం లేదన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ దేశంలో విద్యారంగం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుందని, పోరాటాలు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపుతాయన్నారు. విద్య అంగడి వస్తువుగా మారిందని కొనుగోలు శక్తి ఉన్న వారికే విద్య అందుబాటులో ఉందన్నారు. ఈ విధానానికి వ్యతిరేకంగా ఎఐఎస్‌ఎఫ్ నేతృత్వంలో పోరాడాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. మహాసభల్లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఇన్‌చార్జి రావిశివరామకృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బత్తినేని నీరజ, ఏపూరి లతాదేవి, నాయకులు మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, చింతల రమేష్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.




## బీడీ కార్మికులకు కనీస పెన్షన్

# రూ.5వేలు వెంటనే అమలు చేయాలి

### సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ ప్రధాన కార్యదర్శి రాములు డిమాండ్

ప్రజాపక్షం/కోరుట్ల : బీడీ పరిశ్రమలలో పనిచేసే బీడీ కార్మికులకు కనీస పెన్షన్ రూ.5వేలకు పెంచాలని బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.గోవర్ధన్, ప్రధానకార్యదర్శి సుతారి రాములు డిమాండ్ చేశారు. శనివారం బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మండల కేంద్రంలో జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బీడీ కార్మికులకు పెన్షన్ పెంపు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీడీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జీవన భృతి 2016 కొరకు 2014 సంవత్సరం కటాఫ్ డేటును ఎత్తివేసి ప్రావిడెంట్ ఫండ్ కార్డు ఉన్న బీడీ కార్మికులందరికీ అమలు చేయాలని కోరారు. బీడీ కార్మికులకు నెలకు 26రోజుల పనిదినాలు కల్పించి, నాణ్యమైన తునికాకును సరఫరా చేయాలని, బీడీ కార్మిక సంక్షేమ ఆస్పత్రి ద్వారా ఉచిత మందులు సరఫరా చేయాలని, ఇఎస్‌ఐ హాస్పిటల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులకు 2010లో నిలిపివేసిన కనీస వేతనాల జీవో 41ను అమలు చేయాలని, దీనికొరకు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తామని వివరించారు. సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎండి మౌలానా, ఉపాధ్యక్షులు రంగారెడ్డి, ఎండి.ముక్రం, రాష్ట్ర సహాయ కార్యదర్శులు భాను, అయ్యవారిల లక్ష్మణ్, కెవి అనసూయ, గంగాధర్, మహమ్మద్ అలీ, జక్కు రాజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇవ్వకుండా

# విద్యార్థుల జీవితాలతో చెలగాటం




### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

ప్రజాపక్షం/కరీంనగర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తామని చెప్పి, విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, కమిషన్ల కోసమే ఫీజు బకాయిలు ఇవ్వకుండా ఆపుతున్నారని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆరోపించారు. ఎఐఎస్‌ఎఫ్ కరీంనగర్ జిల్లా19వమహాసభ జిల్లా అధ్యక్షుడు రామారావు వెంకటేష్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఎఐఎస్‌ఎఫ్ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్ జెండా ఎగరవేశారు. సభకు కసిరెడ్డి మణికంఠరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విలీనం చేయడం ద్వారా సాంకేతిక విద్య నిర్వీర్యం అవుతుందని, సిఎం రేవంత్‌రెడ్డి పాలిటెక్నిక్ కళాశాలల భవనాలను, స్థలాలను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను మొత్తం వెంటనే విడుదల చేయాలని, స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విలీన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల ఆగ్రహానికి ప్రభుత్వం బలికాక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, మామిడిపల్లి హేమంత్, నూనావత్ శ్రీనివాస నాయక్, కనకం సాగర్, కేశబోయిన రాము, లద్దునూరి విష్ణు, గర్ల్స్ వింగ్ కన్వీనర్ జోష్నా, అనోష్, బోయినీ విష్ణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## హక్కులు, సామాజిక న్యాయం

# పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

### దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్



ప్రజాపక్షం/ఖిలా వరంగల్ : భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు దేశంలో కుట్రలు జరుగుతున్నాయని, రాజ్యాంగం జోలికి వస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ హెచ్చరించారు. రాజ్యాంగం ప్రజల హక్కులు, సామాజిక న్యాయానికి రక్షణగా ఉందని, దాని పరిరక్షణకు దళితులు, పేదలు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ జిల్లాకేంద్రంలోని తమ్మెర భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు జన్ను రవి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు అన్నివర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. దళితుల పట్ల వివక్షకు సంబంధించిన ఘటనలు, దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాసిమియా మాట్లాడుతూ తెలంగాణలో దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల రవి మాట్లాడుతూ దళితుల అభివృద్ధిని సంక్షేమ పథకాలకే పరిమితం చేయకుండా భూమి, ఇల్లు, ఉపాధి అనే మూడు అంశాలపై సమగ్ర విధానం రూపొందించాలని కోరారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్ మాట్లాడుతూ భూమిలేని దళిత కుటుంబాలకు భూమి, ఇల్లు లేని వారికి గృహ వసతి, యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి ప్రత్యేక అభివృద్ధి నిధుల వినియోగంపై పారదర్శక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘి ఎలేందర్ కోరారు. సమావేశంలో సంఘం నాయకులు జాన్‌పాల్, రాచర్ల రాజేందర్, జన్ను హరిబాబు, సిలివేరు రాజేష్, వేల్పుల బాబు, ఆరోగ్యం, తదితరులు పాల్గొన్నారు.



## డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తరహాలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాటకాలు

● బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను మభ్యపెట్టేందుకు డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తరహా వినోదాత్మక నాటకాలు ఆడుతున్నాయని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం బిజెపి నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, శ్రీధర్, బాలేష్‌లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాల ఎనిమిది నెలలు దాటుతున్నా, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై శాసనసభలో చర్చించడం లేదన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం డెమొలిషన్లు, డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. 22ఎ నిబంధనలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యుత్ కోతలు, పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యల నుంచి తప్పించుకునేందుకే అసెంబ్లీని ఒక వినోద కేంద్రంగా మార్చారన్నారు. శాసనసభలో ప్రతిపక్ష బిఆర్‌ఎస్ నామమాత్రపు పాత్రకే పరిమితమైందన్నారు. ఇదే సమయంలో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి బిజెపి నాయకులపై, బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఎంపి హోదాలో ఉండి సభ్యత మరచి మాట్లాడటం సరికాదని, ఆయన ఎంపిగా తక్కువ, పిఆర్‌ఓగా ఎక్కువ ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. మునగనూరు గ్రామంలోని సర్వే నెంబరు 44/1లోని దాదాపు రూ.300 కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల పేరిట మార్చారని, దీని వెనుక 'అనుముల, చామల' బ్రదర్స్ హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయన్నారు.

## జిఓ 97పై సమగ్ర సమీక్ష పూర్తయ్యే వరకు ఎలాంటి చర్యలు వద్దు



● కెకె కమిటీకి టిఆర్‌ఎస్ అధ్యయన కమిటీ నివేదిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో 97 కారణంగా పాలిటెక్నిక్ విద్యార్థులకు, విద్యావ్యవస్థకు జరిగే నష్టాలపై అధ్యయనం చేసేందుకు తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత నియమించిన అధ్యయన కమిటీ తమ నివేదికను కమిటీ చైర్మన్ కె.కేశవరావుకు అందజేసింది. దాదాపు పది రోజుల పాటు పాలిటెక్నిక్ విద్యార్థులు, విద్యారంగ ప్రముఖులతో చర్చించి రూపొందించిన ఈ నివేదికలో జి.ఓ వల్ల కలిగే నష్టాలను స్పష్టంగా పొందుపరిచారు. ఈ అంశంపై సమగ్ర సమీక్ష పూర్తయ్యే వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరుతూ పలు కీలక సిఫార్సులు చేశారు. సమీక్ష ముగిసే వరకు ప్రస్తుతం ఉన్న సాంకేతిక విద్యా విధానం, ఎస్‌బిటిఈటి వ్యవస్థ పరిధిలోనే పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది. అలాగే డిప్లొమా అర్హతల గుర్తింపుతో పాటు ఈసిఈటి, లాటరల్ ఎంట్రీ సహా ఉన్నత విద్య మార్గాలను రక్షిస్తామని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరింది. పాలిటెక్నిక్ విద్యను సామాన్యులకు అందుబాటులో ఉంచుతూ, ఫీజుల పెంపు లేకుండా చూడాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రయోజనాలను యథాతథంగా కొనసాగించాలని స్పష్టం చేసింది. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రమోషన్లు, ఉద్యోగ భద్రతతో కూడిన సేవా రక్షణ కల్పించాలని, పాలిటెక్నిక్ ఆస్తులను వాణిజ్య, ప్రైవేట్ ప్రయోజనాలకు మళ్లించవద్దని సిఫార్సు చేసింది. నివేదిక సమర్పించిన వారిలో కమిటీ సభ్యులు నరేశ్ ప్రజాపతి, ధరణి రాణి, సురభి, వెంకటేశ్వర్ రావు, ఉదరి చంద్రమోహన్ గౌడ్, కోట్ల మహేందర్ రెడ్డి ఉన్నారు.

## కాంగ్రెస్ చేతకానితనం వల్లే.. సాగునీరు, విద్యుత్ ఉత్పత్తిలో ప్రభుత్వం విఫలం

బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉపనేత టి.హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు ప్రకృతి కారణంగా వచ్చినవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్లే ఏర్పడ్డాయని బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉపనేత టి.హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగునీరు, విద్యుత్ రంగాల్లో ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. కృష్ణా జలాల వినియోగంలో కాంగ్రెస్ పాలనలో అత్యంత తక్కువ వినియోగం నమోదైందన్నారు. శ్రీశైలం నుంచి 84 టిఎంసిల నీటిని వినియోగించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో చెప్పడం సరికాదని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా కేవలం 8 టిఎంసిల నీటినే ఎత్తిపోశారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. సుందిళ్ల బ్యారేజీల కాంక్రీట్ పటిష్టంగానే ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థలు స్పష్టం చేశాయని, మేడిగడ్డ వద్ద ఉన్న సమస్యను సాకుగా చూపి నీటి ఎత్తిపోతలను నిలిపివేయడం సరికాదన్నారు. మేడిగడ్డ వద్ద నీరు ప్రవహిస్తున్నప్పటికీ కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని తెలిపారు. దేవాదుల, ఎల్లంపల్లి ప్రాజెక్టుల్లోనూ ప్రభుత్వం పూర్తి స్థాయిలో నీటిని వినియోగించుకోవడం లేదన్నారు.విద్యుత్ రంగంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. బొగ్గు కొరత పేరుతో యాదాద్రి, భద్రాద్రి, కొత్తగూడెం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి నిలిపివేశారని, గత ప్రభుత్వం సంక్షోభ సమయంలోనూ 24 గంటల విద్యుత్ సరఫరా చేసిందన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామనే భయంతోనే బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు.

## మంత్రిని కలిసిన ఆటో సంఘాల జెఎసి



ఆటో మీటర్ చార్జీల పెంపు, కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటుపై చర్చ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఆటో సంఘాల జెఎసి నాయకులు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలిసి ఆటో కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు ఆటో మీటర్ కనీస చార్జీని రూ.40గా, ప్రతి కిలోమీటర్‌కు రూ.18గా నిర్ణయించాలని మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి, మీటర్ చార్జీల పెంపు నిర్ణయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. అదేవిధంగా ఆటో కార్మికుల కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు అంశంపైనా చర్చ జరిగింది. గతంలో ఆటో సంఘాలు జెఎసి చేసిన డిమాండ్లను త్వరలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు జెఎసి నాయకులు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన వారిలో బి.వెంకటేశం(ఎఐటియుసి), ఎ.సత్తిరెడ్డి(టిఎడిఎస్), ప్రవీణ్(టియుసిఐ), పి.యాదగిరి(టిఎన్‌టియుసి), ఎం.డి.మాజిద్ ఆజాద్(ఆటో యూనియన్), ఎం.ఎ.సలీం(టిఆర్‌టియు), ఎం.శ్రీనివాస్(ఎఐటియుసి) తదితర సంఘాల ప్రతినిధులు ఉన్నారు.

## ఈ నెలాఖరులోగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

● రెవెన్యూ, హౌసింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పనులు వేగవంతం చేసి, ఒక్క క్యూర్ పరిధిలోనే 26 ప్రాంతాల్లో 21 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం తన కార్యాలయం నుంచి రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్తి చేసిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఈ నెల 30వ తేదీలోగా పారదర్శకంగా డ్రా విధానంలో లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి, వారి వివరాలను ఆన్‌లైన్‌లో పోర్టల్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్న ప్రాంతానికి ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల పరిధిలో నివసించే అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని మంత్రి సూచించారు. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని వచ్చే నెలాఖరులోగా అన్ని సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అనర్హులు నివసిస్తే వారిని తొలగించాలని, ఇళ్లలో నివసించని వారికి తుది నోటీసులు జారీ చేసి కేటాయింపులు రద్దు చేయాలని కలెక్టర్లకు సూచించారు. నోటీసులకు స్పందించని వారి కేటాయింపులను రద్దు చేసి, వారి స్థానంలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. క్యూర్ పరిధిలో ఇంటి స్థలాలు కలిగి అర్హత సాధించిన దాదాపు తొమ్మిది వేల మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, మంజూరు పత్రాల పంపిణి ప్రక్రియను ఇన్‌చార్జ్ మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని వేగంగా పూర్తి చేయాలన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణితో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులోనూ పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు.

## రాష్ట్రంలో వచ్చే ఐదు రోజులు భారీ వర్షాలు

● పలు జిల్లాలకు భారీ నుంచి అతిభారీ వర్షాల హెచ్చరిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాలకు భారీ నుంచి అత్యంత భారీ వర్ష సూచనలతో పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల హెచ్చరికలను జారీ చేశారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీస్తాయన్నారు. కాగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఆదివారం, సోమవారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. సోమ, మంగళవారాల్లో భద్రాద్రి, ఖమ్మం, సూర్యాపేట, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు నమోదు అవుతాయన్నారు. మంగళవారం నుంచి వర్షాల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండగా, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, హైదరాబాద్, రంగారెడ్డి సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. బుధ, గురువారాల్లో వర్షాల తాకిడి మరింత తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం



● గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై సిఎస్ సంజయ్ జాజు సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గణేశ్ నిమజ్జనోత్సవానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, భాగ్యనగరంలో పరిస్థితిని, రాబోయే గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ఏర్పాట్లను సంజయ్ జాజు సమీక్షించారు. శనివారం సాయంత్రం బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసి (కమాండ కంట్రోల్ సెంటర్)ను సందర్శించిన ఆయన, అక్కడి నుంచి వివిధ ప్రాంతాల పరిస్థితులను పరిశీలించారు. బాలాపూర్ నుంచి ప్రారంభమయ్యే ప్రధాన శోభాయాత్ర మార్గాలతో పాటు నగరంలోని ఇతర కీలక మార్గాల్లో రహదారుల పరిస్థితి, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, నీరు నిలిచే ప్రాంతాల్లో చేపట్టిన ముందస్తు చర్యలను పరిశీలించారు. టిజిఐసిసిసి ఇన్‌చార్జ్ అధికారి కమల్ హాసన్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కొనసాగుతున్న రియల్‌టైమ్ పర్యవేక్షణ వ్యవస్థ, వివిధ ప్రాంతాల నుంచి అందుతున్న సమాచారం, శోభాయాత్ర మార్గాల్లో ఏర్పాటు చేసిన నిఘా వ్యవస్థపై సిఎస్‌కు వివరించారు. వర్షాల కారణంగా గణేశ్ శోభాయాత్రకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, అత్యవసర సేవలను సమన్వయంతో అందుబాటులో ఉంచాలని సిఎస్ స్పష్టం చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పరిస్థితులను రియల్‌టైమ్‌లో పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించేలా సమన్వయం చేసుకోవాలని సంజయ్ జాజు ఆదేశించారు. భారీ వర్షాలు, గణేశ్ నిమజ్జన శోభాయాత్ర నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సిఎస్ సంజయ్ జాజు స్పష్టం చేశారు.

## 5,500 మంది యువతకు 'ఉడాన్'.. భవిష్యత్ టెక్నాలజీపై శిక్షణ

● డెల్ టెక్నాలజీస్-టాస్క్ మధ్య కీలక ఒప్పందం..

● రాష్ట్రవ్యాప్తంగా 25 కేంద్రాల్లో మూడు నెలల శిక్షణ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతను భవిష్యత్ సాంకేతిక పరిజ్ఞానంలో నిపుణులుగా తీర్చిదిద్ది, శిక్షణను నేరుగా ఉపాధి అవకాశాలతో అనుసంధానించేందుకు మరో కీలక అడుగు పడింది. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్), డెల్ టెక్నాలజీస్ సంయుక్తంగా 'ఉడాన్' కార్యక్రమాన్ని రాష్ట్రంలో అమలు చేయనున్నాయి. ఈ మేరకు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఇరు సంస్థల మధ్య అవగాహన ఒప్పందంకుదిరింది. ఉడాన్ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 25 శిక్షణ కేంద్రాల్లో 5,500 మంది విద్యార్థులకు మూడు నెలలపాటు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. కృత్రిమ మేధ (ఎఐ), క్లౌడ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ తయారీ, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, డిజిటల్ నైపుణ్యాలతో పాటు పరిశ్రమల పరిచయం, ఉద్యోగ సాధనకు అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, యువతకు కూడా ఈ అవకాశాలను విస్తరించడంపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఉడాన్ లక్ష్యం కేవలం శిక్షణ ఇవ్వడంతో ముగియదని అధికారులు తెలిపారు. విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, చదువుతూనే పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా విద్యార్థులను సిద్ధం చేయనున్నారు. ఈ శిక్షణ కోసం ఐఐటి ఢిల్లీ రూపొందించిన కరిక్యులమ్‌ను వినియోగించనుండగా, డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారం అందించనుంది. జాతీయ స్థాయిలో డెల్ టెక్నాలజీస్, ఎఫ్ఐటిటి, ఐఐటి ఢిల్లీ, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, జనరేషన్ ఇండియా ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఉడాన్ కార్యక్రమం కొనసాగుతోంది. తెలంగాణలో ఈ కార్యక్రమాన్ని టాస్క్ ఆధ్వర్యంలో అమలు చేయనున్నారు.

యువతకు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలతో పాటు 21వ శతాబ్దపు ఉపాధి నైపుణ్యాలు, పారిశ్రామిక ఆలోచనా విధానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ భాగస్వామ్యం కొనసాగనుంది. శిక్షణ పొందిన వారి సంఖ్యకే పరిమితం కాకుండా ఉపాధి ఫలితాలను కొలిచేలా 'ట్రైనింగ్ టు ఎంప్లాయ్‌మెంట్' వ్యవస్థను బలోపేతం చేయాలని టాస్క్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమావేశంలో ఐటి అండ్ కమ్యూనికేషన్స్ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, , స్టేట్ కౌన్సిల్ సెక్రటరీ రామ్, టాస్క్ సిఇఒనితిన్ కుమార్ రెడ్డి, టాస్క్ సిఒఒ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సిఒఒ నిఖిల్, డెల్ టెక్నాలజీస్ సీనియర్ అకౌంట్ మేనేజర్ కె. కృష్ణ కిషోర్, ఎపిజెసి రీజినల్ సిఇఒ, హైదరాబాద్ సైట్ డైరెక్టర్ రమేష్ జంపుల తదితరులు పాల్గొన్నారు.

## మిలిటరీ ఆయుధాల కేసులో కీలక మలుపు

● జైలులో ఉన్న నిందితుడి కస్టడీకి బొల్లారం పోలీసుల పిటిషన్.. సోమవారం విచారించనున్న న్యాయస్థానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మిలిటరీ ఆయుధాల కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉండి ప్రస్తుతం జైలులో ఉన్న మాజీ మిలటరీ ఉద్యోగి ఉప్పుతొల్ల మల్లేష్ అలియాస్ రాజు (37)ని మరింత లోతుగా విచారించేందుకు బొల్లారం పోలీసులు కోర్టును ఆశ్రయించారు. నిందితుడిని తమ కస్టడీకి అప్పగించాలని కోరుతూ న్యాయస్థానంలో కస్టడీ పిటిషన్ దాఖలు చేశారు. మిలిటరీకి సంబంధించిన ఆయుధాలు అక్రమంగా నిందితుల చేతికి ఎలా వచ్చాయి..? వాటిని ఎక్కడి నుంచి సేకరించారు..? ఈ వ్యవహారంలో మరెవరెవరి ప్రమేయం ఉంది..? ఆయుధాల తరలింపు, విక్రయం లేదా సరఫరాలో ఇంకెవరైనా సహకరించారా..? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే కేసులో లభించిన ఆధారాలు, నిందితుల వాంగ్మూలాలు, ఆయుధాల మూలాలకు సంబంధించిన వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. కేసులో ప్రధానంగా గుర్తించిన నిందితుడు ప్రస్తుతం జైలులో ఉండటంతో అతడిని నేరుగా విచారించేందుకు పోలీసులకు అవకాశం లేకపోవడంతో కోర్టు అనుమతి కోరారు. కస్టడీ లభిస్తే నిందితుడిని విచారించి ఆయుధాల వ్యవహారానికి సంబంధించిన కీలక సమాచారాన్ని రాబట్టడంతో పాటు, కేసుతో సంబంధం ఉన్న ఇతర వ్యక్తుల వివరాలను తెలుసుకునే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ముఖ్యంగా మిలిటరీ ఆయుధాలు సాధారణ వ్యక్తుల చేతికి ఎలా చేరాయన్న అంశంపై దర్యాప్తు సంస్థలు దృష్టి సారించాయి. ఆయుధాల మూలం, వాటి చలామణి వెనుక ఉన్న నెట్‌వర్క్, నిందితులకు ఆయుధాలు అందించిన వ్యక్తులు, వాటిని ఎక్కడెక్కడికి తరలించారన్న కోణాల్లో విచారణ కొనసాగించే అవకాశం ఉంది. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై సోమవారం న్యాయస్థానం విచారణ జరపనుంది. కోర్టు కస్టడీకి అనుమతిస్తే నిందితుడిని నిర్ణీత కాలవ్యవధిలో పోలీసుల అదుపులోకి తీసుకుని విచారించనున్నారు. ఈ విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా కేసులో మరిన్ని అరెస్టులు, ఆయుధాల స్వాధీనం వంటి పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. కోర్టు నిర్ణయం తర్వాతే నిందితుడి పోలీసు కస్టడీపై స్పష్టత రానుంది.



## హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● డైట్, విద్యార్థుల భద్రతపై ప్రత్యేక నిఘా: మంత్రి అడ్లూరి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, భోజన నాణ్యత విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ స్పష్టం చేశారు. డైట్ అమలు పకడ్బందీగా జరిగేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని, జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో హాస్టళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌సి సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాలు, ఎస్‌సి గురుకుల విద్యాలయాల సంస్థ టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఇఐఎస్, ఎస్టీ గురుకుల విద్యాలయాల సంస్థ టిజిటి డబ్ల్యూర్‌ఇఐఎస్ ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లు, అలాగే దివ్యాంగుల సంక్షేమ శాఖ పరిధిలోని వసతి సదుపాయాలపై ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వంటశాలలు, భవనాల నిర్వహణ వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. నాణ్యమైన ఆహారం, పాలు, గుడ్లు, పండ్లు తదితర పోషకాహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు సకాలంలో అందుతున్నాయా అని ఆరా తీసిన మంత్రి.. పారిశుద్ధ్య సిబ్బందికి సముచిత వేతనాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని, దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన సహాయక పరికరాలు, వసతులు సకాలంలో అందించాలని సూచించారు. ఈ సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి శృతి ఓజా, ఎస్సీ అభివృద్ధి శాఖ కమిషనర్ (ఎఫ్ఎసి) శ్రీధర్, టిజిటిడబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి సీతాలక్ష్మి , టీజీఎస్ డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్ఏసీ) కంభంపాటి శారద, ఎస్‌సి అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, ఓఎస్‌డి వై.జె.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## బిసి గురుకులాలకు 5 ఎకరాల్లో సొంత భవనాలు



క్రీడా మైదానాలు, కంప్యూటర్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రణాళిక: వి.హనుమంతరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి గురుకుల విద్యాసంస్థల్లో మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని బిసి సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు తెలిపారు. ప్రతి గురుకులానికి కనీసం ఐదు ఎకరాల స్థలం కేటాయించి సొంత భవనాలు, క్రీడా మైదానాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సచివాలయంలో శనివారం బిసి సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో గురుకులాల విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, క్రీడలు, సిబ్బంది నియామకాలు, డిజిటల్ విద్య, ఉన్నత విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై చర్చించారు. ప్రతి గురుకులంలో క్రీడా మైదానం, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. బిసి విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని హనుమంతరావు సూచించారు. బిసి స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసి పోటీ పరీక్షలకు నాణ్యమైన శిక్షణ, స్టడీ మెటీరియల్ అందించాలన్నారు. బిసి సంక్షేమ కార్యక్రమాలు, గురుకులాల పనితీరు, విద్యార్థుల ప్రగతిపై ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాల మాయాదేవి, అదనపు కార్యదర్శి పద్మ, బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## జూరాల నీటిని వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జూరాల ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోని అమరచింత, ఆత్మకూర్ తదితర మండలాల్లో నీరందక ఎండిపోతున్న వానాకాలం పంటలను కాపాడేందుకు జూరాల నుంచి తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. డ్యామ్‌లో సుమారు 8 టిఎంసిల నీరు అందుబాటులో ఉన్నట్లు సమాచారం ఉందని, ఎండిపోతున్న పంటలకు తక్షణం 3 టిఎంసిల నీటిని విడుదల చేస్తే పంటలను కాపాడవచ్చని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ, కర్ణాటకల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటకతో చర్చించి మరో 2–3 టీఎంసీల నీటిని రప్పించాలని కోరారు.అలాగే విత్తనాలు, ఎరువుల పంపిణీకి కేంద్రం తీసుకొచ్చిన ఆన్‌లైన్ విధానంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోసం రైతు సంఘాల నాయకులు, స్థానిక రైతులు ఆందోళనలు చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతులతో కలిసి ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ట్రంప్ సుంకాలు, కార్పొరేట్ అనుకూల విధానాలు తిప్పికొట్టాలి

జూలకంటి రంగారెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ విధిస్తున్న సుంకాలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో సామ్రాజ్యవాద, కార్పొరేట్ శక్తులు రైతులు, కార్మికులు, సామాన్య ప్రజలపై సాగిస్తున్న దాడులను తిప్పికొట్టాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. నల్గొండలో నవంబర్ 15 నుంచి 18 వరకు జరగనున్న ఎఐకెఎస్ 36వ మహాసభల నేపథ్యంలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన రచయితలు, గాయకుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ సామ్రాజ్యవాద, కార్పొరేట్ శక్తుల దోపిడీకి వ్యతిరేకంగా, రైతాంగ హక్కుల పరిరక్షణ కోసం రచయితలు తమ సాహిత్యం ద్వారా, గాయకులు తమ పాటల ద్వారా ప్రజలను మరింత చైతన్యవంతం చేయాలని జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. సీలింగ్ భూములు, భూదాన్, పోరంబోకు భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూడ్ శోభన్, తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కే. ఆనందచారి,, నవతెలంగాణ ఎడిటర్ రాంపల్లి రమేష్, ప్రజానాట్యమండలి మాజీ రాష్ట్ర కార్యదర్శి కే. శాంతారావు, సీనియర్ రచయిత బండి సత్తన్న, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.జె. వినోద్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, తెలంగాణ సాహితీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మోహన్‌కృష్ణతదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో గణనాథునికి ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం / కూకట్‌పల్లి : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకు ని టిపిసిసి ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాం గ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ బండి రమే ష్ నియోజకవర్గంలోని పలు ప్రాంతా ల్లో ఏర్పాటు చేసిన గణేస్ మంటపాల ను శనివారం సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంత్‌న గర్, కెపిహెచ్‌బి 4వ ఫేజ్, కైతలాపూ ర్, రాఘవేంద్ర నగర్, ఆంజనేయ నగ ర్, మూ సాపేట్ ప్రాంతాల్లోని గణనాథులను దర్శించుకుని పూజలు నిర్వ హించా రు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్య క్రమాల్లో పాల్గొని, భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతి ఆశీస్సులతో ప్రజలందరు సుఖంసతోషా లతో, ఆ యురారోగ్యాలతో, శాంతి సౌభ్యాగాలతో జీవించాలని ఆకాంక్షిం చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్టలో గణేష్ నవరాత్రి వేడుకలు




ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు జగద్గిరిగుట్ట డివిజన్‌లోని పలు బస్తీలలో శనివారం భక్తి శ్రద్ధలతో ప్ర త్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. యువ నాయకు డు కొలుకుల జైహింద్ సంజయ్‌పూరి కాలనీ, పొలాల బస్తీ, న్యూ రాజీవ్ గాంధీ నగర్, భూదేవి హిల్స్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథు లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. నవరా త్రి ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తి వాతావరణంలో కొనసాగుతున్నాయని ని ర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజ్ కుమార్, విట్ట ల్‌గౌడ్, రాయి విఘ్నేష్, విట్టల్ ముదిరాజ్, సాయిలు యాదవ్, మధు, కిషో ర్, మల్లాచారి, వెంకటేష్, ఎర్ర లక్ష్మ య్య, అంజయ్య యాదవ్, తిరుపతిరావు , హనుమంతు యాదవ్, యాదగిరి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## కోర్టు ఆవరణలో ప్రత్యేక పూజలు



ప్రజాపక్షం/చర్లపల్లి : కుషాయిగూడ మేడ్చల్ జిల్లా కోర్టు ఆవరణలో ఎగ్జి క్యూటివ్ కమిటీ ప్రతిష్టించిన మహ గణపతి సన్నిధిలో శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాలభాస్కర్‌రావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో ఏడిజె తిరుపతి,2వ ఏడిజె అమరావతి,ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు జడ్జి శ్రీదేవి,పోక్సో జడ్జి ఆశాలత,ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి సత్తు రవీందర్,ఫస్ట్ అడిషనల్ సీనియర సివిల్జర్స్ శ్రీకాంత్,రాజు తదిత రులు పాల్గొన్నారు.

### నవోదయ ఇండస్ట్రీస్ అసోసియేషన్‌లో...



చర్లపల్లి డివిజన్ పరిధిలోని నవోదయ పారిశ్రామిక వాడలో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.ఈ కార్యక్రమానికి చర్లపల్లి విద్యుత్ ఏఇ బాబురావు,కాప్రా సర్కిల్ డిసి రవీంద్రసాగర్ పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం 1000 మందికి అన్న దానం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ సంద ర్భంగా అతిథులను అసోసియేషన్ ప్రతినిధులు శాలువాతో ఘనంగా సన్మా నించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్‌కు మార్,ఉపాధ్యక్షులు మురళీ,ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు,కోశాధికారి సాయిరాం,వెంకటేష్,ఆర్ శ్రీనివాస్‌రావు,దేవబా తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మారెడ్డిపల్లిలో వినాయక నిమజ్జనం



ప్రజాపక్షం/నవాబుపేట్: నవాబుపేట్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రా మంలో వినాయక నిమజ్జనోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతా వరణంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అంతగిరిపల్లి ప్రభాకర్ ఆధ్వ ర్యంలో జరిగిన నిమజ్జన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు, యువకు లు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినాయక విగ్రహాన్ని ప్ర త్యేకంగా అలంకరించి గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేయడంతో ఉత్సవాలు ప్రశాం తంగా ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా గ్రామస్తులు శాంతియుతంగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంతగిరిపల్లి ప్రభాకర్, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎస్ఐఆర్ విధులు

ప్రజాపక్షం/వికారాబాద్ : ఎస్ఐఆర్ విధులు పకడ్బందీగా నిర్వహించా లని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వెంకటచారి సిడిపిఒలు , సుపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ పరిగి,కొడంగల్ , తాండూర్ , వికారాబాద్ , ప్రాంతాల కు చెందిన చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారులు. అంగన్వాడీ టీచర్లు స క్రమంగా విధులు నిర్వహించేలా పర్యవేక్షించడం ప్రధాన బాధ్యత అని అ దనపు కలెక్టర్ అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అంగన్‌వాడీ టీచర్ల పైముఖ్యంగా జీరోశాతం పురోగతి ఉన్న వారిపై నిబంధనల ప్రకారం షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులనుఅదేశించా రు. రాబోయే 15 రోజుల్లో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయలని వచ్చే నెల 7వ తేదీలోగా పూర్తి స్థాయిలో ఎస్ఐఆర్ విధులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలనిసూచించారు.ఈ కార్యక్రమం లో శిశుసంక్షమవాఖ అధికిరి కాంతారావు ,డిఆర్ఓ స్వర్ణలత , తదితరులు పాల్గోన్నారు.



# సమర్థవంతంగా ప్రజా సంబంధిత పనులు

### మల్కాజిగిరి నగరపాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : ప్రజా సంబంధిత పనుల్లో సమర్థవంతమైన మానవ వనరుల వినియోగం, శాఖల మధ్య సమన్వయం, సకాలంలో పనులు పూర్తి చేయటం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టా లని మల్కాజిగిరి నగరపాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆదేశించారు.శనివారం ఎంఎంసి మౌలాలి సర్కిల్‌లోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాకి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలాలి వార్డులో ప్యాచ్ పనులకు వినియోగించే షెల్ మ్యాక్ బ్యాగుల నిలువ, కొత్త వీధి దీపాల స్టాక్‌తో పాటు ఇతర పరికరాల నిర్వహణను పరిశీలించారు. అందుబాటులో ఉన్న సామగ్రిని అవసరమైన చోట సకాలంలో వినియోగించా లన్నారు. వెంకటేశ్వర నగర్ లో స్థానిక ప్రజలతో మాట్లాడిన కమిషనర్ రాత్రి వేళల్లో వీధి దీపాలు వెలగటం లేదని చెప్ప టంతో తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దీన్‌దయాల్‌నగర్ రోడ్డులో కొనసాగుతున్న చెట్ల కొమ్మల తొలగించటం, బకెట్ ల్యాడర్ పరికరాలను ఏ మేరకు వినియోగిస్తున్నారన్న విషయాన్ని స్వయంగా పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించే చెట్ల కొమ్మలను సకా లంలో తొలగిస్తుండాలన్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని బండ చెరువు బేబీ పాండ్‌ను పరిశీలించిన కమిషనర్ గణేష్ నిమజ్జనానికి సంబంధించిన పనుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యానికి తావు లేకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. మౌలాలి సర్కిల్ డిప్యూటి కమిషనర్ బాలకృష్ణ ప్రసాద్, ఎస్ఈ లక్ష్మ ణ్ తదితర అధికారులు కమిషనర్ వెంట ఉన్నారు.

# ఆరోగ్య సేవలందించటంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### డిఎంహెచ్‌ఒ డా.ఆనంద్ హెచ్చరిక



ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : జిల్లాలో మా తా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తమ పరిధి ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలను ప్రారంభ దశ లోనే గుర్తించి వారి వివరాలు నమోదు చేయటం ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తుండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.ఆనంద్ అదేశిం చారు. శనివారం తమ కార్యాలయంలో పల్లె దవ ఖానా వైద్యాధికారులు,రిపోర్టింగ్ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీ మహిళలకు ఏఎన్‌సి పరీ క్షలు నిర్వహించటం,హైరిస్క్ కేసులను గుర్తించి అవసరమైన సందర్భాల్లో ఇతర ఉన్నత ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలన్నారు. అవసరమైన టీకాలు, పోషకాహార సప్లిమెంట్లు అందించటం, ప్రసవానంతర సేవలు అందించటం, నవజాత శి శువులు, శిశువులు, పిల్లల్లో జన్యుపరమైన లోపా లు, పోషకాహార లోపాలను ముందుగానే గుర్తించి మెరుగైన వైద్య సేవలకు రిఫరల్ సౌకర్యాలు క ల్పించాలన్నారు. పల్లె దవఖానాలు గ్రామీణ, పట్ట ణ పరిధిలోని ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలం దించటంలో అత్యంత కీలకమని, ప్రతి కేంద్రంలో అవసరపదే రీతిలో మందులు, తదితర వైద్య సా మగ్రి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. త మ పరిధిలోని ఆశా, ఏఎన్ఎంలతో సమన్వయం చేసుకొంటూ క్షేత్రస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు.టిబి నియంత్రణ కార్యక్రమంలో డాట్స్ సేవలు, కుష్టు వ్యాధి నియంత్రణలో డిపి ఎంఆర్ సేవలను సమర్థవంతంగా అమలు చేయా లన్నారు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ తదితర అసాంక్రమిక వ్యాధుల స్క్రీనింగ్‌ను నిరంతరం నిర్వ హించాలన్నారు. ఆరోగ్య సేవలందించే విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసు కొంటామని డిఎంహెచ్‌ఓ హెచ్చరించారు.

# తాండూరులో వైభవంగా నిమజ్జన ఉత్సవాలు

### విడ్కోలు పలికిన నేతలు, భక్తులు ఉత్సవాలకు హాజరైన చీఫ్‌విప్ పట్నం, ఎంఎల్‌ఎ మనోహర్‌రెడ్డి



ప్రజాపక్షం/తాండూరు : ఓబొజ్జగణపయ్య ... వెళ్ళి రావయ్యా.. అంటూ ప్రజలు, భక్తులు గణపయ్య ఘనంగా విడ్కోలు పలికారు. తాం డూరు పట్టణంలో ఐదు రోజుల పాటు భక్తుల పూజలందుకున్న గణనాథులు శుక్రవారం నిమి జ్జనానికి తరలివెళ్లారు. పప్పా..పప్పా మోరి యా... గణపతి పప్పా మోరియా... జైబోలో గణే ష్ మహారాజ్ అంటూ నినాదాలతో పాటు భక్తు ల నృత్యాల మధ్య తాండూరు పట్టణం మోర్మో గింది. శుక్రవార మధ్యాహం నుండి ప్రారంభ మైన నిమజ్జన వేడుకలు పాతా తాండూరు, ఇందిరాచౌక్, నేహ్రుగంజ్, గాంధీచౌక్ మీదుగా భద్రేశ్వర చౌక్ మీదుగా అంగరంగ వైభంగా కొనసాగాయి. పట్టణంలో కోలువు దీరిన వివిధ మండలపాల నుంచి గణనాథులను అలంకరిం చి భారి శోభయాత్రతో భద్రేశ్వర చౌక్‌లో హిందు ఉత్సవ కమిటి ఏర్పాటు చేసిన వేదికకు చేరుకున్నాయి. భద్రేశ్వర చౌరస్తా మీదుగా సాగిన ఊరేగింపులో యువత కేరింతలు, నృ త్యాలతో సందడి నెలకొంది, గణపయ్యా నిమ జ్జన శోభయాత్రను తిలకించెందుకు పట్టణం భక్తులతో కిటకిటలాడింది. తాండూరు పట్ట ణంలో జరిగిన నిమజ్జన వేడుకల్లో ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి, స్థానిక ఎంఎల్‌ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎంఎల్‌ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ నీరా జబాల్‌రెడ్డిలు పాల్గోన్నారు. భద్రేశ్వర చౌక్ వద్ద హిందూ ఉత్సవ కమిటి ఏర్పాటు చేసిన వేదిక లవద్ద నుండి నిమిజ్జనానికి తరలివెళ్తున్న గణనా థులకు ఘనంగా స్వాగతం పలకడంతో ఉత్సవ కమిటి సభ్యులను ఘనంగా సన్మానించారు.

**ప్రశాంతంగా గణనాథుల నిమజ్జనం....**

గణనాథుల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగింది. నిమిజ్జన ఏర్పాట్లును ఎంఎల్‌ఎ మనో హర్‌రెడ్డి ముందు రోజే సమీక్షించడంతో అధికా రులు చర్యలు తీసుకున్నారు. కోకట్ వాగు, మల్‌రెడ్డి చెరువు తదితర ప్రాంతాలలో గణనా థుల నిమజ్జనం చేశారు.

**శోభయాత్రను పరివేక్షించిన ఎస్‌పి**

తాండూరు పట్టణంలో శుక్రవారం జరిగిన గణ నాథుల నిమజ్జన శోభయాత్రలో ఏలాంటి అ వాంచనీయ ఘటన చోటు చేసుకుండా జిల్లా ఎస్‌పిస్నేహ మేహ్రా ఆద్వర్యాన అదనపు ఎస్‌పి తో పాటు పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేశారు. శోభయాత్రలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకుండా జిల్లా ఎస్‌పి పరివేక్షించారు.

# ఒడిశా టూ మహారాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ గుట్టురట్టు

### రూ.2.28 కోట్లు విలువైన 426 కిలోల గంజాయి పట్టివేత మహిళతో సహా ఆరు గురు అరెస్ట్




ప్రజాపక్షం/దుండిగల్: ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి రాష్ట్రంలో మత్తును సరఫరా చేసేం దుకు వేసిన కుట్రను సైబరాబాద్ కుత్బుల్లాపూర్ జోన్ ఎస్‌ఓటి పోలీసులు బగ్నం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు వేదికగా జరుగుతున్న అంతర్రాష్ట్ర గంజాయి అక్రమ రవాణా ఒడిశా నుంచి మహ రాష్ట్రకు భారీగా గంజాయిని తరలిస్తున్న ముఠా ను ఛేదించి, దాదాపు రూ. 2 కోట్ల 28 లక్షల 87 వేల విలువైన 426 కిలోల గంజాయిని ప ట్టుకొని దుండిగల్ పోలీసులకు అప్పగించారు. ఈ కేసు సంబంధించి ఒక ప్రధాన మహిళా సూత్రధారితో సహా ఆరుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు మేడ్చల్ జోన్ డిసిపి ఎన్. కోటిరెడ్డి ఐపీఎస్ వెల్ల డించారు. దుండిగల్ పోలీస్ స్టేషన్లో నిర్వహిం చిన మీడియా సమావేశంలో కుత్బుల్లాపూర్ జో న్ డిసిపి కోటిరెడ్డి, ఎస్‌ఓటిడిసిపి శోభన్ బాబు, ఏసీపీ శంకర్ రెడ్డిలతో కలిసి తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన సురంగిణి పరిచ్చ అలియాస్ సునీత అనే మహి ళ ఈ దందాకు ముఠా నాయకురాలు. ఒడిశా నుంచి భారీ స్థాయిలో గంజాయిని కొనుగోలు చేసి, మహారాష్ట్రలోని సోలాపూర్ ప్రాంతానికి చెందిన పెడ్లర్లతో జతకట్టి అక్కడకు తరలించేం దుకు ప్లాన్ వేసింది. ఇందులో భాగంగా గంజా యిని గుట్టుచప్పుడు కాకుండా ఒక డీసీఎం వాహనంలో నింపారు. ఆ డీసీఎంకు కాపలాగా (ఎస్కార్ట్‌గా) ముందు స్విఫ్ట్ కారును పైలటిం గ్‌గా ఉపయోగిస్తూ ప్రయాణం సాగించారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన కుతుబు ల్లాపూర్ జోన్ ఎస్‌ఓటీ మరియు దుండిగల్ పో లీసులు సెప్టెంబర్ 18 రాత్రి 8:00 గంటల స మయంలో ఓఆర్ఆర్ ఎగ్జిట్5, దుండిగల్ సర్వీస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా వచ్చిన స్విఫ్ట్ కారును, వెనుక ఉన్న డీసీఎంను అడ్డుకుని సోదా చేయ గా.. అందులో లోడ్ చేసి ఉన్న 426 కిలోల గంజాయి లభ్యమైంది. అక్కడికక్కడే ఆరుగురిని అదుపులోకి తీసుకుని గంజాయితో పాటు 2 వా హనాలు, మొబైల్ ఫోన్లు, నగదును జప్తు చేశా రు. అరెస్టయిన నిందితుల వివరాలు సురం గిణి పరిచ్చ అలియాస్ సునీత (41)ప్రధాన నిం దితురాలు, ఒడిశా బాలు గణపత్ కదమ్ అలి యాస్ నానా (52), ఉపలబ్ధ్ మంగలేష్ భోస్లే అలియాస్ వికాస్ (34), సమాధాన్ గోకుల్ తోరత్ అలియాస్ సోము (30), రాజు చవాన్ (39), అరుణ్ బాబూరావు చెండ్కే (30), ఈ కేసులో అవినాష్ బాబు రాథోడ్, అభిజిత్ థాటే అనే మరో ఇద్దరు మహారాష్ట్ర వాసులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు చర్యలు వేగవం తం చేశామని తెలిపారు. భర్త జైలులో ఉంటే.. భార్య గంజాయి దందాలోకి ప్రధాన నిందితు రాలు సునీత భర్త రాహుల్ పరిచ్చ కూడా పాత నేరస్తుడేనని పోలీసులు వెల్లడించారు. అతను 2025లో నమోదు అయిన ఎన్డీపీఎస్ గంజాయి కేసులో అరెస్టయి ప్రస్తుతం ఖమ్మం జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. భర్త జైలులో ఉన్నప్పటికీ సునీత అదే దందాను కొనసాగిస్తూ పట్టుబడటం గమనార్హం. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన అడిషనల్ డిసిపి ఎ. విశ్వప్రసాద్, దుండిగల్ ఇన్సపెక్టర్ ఎం. బాల్ రెడ్డి, ఎస్‌ఓటి ఇన్సపెక్టర్ కె.నరసింహ, దుండిగల్, ఎస్‌ఓటి సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు ప్రకటించారు.

## ప్రజయ్ హోమ్స్‌లో గణనాథుడిని దర్శించుకున్న చైర్ పర్సన్

ప్రజాపక్షం/శామీర్‌పేట : అలియాబాద్ మున్సి పాలిటి తుర్కపల్లిలోని ప్రజయ్‌హోమ్స్‌లో వినా యక చవితి సందర్భంగా ప్రతిష్టించిన గణనాథు డిని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. వినాయక మంటపాల నిర్వాహకుల ఆహ్వానం మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ కమతం శిరీషా కృ ష్ణారెడ్డి గణనాథుడిని దర్శించుకుని తీర్థప్రసాదా లు స్వీకరించారు. అలాగే మంటప నిర్వాహకులు మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

**మల్కాచెరువును సందర్శించిన శిరీషా**

కాగా మలక్‌పేట రెవెన్యూ పరిధిలోని మల్కచెరు వును వినాయక నిమజ్జనాల సందర్భంగా జీనోమ్ వ్యాలీ ఇన్స్‌పెక్టర్ గోపగాని గురువయ్యాగౌడ్ తో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృ ష్ణారెడ్డి సందర్శించారు. భక్తులకు, ప్రజలకు ఏ లాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాంతి భద్రతల తో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తా మని మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యు సూఫ్‌బాబా, జశ్వంతరెడ్డి, నాయకుడు కమతం కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# పిల్లల చదువు పట్ల శ్రద్ధ చూపాలి



ప్రజాపక్షం /పరిగి : పిల్లల చదువు పట్ల శ్రద్ధ చూపాలని జిల్లావిద్యాధికారి అబ్దుల్ ఘ ని అన్నారు. పరిగి మండల పరిధిలోని చిగు రాల్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యా ర్థుల అభ్యసన సామర్థాలను పరిశీలించి ప్ర ధానోపాధ్యాయులు రాజేష్ రాథోడ్‌కి ఉపా ధ్యాయులకు తగు సూచనలు చేశారు. అనం తరం మిట్లకోడుర్ ప్రాథమిక ఉన్నత పాఠశా లలు కలిసి ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల ఉ పాధ్యాయుల సమావేశానికి ముఖ్య అతిథు లుగా రీజనల్ జయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి హాజిరైమాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అంకితభా వంతోపనిచేయాలని సూచించారు. తల్లిదం డ్రులు తమ పిల్లల చదువుపట్ల ఎప్పటికప్పుడు గమనిస్తు శ్రద్ధ చూపాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండ విద్యాధికారి అంజయ్య, గ్రామ సర్పంచు మాణిక్యం ,ఉపా ద్యాయులు ,విద్యార్థులు పాల్గోన్నారు.

## పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచాలి



ప్రజాపక్షం/బోడుప్పల్ : గణేష్ ఉత్సవాలు నిర్వహిస్తున్న మండపాల సమీప ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచటం ద్వారా పరిశుభ్రతను మెరుగు పరచాలని బో డుప్పల్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ ఉప్పరి విజయ్ కోరారు. శనివారం ఆయన ఎంఎంసి బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజను కల్సి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. గణేష్ ఉత్సవాల్లో భా గంగా మండపాల వద్ద అన్న ప్రసాద వితర ణ, పూజాది కార్యక్రమాలు జరుగుతుంటా యని, ఈ నేపథ్యంలో పారిశుధ్య పనులపై మరింత శ్రద్ధ కనపరచటంతో పాటు మండ పాల వద్ద మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. గణేష్ ఉత్సవ సమితి సలహాదారు లు బజార్ కిరణ్ గౌడ్, కోకన్వీనర్లు ఆసర్ల బీరప్ప, ఎస్ఎంఎస్ ప్రగతి, శ్రీనివాసరావు, పద్మ, మహేశ్వర్‌రెడ్డి, రాజేష్‌చారి, నర్సింగ్ నాయక్, అరుణ్ కుమార్, మురళి యాదవ్, తదితరులు డిసిని కలిసిన వారిలో ఉన్నారు.

## మూడుచింతలపల్లి మున్సిపల్ దుకాణాల బహిరంగ వేళం వాయిదా



ప్రజాపక్షం/శామీర్‌పేట :మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని దుకాణాల సము దాయం బహిరంగ వేళం వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ జాం రవి, కమిషనర్ వెంకటగోపాల్‌లు అన్నారు. శుక్రవారం మూడుచింతలపల్లి మున్సిప ల్‌లో సమీవేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ మున్సిప ల్‌లో దుకానాల సముదాయాలకు ఆశించిన స్థాయిలో దరఖాస్తులు డిడిలు అందకపోవడంతో ఈ నెల 19న నిర్వహించాల్సిన వేలం వాయిదా వేసినట్లు చైర్మన్, కమిషనర్‌లు తెలిపారు. ఈ నెల 26న ఉదయం 11 గంటలకు మున్సి పల్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో వేళం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ నెల 19 నుంచి 25 వరకు ప్రతిరోజు ఉదయం 11 గంటల నుం చి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు నీరజ్‌గౌడ్, నవీన్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, రాంరెడ్డి, జగన్నాదం, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇండియా-జపాన్ ఇన్నోవేషన్ రీజినల్ హ్యాకథాన్-2026



ప్రజాపక్షం/దుండిగల్ : దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఇండియాజపాన్ ఇన్నోవేషన్ రీజి నల్ హ్యాకథాన్2026ను ఘనంగా నిర్వహించారు. 12 గంటల పాటు జరిగిన జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు మరియు ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజ్ నుంచి విద్యార్థులు పాల్గొని వాస్తవ ప్రపంచ సమ స్యలకు సాంకేతిక పరిష్కారాలను రూపొందిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. మొత్తం 420 పైగా టీమ్స్ రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో 125 టీమ్స్ మాత్రమే ఎంపిక చేయడం జరిగిందనీ హ్యాకథాన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబో టిక్స్, ఐఓటి, సెమీకండక్టర్ టెక్నాలజీ, స్మార్ట్ మొబిలిటీ, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై దృష్టి సారించారు. విద్యార్థులకు పరిశ్రమ నిపు ణులతో మమేకమై ఇన్నోవేషన్, టెక్నాలజీ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన పొందే అవకాశం లభించింది. ఈ కార్యక్రమానికి తోషిభ ఐడి (ఇం డియా) సీఎండీ హిరోషి ఫురుటా, టీసీస్ సిఐఓ ఐఈ ఈఈ హైదరాబాద్ వైస్ చైర్ బాల ప్రసాద్ పెద్దిగారి, రాజపాన్ హబ్ ఫౌండర్ బి.రామ భద్ర, అటల్ ఇంకబాషన్ సెంటర్ అలీప్ చీఫ్ ఇన్నోవాషన్ ఆఫీసర్ డా॥ జహూరుల్లా ఎస్.ఎం.డి. (డా॥ జెడ్) హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఫౌండర్ సెక్రటరీ మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే, మల్కాజ్‌గిరి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అను శ్రేయ రెడ్డి, మర్రి ధీరన్ రెడ్డి, ట్రెజరర్ మర్రి మమతా రెడ్డి కార్యక్రమ నిర్వాహకులు, విద్యార్థులు, మెంటర్లు మరియు భాగస్వామ్య సంస్థలను అభినందించారు.

## సింగిరెడ్డి మాధవరెడ్డి సేవలు స్మరణ



ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : స్వాతంత్ర సమరయోధుడు కీ.శే.సింగిరెడ్డి మాధవరెడ్డి వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.మేడ్చల్ జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు సింగి రెడ్డి హరివర్ధన్ రెడ్డి ఆహ్వానం మేరకు ఘట్‌కేసర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్య క్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మేడ్చల్ మండలం గౌడవెల్లికి తరలివెళ్లి ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్,పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్,డీసీసీ కార్యదర్శి మామిండ్ల ముత్యాలు యాదవ్,జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ మేడబోయిన వెంక టేష్ ముదిరాజ్,రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు కొంతం అంజి రెడ్డి,కార్యనిర్వాహక అధ్యక్షుడు బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, ప్రధాన క్యాదర్శి కందకట్ల మాధవరెడ్డి,కార్యదర్శి మేకల సునీల్ కుమార్,నాయకులు బొక్క నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## జవహర్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాపక్షం/జవహర్‌నగర్ : స్మైల్ ఫౌండేషన్ సహకారంతో యూనివర్సల్ హ్యుమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేఆర్ నగర్ మామిడి తోటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఆర్థోపె డిక్, పీడియాట్రిక్ వైద్య నిపుణులు డాక్టర్ గద్దం రాజకుమార్, జె. గౌతమీ, మెడ శిరీష, సీహెచ్‌ఓ ఎండీ సాదిక్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సూచనలు అందించారు. పేద, మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. శిబిరాన్ని విజయవంతం చేయాలని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ పిలుపునివ్వగా, ట్రస్ట్ ప్రతినిధులు కొలిపాక సాయికిరణ్, కొలిపాక కళ్యాణి ఏర్పాట్లను సమన్వయం చేశారు.

‘ కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలో ఎంఎస్ రాజు తెరకెక్కించిన చిత్రం ‘అగధ’. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కెఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు ఈ మూవీని నిర్మించారు. ఈ డివైన్ బ్లాక్ బస్టర్ మూవీ 25 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ’

# రీల్

## ‘సిగ్మా’ అడ్వెంచర్ ట్రైలర్ రిలీజ్



సందీప్ కిషన్ యాక్షన్‌అడ్వెంచర్, హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘సిగ్మా’ అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సినిమాతో జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రాన్ని కోస్తాంధ్ర, తెలంగాణలో మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని విడుదల చేస్తుండగా, సీడెడ్ ప్రాంతంలో ఎన్వీఆర్ సినిమా విడుదల చేస్తుంది. తాజాగా థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. మోసపోయిన హీరో, జరిగిన దాన్ని మర్చిపోయి ముందుకు వెళ్లకుండా.. తనకు జరిగిన నష్టాన్ని తిరిగి సాధించుకోవాలని పోరాటం మొదలుపెడతాడు. డ్రగ్స్, గ్యాంబ్లింగ్‌కు సంబంధించిన రూ.500 కోట్ల భారీ రాకెట్ ఈ కథలో కీలకంగా ఉంటుంది. దీంతో హీరో క్రైమ్, మోసం, ప్రమాదాలతో కూడిన ప్రపంచంలోకి అడుగుపెడతాడు. మరోవైపు ఓ ఆర్‌జెతో ప్రేమలో ఉన్న హీరో.. తన స్నేహితుల సహాయంతో భారీ హీస్ట్‌కు ప్లాన్ చేస్తాడు. అయితే ఎంతో పక్కాగా వేసుకున్న ఆ ప్లాన్‌కు రెడ్డి అడ్డుపడటంతో మొత్తం ఆపరేషన్ గందరగోళంగా మారుతుంది. ఓటమిని అంగీకరించని హీరో మరింత బలంగా తిరిగి వచ్చి.. అన్ని అడ్డంకులను అధిగమించి తన లక్ష్యాన్ని ఎలా సాధించాడనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా తల్లికొడుకు ఎమోషన్ సినిమాకు మంచి డెప్త్‌ను తీసుకొచ్చేలా కనిపిస్తోంది. కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రఫీ స్టైలిష్, కాంటెంపరరీ విజువల్స్‌తో ఆకట్టుకుంటోంది. యాక్షన్, అడ్వెంచర్ ప్రపంచాన్ని యాటిట్యూడ్‌తో ప్రజెంట్ చేశారు. ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ స్కోర్ సినిమాకు మరింత ఇంటెన్సిటీ, ఎనర్జీని తీసుకొచ్చింది. ప్రవీణ్ కేఎల్ షార్ప్ కట్స్‌తో నెరేషన్‌ను క్రిస్ప్‌గా ఉంచారు. లైకా ప్రొడక్షన్స్ నిర్మాణ విలువలు కనిపిస్తున్నాయి.

## మహిళ సమస్యలతో ‘ఆక్టోపస్’..

తమిళ జీ5 ఒరిజినల్ సిరీస్‌లకు సంబంధించిన విభాగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకుంటూ.. విభిన్న జోనర్స్‌లో ఆసక్తికరమైన ప్రాంతీయ కథలను ప్రేక్షకులకు అందిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తన కథనానికి సంబంధించిన శైలిని మరో స్థాయికి తీసుకెళ్తూ.. ‘ఆక్టోపస్’ అనే ఉత్కంఠభరితమైన సస్పెన్స్ థ్రిల్లర్‌ను ప్రీమియర్‌కు సిద్ధం చేసింది. ఈ సిరీస్‌లో శక్తివంతమైన మహిళా ప్రధాన కథతో పాటు.. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో ఇప్పటివరకు ఉన్న సంప్రదాయ కథనాలకు భిన్నంగా కొత్త తరహా అనుభూతిని అందించనుంది. జయచంద్ర హాష్మీ దర్శకత్వంలో రూపొందిన ఈ 7 ఎపిసోడ్స్ తమిళ జీ5 ఒరిజినల్ సిరీస్‌లో అశ్విన్, అర్చన, వినోత్ కిషన్, సిద్ధు కుమరేశన్, కలైవాణి భాస్కర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తమిళ జీ5 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ‘ఆక్టోపస్’ లాంచ్ ప్రోమో విడుదలైనప్పటి నుంచి ఈ సిరీస్‌పై ఆన్‌లైన్‌లో మంచి ఆసక్తి నెలకొంది. ఆసక్తికరమైన కథాంశంతో పాటు అభిమానుల చర్చలు, అంచనాలు, సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చలతో ‘ఆక్టోపస్’పై క్యూరియాసిటీ పెరుగుతోంది. కేవలం సస్పెన్స్ థ్రిల్లర్‌గానే కాకుండా.. నమ్మకం, సంబంధాలు, పట్టుదల, మనుషుల మధ్య ఉండే బంధాల బలం వంటి ఆసక్తికరమైన అంశాలను కూడా ఈ సిరీస్‌లో చూపించనున్నారు. మన రోజువారీ జీవితానికి దగ్గరగా ఉండే పరిస్థితులను ఆధారంగా చేసుకుని, బలమైన భావోద్వేగాలతో సాగే కథనం ప్రేక్షకులను చివరి వరకు ఆసక్తిగా చూసేలా చేయడంతో పాటు.. అసలు ఏం జరగబోతోందనే ఉత్కంఠను కొనసాగించనుంది.



## ఆకట్టుకుంటున్న ‘నీ వల్లే’ పాట




అచు రాజామణి మెలోడీకి విక్రమ్ శివ హృద్యమైన సాహిత్యం.. నిఖిల్ విజయేంద్ర సింహా, తేజు అశ్విని జంటను పరిచయం చేసిన అందమైన ప్రేమగీతం ఇది. యువతను ఆకట్టుకునే ప్రేమకథా చిత్రంగా తెరకెక్కుతున్న ‘సంగీత్’ నుంచి తొలి పాట ‘నీ వల్లే’ విడుదలైంది. కథానాయకుడు నిఖిల్ విజయేంద్ర సింహా ఆయన అభిమానులకు, సంగీత ప్రియులకు ఒక ప్రత్యేకమైన మ్యూజికల్ ట్రీట్‌గా నిలిచింది. సంగీత ప్రపంచంలో తనదైన ప్రత్యేకతను చాటుకున్న సిద్ శ్రీరామ్ గాత్రం, ప్రముఖ సంగీత దర్శకుడు అచు రాజామణి అందించిన మధురమైన స్వరాలతో ‘నీ వల్లే’ ఒక హృద్యమైన రొమాంటిక్ మెలోడీగా రూపుదిద్దుకుంది. విక్రమ్ శివ ఈ పాటకు సాహిత్యాన్ని అందించారు. ‘నీ వల్లే’ పాటలో అచు రాజామణి అందించిన సంగీతం ప్రేమ, భావోద్వేగాలను అద్భుతం గా ప్రతిబింబిస్తుంది. మెలోడీకి తగిన ఆహ్లాదకరమైన ఆర్కెస్ట్రేషన్‌తో పాటను అందంగా తీర్చిదిద్దారు. సిద్ శ్రీరామ్ తన విలక్షణమైన గా త్రంతో ఈ పాటకు మరింత భావోద్వేగాన్ని జోడించారు. నిఖిల్ విజయేంద్ర సింహా, తేజు అశ్విని మధ్య ప్రేమను, వారి కెమిస్ట్రీని పరిచయం చేసేలా ఈ పాటను చిత్రీకరించారు. హృద్యమైన సాహిత్యం, మధురమైన సంగీతం, సిద్ శ్రీరామ్ గాత్రం కలిసి ‘నీ వల్లే’ను ఆకట్టుకునే రొమాంటిక్ మెలోడీగా నిలిపాయి. లహరి ఫిలిమ్స్ ఆర్‌బి స్టూడియోస్ బ్యానర్లపై జి. మనోహరన్, ఎల్. బాలకృష్ణ సమర్పణలో ‘సంగీత్’ తెరకెక్కుతోంది. నిఖిల్ విజయేంద్ర సిం హా హీరోగా పరిచయం అవుతున్న చిత్రం నిఖిల్ సరసన తేజు అశ్విని నటిస్తున్నారు. దర్శకత్వం: సాద్ ఖాన్ కథ: సాద్ ఖాన్ & సిద్ధాంత్ సుందర్ నిర్మాతలు: నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, శ్రావంతి నవీన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మాజ్ ఖాన్.

## భావన స్టూడియోస్‌లో ‘పిక్నిక్’ సందడి



‘బెత్లహేమ్ కుటుంబ యూనిట్’తో భారీ గ్లోబల్ సక్సెస్‌ను అందుకున్న ప్రముఖ నిర్మాణ సంస్థ భావన స్టూడియోస్ తమ కొత్త సినిమాను ప్రకటించింది. ‘పిక్ నిక్’ అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సందీప్ ప్రదీప్, ఇంద్రజిత్ సుకుమారన్, దిలీష్ పోతన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఫ్యామిలీ కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా 2027 జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.ఈ సినిమాతో రచయిత కిరణ్ జోసీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సెన్సేషనల్ హిట్స్ ‘ప్రేమలు’, ‘బెత్లహేమ్ కుటుంబ యూనిట్’ చిత్రాలకు కోరైటర్‌గా పనిచేసిన కిరణ్ జోసీ.. ఆసక్తికరమైన, మన సంస్కృతికి దగ్గరగా ఉండే ఎంటర్‌టైనింగ్ కథలను అందించడంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కేరళతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయన గత రచనలకు మంచి ఆదరణ లభించడంతో.. దర్శకుడిగా ఆయన తొలి సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. సందీప్ ప్రదీప్, దిలీష్ పోతన్, ఇంద్రజిత్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ‘పిక్నిక్’ను మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: గోవింద్ వసంత, నిర్మాతలు: ఫహద్ ఫాజిల్, దిలీష్ పోతన్, శ్యామ్ .

## అక్టోబర్ 9న థియేటర్స్‌లోకి ‘అ’

రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న ‘‘అ’ సినిమాపై ఇప్పటికే మంచి బజ్ నెలకొంది. ఇటీవల అడివి శేష్ విడుదల చేసిన సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన రావడంతో.. తాజాగా చిత్రబృందం ‘బ్లడీ హంగర్’ పేరుతో ఫస్ట్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. డెబ్యూ ప్రొడక్షన్ హౌస్‌లు స్టార్ బాక్స్ స్టోరీస్, రిపుల్ స్లైడ స్టూడియోస్ బ్యానర్లపై రూపొందుతున్న ఈ థ్రిల్లర్‌లో రాహుల్ విజయ్, అర్చన అయ్యర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. కనకరావు తొనంగి, అభిషేక్ కె, ప్రముఖ ఎడిటర్ గ్యారీ బి హెచ్ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. సాయి బాలి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 9న థియేటర్లలో విడుదల కానుంది. మోనిష్ భూపతి రాజు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అభినవ్ వి. కునపరెడ్డి, గ్యారీ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చిత్రానికి కోప్రొడ్యూసర్: అభినవ్ వి. కునపరెడ్డి సంగీత దర్శకుడు: శ్రీచరణ్ పాకాల డీఓపీ: మోనిష్ భూపతి రాజు



## ‘సీన్’ గ్లింప్స్ రిలీజ్

వరుస బ్లాక్‌బస్టర్స్‌తో దూసుకెళ్తున్న స్టార్ హీరో సూర్య.. మలయాళ దర్శకుడు జితు మాధవన్‌తో కలిసి తన 47వ చిత్రాన్ని చేస్తున్నారు. ‘ఆవేశం’ ఫేమ్ జితు మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ‘సీన్’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో నజ్రియా నజీమ్ కథానాయికగా నటిస్తుండగా.. ఆనంద్ రాజ్, లాల్, రాజ్ ప్రియాన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. యాక్షన్‌కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని జఘరం స్టూడియోస్, 2డి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై జ్యోతిక, సూర్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జయశ్రీ దామోదరన్ కోప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా ‘సీన్’ టైటిల్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాను దీపావళి సందర్భంగా నవంబర్ 6, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. సూర్య అసలు ఇంట్రడక్షన్‌ను మాత్రం గ్లింప్స్‌లో అదిరిపోయేలా డిజైన్ చేశారు. డిఎస్పీ ప్రేమ్‌రాజ్ గా సూర్య పవర్‌ఫుల్ ఎంట్రీ అదిరిపోయింది. ఓ కానిస్టేబుల్ భుజంపై చేయి వేసుకుని నడుస్తూ వచ్చే సూర్య.. ఎంత కష్టమైన క్రిమినల్ అయినా అతడిని ట్రాక్ చేసి పట్టుకోగల తన ప్రత్యేక సామర్థ్యాన్ని తెలియజేసే పవర్‌ఫుల్ డైలాగ్ చెప్పడం ఆకట్టుకుంది.



## సంబంధాల్లో ఒడిదుడుకులు

(మొదటి పేజీ తరువాయి)

దేశాలపై భారీగా సుంకాల వడ్డన ప్రారంభించారు. అప్పటినుండీ భారత్ సహా అనేక దేశాలకు సమస్యలు మొదలయ్యాయి. ముఖ్యంగా గత ఏడాది నుండి ఇరు దేశాల వాణిజ్యంలో సుంకాల విషయంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి.తేదీలవారీగా పరిశీలిస్తే ఈ మార్పులు అర్థమవుతాయి. రష్యా–ఇరాన్ దేశాల నుండి చమురు,సహజవాయువు కొనుగోలు చేసే భారత్–చైనాలను దెబ్బతీసేందుకు ట్రంప్ రిపబ్లికన్‌పార్టీ అమెరికా కాంగ్రెస్‌లో ఆంక్షల బిల్లును గురువారం ఆమోదించింది. ఈ బిల్లుపై ట్రంప్ శుక్రవారం (సెప్టెంబరు 18) సంతకం చేయడంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. దీంతో భారత్‌పై నూటికినూరుశాతం సుంకాలు విధించే పరిస్థితి తలెత్తింది. ‘‘ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ చట్టం–2026’’ ఇప్పుడు అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో 2025,2026 సంవత్సరాలలో ఇప్పటివరకూ భారత్–అమెరికా మధ్య టారిఫ్ విషయాల్లో క్రమానుగత మార్పులు తేదీలవారీగా ఈ క్రిందివిధంగా ఉన్నాయి.

**2025,ఏప్రిల్ 2:విముక్తి దినం:** భారత్ నుండి అమెరికాకు దిగుమతయ్యే సరుకులపై మొత్తంగా 26 శాతం సుంకాలను ట్రంప్ విధించారు. ఇందులో పదీశాతం ప్రాథమిక సుంకాలు కాగా, 16 శాతం పరస్పర దిగుమతుల్లో వ్యత్యాసాలకు సంబంధించిన సుంకా లు. అంతకు ముందు వరకూ అమెరికాకు మోస్ట్ ఫేవర్డ్ నేషన్ జాబితాలో ఉన్న భారత్‌కు డబ్ల్యుటిఓ సభ్యదేశాల నుండి దిగుమతయ్యే వస్తువులపై సుంకాలు అమలులో ఉండేవి.

**2025,ఏప్రిల్ 9:** భారతదేశంపై అదనంగా విధించిన 16 శాతం పరస్పర సుంకాలను 90 రోజులపాటు అంటే 2025 జులై తొమ్మిదో తేదీ వరకూ నిలిపివేసింది.

**2025,జులై 31:** ఏప్రిల్ 2 నుండి ఆగస్టు ఆరో తేదీ వరకూ పదీశాతం సుంకాలు వసూలు చేసిన అమెరికా ఆగస్టు ఏడో తేదీ నుండి 25 శాతం సుంకాలు అమలు చేస్తున్నట్లు ప్రకటించింది.

2025,ఆగస్టు 6ఃరష్యా నుండి చమురు కొనుగోలు చేస్తున్నందుకుగాను అదనంగా 25 శాతం సుంకాలను భారత్‌నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై జరిమానాగా అమెరికా విధించింది. దీంతో భారత్‌పై మొత్తం సుంకాల భారం 50 శాతానికి పెరిగింది.

**2025,ఆగస్టు,27:** అమెరికా మార్కెట్‌లో భారత వస్తువులు 50 శాతం సుంకాలు ఎదుర్కొన్నాయి. వివరంగా చూస్తే ఇందు లో 25 శాతం పరస్పర సమానత్వ సాధనకు సంబంధించిన సుంకాలు కాగా, మరో 25 సుంకాలు రష్యా చమురు దిగుమతిపై జరిమానాగా విధించారు.

**2026, ఫిబ్రవరి 2:** ప్రస్తుతం భారత్‌పై ఉన్న 25 శాతం సుంకాలను 18 శాతానికి తగ్గించేందుకు భారత్–అమెరికా మధ్య అంగీకారం కుదిరింది. కానీ ఈ 18 శాతం సుంకాలను ఇప్పటివరకూ అమలులోకి రాలేదు.

**2026, ఫిబ్రవరి6:** ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటిదశ అమలు నిమిత్తం ఒక నిబంధనల చట్రాన్ని అమలు చేసేందుకు అంగీకారానికి వచ్చినట్లు భారత్–అమెరికా ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి.

**2026, ఫిబ్రవరి 7:** రష్యా నుండి చమురు కొనుగోలు చేసినందుకు అప్పటివరకూ భారత్ సరుకులపై విధించిన 25 శాతం జరిమానాను అమెరికా రద్దు చేసింది.

**2026,జులై 24:** భారత్ సహా అన్ని దేశాలపై 150 రోజులపాటు ట్రంప్ విధించిన పదీశాతం సుంకాల గడువు ముగిసిపోయింది.ఐతే భారత్‌లో కార్మికులపై బలవంతంగా మెడలువంచి అధికశ్రమ చేయించి ఉత్పత్తులు చేస్తున్నారనే వంకతో అమెరికా సెక్షన్ 301 కింద ట్రంప్ సుంకాలు విధించారు. దీంతో రద్దుచేసిన పదీ శాతం సుంకాల స్థానంలో ఈ కొత్తసుంకాలు అమలులోకి వచ్చాయి. దీంతోపాటే ఎమ్ఎఫ్ఎన్ పేరుతో ఉన్న రాయితీ సుంకాలు కూడా కొనసాగుతాయి.

**2026, ఫిబ్రవరి 20 :** ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికా సుప్రీంకోర్టు తీర్పు ప్రకటించింది. ఈ తీర్పు ప్రకారం వివిధ దేశాలపై పరస్పర సుంకాలు విధిస్తూ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు రద్దుచేసింది. దీంతో అంతకుమునుపు ఉన్న మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్) అనే హోదాలో తగ్గింపుతో విధించిన సుంకాలు మాత్రమే అమలులోకి వచ్చాయి.

**2026, ఫిబ్రవరి 24:** కోర్టు తీర్పు తర్వాత దొడ్డిదారిన మరోచట్టాన్ని ఉపయోగించి ట్రంప్ కొత్తగా 10 శాతం సుంకాలను అన్ని దేశాలపైనా విధించారు.భారత్‌కు సంబంధించి ఎంఎఫ్ఎన్‌తోపాటు ఈ సుంకాలు కూడా వర్తిస్తాయి. అంటే ఈ పదీశాతం సుంకాలను కేవలం 150 రోజులు అమలులో ఉండేవిధంగా విధించారు.

**2026,సెప్టెంబరు18:** ఉక్రేన్‌పై యుద్ధం చేస్తున్నందుకు రష్యాను,పశ్చిమాసియాలో హోర్ముజ్ జలసంధి మూసివేత,అణు వివాదం పేరుతో ఇరాన్‌ను ఏకకాలంలో దెబ్బతీసేందుకు వీలుగా అమెరికా కాంగ్రెస్ ద్వారా ఆమోదించిన ద లిండ్సే ఓ గ్రాహం శాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ బిల్లు–2026పై ట్రంప్ సంతకం చేశారు. దీంతో ఈ బిల్లు చట్టరూపం దాల్చింది. తద్వారా రష్యా నుండి చమురు,సహజవాయువు దిగుమతులు చేసుకునే భారత్–చైనా సహా సంబంధిత దేశాలపై 100 కు 100 శాతం సుంకాలు విధించేందుకు విశేషాధికారాలు సంక్రమిస్తాయి.

**ప్రస్తుత పరిస్థితి:** భారత్ నుండి అమెరికాకు ఎగుమతి చేసే సరుకులపై సెక్షన్ 301 కింద 10 శాతం సుంకాలు వర్తిస్తాయి. ఐతే కొన్ని వస్తువులకు దీని నుండి మినహాయింపు ఉంటుంది. దీంతోపాటు విభాగాల వారీగా చూస్తే, ఉక్కు,అల్యూమినియం వంటి ఎగుమతులపై 50 శాతం సుంకాలు వర్తిస్తాయి. ఆటో విడిభాగాలపై 25 శాతం సుంకాలు వర్తిస్తాయి. కానీ స్మార్ట్‌ఫోన్లు, ఔషధాలు,ఇంధన ఉత్పత్తులకు వీటి నుండి మినహాయింపు ఉంటుంది.

**అదనపు లేదా పరస్పర సుంకాలు:**

ఉదాహరణకు ఒక చొక్కాను భారత్ నుండి ఎగుమతి చేసి అమెరికాలో విక్రయిస్తే, ఐదూశాతం ఎంఎన్ఎఫ్ సుంకం వర్తిస్తుంది. దీంతోపాటుగా 301 నిబంధన కింద మరో 10 శాతం సుంకం వర్తిస్తుంది. ఈ మొత్తం కలిసి ఆ చొక్కాపై 15 శాతం సుంకం వసూలు చేస్తారు.

## సిఫార్సు

మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం హోం శాఖ దానిని పరిశీలిస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇడి సిఫార్సు ఆధారంగా కేసు నమోదు చేయాలని అడ్వకేట్ జనరల్ సూచించారన్న వార్తలపై ప్రశ్నించగా, శుక్రవారం కార్యాలయం నుండి బయటకు వచ్చిన తర్వాతే ఆ పత్రం తనకు అందిందని, కాబట్టి తాను ఆ అభిప్రాయాన్ని ఇంకా చూడలేదని చెన్నితల చెప్పారు. న్యూఢిల్లీలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని కలిసినప్పుడు ముఖ్యమంత్రి వి.డి. సతీశన్ ఈ కేసు గురించి చర్చిస్తారా అని అడిగినప్పుడు, అటువంటి చర్చ అవసరం లేదని చెన్నితల చెప్పారు. ఇడి చర్య సిపిఐ(ఎం)ను లక్ష్యంగా చేసుకుని, ముఖ్యంగా విజయన్‌ను దెబ్బతీసే ఉద్దేశంతో జరిగిందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ ఆరోపించారు. ‘ఈ దాడి ప్రధానంగా మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు అయిన కామ్రేడ్ పినరయి విజయన్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు మీకు అనిపించవచ్చు. కానీ వాస్తవానికి ఇది సిపిఐ(ఎం) లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దాడి అని బేబీ అన్నారు. కేరళంలో తమ ఉనికిని చాటుకునేందుకు బిజెపి నాయకత్వం ఇప్పుడు ఆ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకుంటోందని, ఇందుకోసం కాంగ్రెస్, యుడిఎఫ్ మద్దతు, సహకారాన్ని పొందుతుందని ఆయన ఆరోపించారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్‌లలో బిజెపి అధి కారంలోకి రావడాన్ని ప్రస్తావించిన బేబీ, స్థానిక కాంగ్రెస్ విభాగాల సహాయంతోనే అది సాధ్యమైందని ఆరోపిం చారు.







## రెవెన్యూ సర్వే

(మొదటి పేజీ తరువాయి)

పొల్చి చూశారు. 325 సర్వే నంబర్‌లో భూమి కలిగి ఉన్న రైతుల పేర్లు, సర్వే వివరాలను సేకరించారు. మర్కూక్ మండలంలోని ఎర్రవల్లి, శివారువెంకటాపూర్, వరదరాజ్‌పూర్ గ్రామాల సరిహద్దులను కూడా గుర్తించి హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే పనులు చివరి దశకు చేరుకోవడంతో అధికారులు సర్వే నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నారు. ఆ తర్వాతే 388 ఎకరాల అసైన్డ్ భూమి లెక్క తేలుతుందని అధికారులు తెలియజేశారు. 325 సర్వే నంబర్లో ఉన్న రైతులకు నోటీసులు జారీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నోటీసులు అందిన తర్వాతే ఎవరి అధీనంలో ఎంత అసైన్డ్ భూమి ఉందనేది తేలుతుంది. కాగా 388 ఎకరాలను గతంలో పేద రైతులకు అసైన్డ్ పట్టాలు ఇచ్చినట్లుగా స్థానికులు పేర్కొంటున్నారు. అయితే మాజీ సిఎం కెసిఆర్ పాలనలో తమ భూముల్లోనే పాండురంగ చెరువును ఏర్పాటు చేయడంతో దానిలో సుమారు 50 ఎకరాల వరకు భూములు కోల్పోయినట్లు తెలిపారు. మిగిలిన భూములను చదును చేసుకొని సాగు చేసుకుంటున్నామని రైతులు పేర్కొంటుండగా, గత పాత భూరికార్డులో తమ పేర్లు ఉన్నప్పటికీ ధరణిలో తమ పేరు రాకపోవడంతో తమకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు రాలేదని వాపోయారు.







Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com